


www.andhrajyothy.com
పేజీలు: 14 + 16
సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 250

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



వెల (Price) : Rs. 6.50




బుధవారం | 25-12-2019 | క్రిస్మస్ శుభాకాంక్షలు

శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి మ. 11.18 తదుపరి అమావాస్య; నక్షత్రం: జ్యేష్ఠ సా. 4.42 తదుపరి మూల; వర్జ్యం: మ. 3.07-4.42, రా. 12.45-2.21; దుర్ముహూర్తం: ఉ. 11.53-12.37; అమృతఘడియలు: ఉ. 8.00-9.35; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 5.44

విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai


# న్యాయం కావాలి!

ఆదుకోవాల్సినవారే అన్యాయం చేస్తే దిక్కెవరు? మంగళవారం రాజధాని రైతులు గుండెలవిసేలా ఇదే ప్రశ్న వేశారు. న్యాయం చేయండి అంటూ హైకోర్టు వద్ద ప్రాధేయపడ్డారు. మోకాళ్లపై నిలబడి జడ్జీల వాహనాలకు మొక్కారు. హైకోర్టు వద్ద జీఎన్‌రావు కమిటీ నివేదిక ప్రతులను లాయర్లు దహనం చేశారు. భూములిచ్చిన రైతులను ఆదుకోవాలంటూ ఓ రాజధాని రైతు ఎన్‌హెచ్‌ఆర్‌సీని కోరారు. రాజధానిలో ఏడోరోజూ నిరసనలు కొనసాగాయి.

## ఒకే స్వరంతో నినదిస్తున్న రాజధాని రైతు




మోకాళ్లపై నిలబడి కార్‌లో వెళుతున్న చీఫ్ జస్టిస్‌కు రైతుల అభివాదం



హైకోర్టు వద్ద జరిగిన నిరసనలో చేతులు జోడించి వేడుకుంటున్న మహిళ

- 'రాజధాని' నిరసనలు ఉధృతం
- శిబిరాల్లోనే రాజధాని గ్రామాలు
- న్యాయం చేయండయ్యా అంటూ హైకోర్టు వద్ద మోకాళ్లపై వేడుకోలు
- వారికి మద్దతుగా లాయర్ల ర్యాలీ
- బెజవాడ నుంచి హైకోర్టు దాకా.. రెండు జిల్లాల లాయర్ల ప్రదర్శన
- రేపు, ఎల్లుండి విధుల బహిష్కరణ
- మోదీ, అమిత్‌షాకు రైతుల లేఖలు
- విజయవాడలో కాగడాల ప్రదర్శన
- హక్కుల కమిషన్ దృష్టికి 'రాజధాని'
- పిల్లాజెల్లాతో మేమంతా రోడ్డుపైనే
- ఎన్‌హెచ్‌ఆర్‌సీకి అన్నదాత ఫిర్యాదు



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

'న్యాయం చేయండి' అంటూ రాష్ట్ర హైకోర్టు వద్దకు చేరుకొని రైతులు అర్థించారు. అటుగా వెళుతున్న ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తుల వాహనాలకు మోకాళ్లపై నిలబడి నమస్కరిస్తూ... ప్రాధేయపడ్డారు. 'రాజధానిని కాపాడండి' అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలను స్పీడ్‌పోస్టు ద్వారా అభ్యర్థించారు. రాజధాని పరిస్థితిని దేశ రాజధాని దాకా వినిపించే ప్రయత్నం చేశారు. 'అమరావతి ఇవ్వండి...లేదంటే ఆత్మహత్యలకు అనుమతి ఇవ్వండి' అంటూ మరికొందరు రైతులు బీజేపీ నాయకులను వేడుకొన్నారు. ప్రాణప్రదమైన భూములను రాజధాని కోసం వదులుకొన్న తాము, ఆ రాజధానిని కాపాడుకోడానికి ప్రాణత్యాగానికైనా సిద్ధమేనని

మిగతా 12వ పేజీలో...



## మీకు నచ్చలేదని మార్చేస్తారా?

13

- ఏ రాష్ట్రంలో అయినా ఇలా జరిగిందా?
- అన్ని ప్రాంతాలకు సమాన దూరం.. అందరి ఆమోదంతో అమరావతి ఎంపిక
- అన్ని వ్యవస్థలూ ఐదేళ్లుగా ఇక్కడి నుంచే
- నాకే స్వార్థముంటే తిరుపతిలో పెట్టేవాడిని
- అన్యాయంపై ప్రతి ఒక్కరూ ఉద్యమించాలి
- పోరాడేవాళ్లకు కులం అంటగడుతున్నారు
- చంద్రబాబు ఆగ్రహం. జేఏసీ నేతలతో భేటీ



## అభివృద్ధి వికేంద్రీకరణ జరగాల్సిందే

10

- అప్పుడే వలసలు తగ్గుతాయి
- అందుకోసమే గూడెంలో 'నిట్'
- ఆకర్షక పథకాలతో మేలు కలగదు!
- నీటి గండాలు పొంచి ఉన్నాయి
- చట్టాలతో మనస్తత్వాలు మారవు
- విద్యార్థుల్లో నైతికత పెరగాలి
- నిట్ స్నాతకోత్సవంలో వెంకయ్య పిలుపు

**అన్నం సహించడంలేదు సార్... ఉపరాష్ట్రపతి వద్ద రాజధాని రైతుల కన్నీరు**



## రాజకీయ రాక్షస క్రీడ!

12

- పాలన వికేంద్రీకరణతో అభివృద్ధి ఎలా సాధ్యం?
- త్యాగం చేసిన రైతులను నాశనం చేయొద్దు
- భీమిలిలో వేల ఎకరాల దోపిడీకే ఈ నిర్ణయం
- అందుకే జేసీ-1, జేసీ-2ల నియామకం
- 22ఏ నుంచి వేల ఎకరాలు తప్పించారు
- వాటిని స్వాహా చేయడానికి ఏర్పాట్లు: సబ్బం హరి



## సీఎం మారితే రాజధాని మారడమా!

13

- చరిత్రలో ఇంత వరకూ ఎక్కడా లేదు
- అపరిపక్వతతో సీఎం ఈ పనికి పూనుకున్నారు
- అమరావతి రైతు సమస్య కాదు.. రాజధానిది
- రాజధాని రైతులకు బీజేపీ పూర్తి మద్దతు
- మా డిమాండు అభివృద్ధి వికేంద్రీకరణ
- పాలనావికేంద్రీకరణ కాదు: బీజేపీ చీఫ్ కన్నా

"స్పెషల్ సెక్రటరీ స్థాయి అధికారిపై డిప్యూటీ కలెక్టర్ ఫిర్యాదు చేయడమా? ఇది హాస్యాస్పదంగా ఉంది. ఇలా అయితే రేపు చీఫ్‌సెక్రటరీ మీద ఒక ఎంఆర్‌వో ఫిర్యాదు చేస్తారు"

"ఇది మంచి పద్ధతి కాదు. పరిపాలించే విధానం ఎంతమాత్రం ఇది కాదు. ప్రభుత్వానికి ఉండే శక్తియుక్తులను ఇటువంటి కక్షసాధింపు చర్యలు చేపట్టడం ద్వారా వృథా చేసుకోకండి. అధికారం ఉంది కాబట్టి చెలాయిస్తామంటే చట్టం అనుమతించదు. అధికారం ఎల్లకాలం శాశ్వతం కాదని గుర్తించి మసలుకోవాలి"

"బోర్డు సీఈవోగా ఉంటే చర్యలు తీసుకోలేరు కాబట్టి, కేవలం కక్ష సాధింపు చర్యలు తీసుకోవడానికే ఆయనను సాధారణ పరిపాలనా విభాగానికి మార్చినట్లుగా ఉన్నారు. తనను తిరిగి కేంద్ర సర్వీసులకు పంపాలని ఆయన కోరినా పంపకుండా వేధింపులకు గురిచేస్తారా? ఆరు నెలలుగా జీతం, పోస్టింగ్ ఇవ్వకుండా ఖాళీగా ఉంచుతారా ? కృష్ణకిశోర్‌కు హానిచేయాలన్న దురుద్దేశంతోనే ఈ విధానాలకు పాల్పడుతున్నట్లుగా ఉంది"

- కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ వ్యాఖ్యలు



జస్టిస్ నరసింహారెడ్డి

# ఇంత కక్షా?

## ఎంత ధైర్యం? ఇదేం పరిపాలన?

**దుష్ట శక్తులు నడిపిస్తున్నాయి.. సర్కారుపై క్యాట్ ఫైర్**

- ఏసీబీ/సీఐడీ దర్యాప్తు చేసేంత తప్పు జాస్తి ఏం చేశారు?
- ఆయన్ని బదిలీ చేసి పోస్టు, వేతనం ఇంతదాకా ఇవ్వరా?
- స్పెషల్ సెక్రటరీ స్థాయి అధికారిపై డిప్యూటీ కలెక్టరు ఫిర్యాదా?
- సీఎస్‌పై ఎమ్మార్వో ఫిర్యాదు చేస్తే ఎలా?
- ఇలాగైతే ఏలేందుకేమీ ఉండదు
- అధికారం శాశ్వతం కాదని గుర్తిస్తే మంచిది
- కృష్ణ కిశోర్ సస్పెన్షన్‌పై 'క్యాట్' ఆగ్రహం.. చర్యలపై స్టే పొడిగింపు
- రెండు వారాల్లో ఆయనకు జీతం చెల్లించాలని ఆదేశం



హైదరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐఆర్ఎస్ అధికారి, ఆర్థిక అభివృద్ధి మండలి (ఈడీబీ) పూర్వ సీఈవో జాస్తి కృష్ణ కిశోర్ సస్పెన్షన్‌పై కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఈ తరహా కక్షపూరితమైన విధానం సరికాదు. ఇదేం పరిపాలన? దురుద్దేశపూర్వకంగా, కక్షసాధింపు ధోరణిలో కొనసాగుతోంది. కృష్ణకిశోర్ తప్పు చేశారంటున్నారు. ఏం తప్పు చేశారు? సస్పెండ్ చేసి ఏసీబీ/సీఐడీ దర్యాప్తునకు ఆదేశించాల్సినంత పెద్ద తప్పా అది? ఆయనపై చేస్తున్న ఆరోపణలకు సంబంధించి... ఆయన మాతృసంస్థ ఆదాయ పన్ను శాఖకు సమాచారం ఇచ్చారా? ప్రభుత్వాన్ని కొన్ని దుష్టశక్తులు నడిపిస్తున్నాయి. ఇలాగే పరిపాలన సాగితే భవిష్యత్తులో పాలించడానికి ఏముండదనే విషయాన్ని గుర్తుంచుకొని మసలుకోవాలి" అని క్యాట్ చైర్మన్ జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి సూటిగా చెప్పారు. తనను సస్పెండ్

మిగతా 2వ పేజీలో...



13

## విశాఖ ఏమంటోంది!?

- రాజధాని ప్రకటనపై గుంభనంగా నగరం.. ప్రజల్లో కనిపించని సందడి, సంబరాలు
- రియల్, ఆతిథ్యరంగాలకు కొత్త ఉత్సాహం.. మహా నగరానికి రాజధానితో కొత్త హంగు
- స్వాగతిస్తున్న వ్యాపారులు, మేధావులు.. సామాన్యుల్లో మాత్రం భిన్నాభిప్రాయాలు
- అద్దెలు, జీవన వ్యయం పెరుగుతాయి.. కొత్తగా జీతాలు పెరిగేదేమీ ఉండదేమో
- కాలుష్యం, నీటి కొరత, ట్రాఫిక్ తంటాలు.. ఇతరుల ఆధిపత్యం పెరగొచ్చనే ఆందోళన

## జనగణ మనం!

- జనాభా లెక్కలకు లైన్‌క్లియర్
- దాంతో పాటే ఎన్‌పీఆర్‌కు కూడా
- రెండింటికీ 13,000 కోట్ల బడ్జెట్
- ఏప్రిల్ 1- సెప్టెంబరు 30 దాకా ఎన్‌పీఆర్, జనగణన నమోదు
- ఎన్ఆర్‌సీతో ఎన్‌పీఆర్‌కు సంబంధం లేదు: ప్రకాశ్ జావదేకర్

11

**దేశవ్యాప్తంగా ఎన్ఆర్సీ ఉండదు: అమిత్ షా**

# సీమకు గోదారి!

## బానకచర్లకు జలాలను తరలిస్తాం



- 60 వేల కోట్లతో ప్రణాళికలు
- సీమ కాల్వల కోసం 23 వేల కోట్లు!
- పోతిరెడ్డిపాడు 80 వేల క్యూసెక్కులకు
- తెలుగుగంగ, నిప్పులవాగు హంద్రీ-నీవా, గాలేరు-నగరి కూడా
- శ్రీశైలం గేట్లు ఎనిమిది సార్లు ఎత్తాం
- 800 టీఎంసీలు సముద్రంపాలు
- కాల్వల సామర్థ్యం పెంచి ఉంటే నేడు ఈ పరిస్థితి ఉండేదా..?
- ప్రాజెక్టులు నిండకపోవడానికి నాటి పాలకులే కారణం
- రాయచోటి సభలో సీఎం జగన్ ధ్వజం.. వైఎస్‌కు ఘననివాళి

కడప, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను రాయలసీమకు తరలిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించారు. రాయలసీమలోని కాల్వల విస్తరణ, అభివృద్ధికి రూ.23 వేల కోట్లతో శ్రీకారం చుట్టబోతున్నట్లు వెల్లడించారు. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కుల నుంచి 80 వేల క్యూసెక్కుల వరకు పెంచుతామని తెలిపారు. కడప జిల్లా రాయచోటి జూనియర్ కళాశాలలో మంగళవారం దాదాపు రూ.2 వేల కోట్లతో

మిగతా 10వ పేజీలో...

## నేటి రాత్రి నుంచి శ్రీవారి ఆలయం మూత

- రేపు సూర్య గ్రహణం
- శ్రీశైలం, బెజవాడ ఆలయాలూ..

3












# ఓం అదే శాశ్వతానందం

*యద్దృశ్యం తన్నశ్యం*

..అంటే కంటికి కనుపించే ఏ దృశ్యమూ శాశ్వతం కాదు. ఎప్పుడో ఒకప్పుడు నాశనం కావలసిందే. ఈ విషయం తెలియని మానవులు అనాదిగా నిరంతరం ఆనందం కోసం తమ కంటికి కనిపించే భౌతిక విషయాలపైనే ఆధారపడి అన్వేషణ కొనసాగిస్తున్నారు. భాషా వికాసం సరిగా లేనప్పుడే బండలపై వేసిన నాట్య భంగిమల వంటివి ఇందుకు ఉదాహరణ. వసంత ఋతువులో చిగిర్చిన చెట్ల నుండి వెలువడే సుగంధ పరిమళాన్ని ఆఘ్రాణించడం.. శరదృతువులో ఆకుల నుండి జాలువారే నీటి బిందువులను చూసి ముచ్చట పడడం.. వాద్యపరికరాల ఇంపైన ధ్వని తరంగాలు విని పులకరించిపోవడం.. ఇవన్నీ భౌతిక విషయాల ద్వారా ఆనందాన్ని పొందే ప్రయత్నాలే. కానీ, ఆ విధంగా పొందే ఆనందం క్షణికమైనది. ఈ సృష్టిలో మానవునికి మాత్రమే పలు దివ్య లక్షణాలను ప్రసాదించిన భగవంతుడు.. బలీయమైన ప్రాపంచిక ఆకర్షణ అనే మాయను కూడా కల్పించాడు. ఆ మాయలో పడి.. ప్రకృతిపరమైన ఆకర్షణలో పరుగులు పెట్టే మానవుడు భగవంతునికి దూరమై భౌతిక బాధలకు గురియై దుఃఖితుడౌతున్నాడు. భగవంతునికి దగ్గరవడమే నిజమైన ఆనందం అని తెలుసుకోలేకపోతున్నాడు. భగవంతుడు సచ్చిదానందస్వరూపుడు. నిత్యానందమే ఆయన ఆస్తి. బంధానికి, మోక్షానికి మనస్సేకారణము. మనసు ఇంద్రియాలతో జతకలిసినప్పుడు మోహం. తన స్వస్థానమైన ఆత్మలో లయించినప్పుడు మోక్షం.



పరంజ్యోతి

*ఆశ కంటే దుఃఖమతిశయంబుగ లేదు*
*చూపు నిలుపకున్న సుఖము లేదు*
*మనసు నిలుపకున్న మరి ముక్తి లేదయా*
*విశ్వదాభిరామ వినుర వేమ*

..అన్నాడు వేమన. మానవుని దుఃఖానికి మూలకారణం ఆశ. కోరికలు ఎంత తగ్గించుకొంటే ఆనందం అంత ఎక్కువౌతుంది. ధారణాబలంతో అంతరంగంలో చూపు నిలిపినట్లైతే శాంతి కలుగుతుంది. నిజానికి మనస్సనేది కోరికల పుట్టే. అభ్యాస, వైరాగ్యాల ద్వారా సంకల్ప రహితస్థితి పొంది తన స్వస్థానమైన ఆత్మలో రమించడమే శాశ్వత ఆనందం. కర్మ, భక్తి, జ్ఞానం.. ఇలా ఏ మార్గమైనను గమ్యమొక్కటే.

**- రెడ్లం రాజగోపాల రావు, 94820 13801**



విద్యుత్ కాంతుల ధగధగలతో విజయవాడలోని గుణదల మేరీమాత ఆలయం

## క్రీస్తు బోధనలతో సన్మార్గం: సీఎం జగన్

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి శుభాకాంక్షలు చెప్పారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంత సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత సహజీవనాన్ని క్రీస్తు ప్రపంచానికి ఆచరణలో చూపారని సీఎం జగన్ మంగళవారం ఒక ప్రకటనలో వివరించారు. శత్రువుల పట్ల కూడా క్షమాగుణం చూపడం తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు ఇచ్చిన మహోన్నత సందేశమని పేర్కొన్నారు. క్రీస్తు బోధనలు మనుషులందరినీ సన్మార్గంలో నడిపిస్తాయని సీఎం జగన్ పేర్కొన్నారు.

### మహోన్నత సందేశాలందించిన ఏసు: చంద్రబాబు

'శాంతి, సంతోషాలకు చిహ్నం క్రిస్మస్. ఏసుక్రీస్తు బోధనలు సదా అనుసరణీయం. మానవాళికి మహోన్నత సందేశాలను బోధించారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించిన ప్రభువు ఏసుక్రీస్తు' అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కొనియాడారు. ప్రపంచంలోని తెలుగు ప్రజలందరికీ ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు సేవ చేయడం ద్వారానే మనుషుల్లో మానవత్వం, సోదరభావం పెంపొందుతాయని, ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గాన్ని అనుసరించాలని సూచించారు. 'ప్రపంచంలో కోట్లాది మంది జరుపుకునే అతి పెద్ద వేడుక క్రిస్మస్. ఈ క్రిస్మస్ పండుగ తెలుగు రాష్ట్రాల్లోని క్రైస్తవ సోదర సోదరీమణులలో సుఖసంతోషాలు నింపాలి.' అని ఆకాంక్షించారు.

### క్రీస్తు బోధనలే మార్గదర్శకాలు: పవన్ కల్యాణ్

క్రీస్తు వెలువరించిన బోధనలే వర్తమాన సమాజానికి మార్గదర్శకాలు అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. క్రైస్తవ సోదరులందరికీ జనసేన పార్టీ తరపున క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సత్యం, ధర్మం, శాంతి సహనం అనే ఆయుధాలను ఏసుక్రీస్తు ప్రపంచానికి అందించారన్నారని చెప్పారు. ధర్మం కోసం అడుగులు వేసే ఎవరైనా సత్యాన్ని నిర్భయంగా ప్రకటిస్తారనేది క్రీస్తు జీవితం మనకు తెలియజేస్తుందని పేర్కొన్నారు. సత్యాన్ని ప్రకటించడంలో శాంతి, సహనాలను క్రీస్తు ఎప్పుడూ విడిచిపెట్టలేదన్నారు.

# ఉల్లి దారిలోనే..



## రిటైల్ మార్కెట్లో వెల్లుల్లి కిలో రూ. 200పైమాటే!

- హోల్‌సేల్‌లో రూ.80 నుంచి రూ.160
- మార్కెట్‌లో గరిష్ఠానికి చేరిన ధర
- బెంబేలెత్తుతున్న జనం
- సంక్రాంతి తర్వాత ఇతర రాష్ట్రాల సరుకు
- అప్పటి వరకూ ఆందోళనే!



రాజమహేంద్రవరం మార్కెట్లో తోడుపుబండిపై వెల్లుల్లి విక్రయాలు

రాజమహేంద్రవరం, పిఠాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూరలు, పచ్చళ్ల, మసాలాలు.. ఇలా ప్రతి వంటకంలోనూ వెల్లుల్లిది ప్రత్యేక స్థానం. అయితే ఉల్లి దారిలోనే వెల్లుల్లీ పరుగు పెడుతోంది. ఉల్లి ధరలతో పోటీపడి కొనుగోలుదారులు బెంబేలెత్తిస్తోంది. కూరల్లో ప్రధానంగా వినియోగించే ఈ రెండింటి ధరలు ఇప్పుడు ఆకాశాన్నంటి.. జనానికి చుక్కలు చూపిస్తున్నాయి. ఎప్పుడూ కిలో రూ.10 నుంచి రూ.20 మధ్య దొరికే ఉల్లి బహిరంగ మార్కెట్లో రూ.200 పైబడిన విషయం తెలిసిందే. ఇప్పుడు కొంత తగ్గుముఖం పట్టినా కిలో రూ.100 పైబడే అమ్ముతున్నారు. ఇక, కొద్ది నెలల క్రితం కిలో రూ.40కి దొరికే వెల్లుల్లి పలు మార్కెట్లలో ఇప్పుడు ఏకంగా రూ.200-250 పలుకుతోంది. వెల్లుల్లి విక్రయాలకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రసిద్ధి. ఇక్కడి హోల్‌సేల్ మార్కెట్‌లో చిన్న పాయలు కిలో రూ.100-110 ఉంది. లాడువా రకం కిలో రూ.120- 130 పలుకుతోంది. ఫుల్‌గోలా రకం కొద్ది రోజుల క్రితం వరకు రూ.150 నుంచి రూ.160 వరకు ఉంది. నాణ్యత ఆధారంగా వెల్లుల్లిని నాలుగైదు కేటగిరీల్లో విక్రయిస్తారు. ప్రజలు తమ అవసరాల నిమిత్తం కిరాణా దుకాణాల్లో ఎక్కువగా కొనుగోలు చేస్తూంటారు. ఇదే అదనుగా రిటైల్‌లో చిన్న వెల్లుల్లిని కూడా కిలో రూ.200 వరకు అమ్ముతున్నారు. పిఠాపురంలో మాత్రం రూ.200 దాటే అమ్ముతున్నారు. వెల్లుల్లిని నాణ్యమైన వాటినే వినియోగించేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తారు. దీంతో కిలో 200-250 మధ్య పలికే వెల్లుల్లికే అధిక డిమాండ్ ఉంది. ఇక్కడి హోల్‌సేల్ మార్కెట్‌లో నాసిరకం వెల్లుల్లి రూ.80-100 పలుకుతుండగా, నాణ్యమైనవి రూ.160-180 మధ్య ఉంది. మరోవైపు ఆలస్యమయ్యే కొద్దీ వెల్లుల్లి ఆరిపోతుందని, దీంతో బస్తా బరువు తగ్గిపోవడం వల్ల నష్టపోతున్నామని వ్యాపారులంటున్నారు. మూడు కిలోలకు కిలో వరకు తరుగు వస్తుందంటున్నారు. ఈ కారణం వల్లే వ్యాపారులు ఇష్టానుసారంగా అమ్ముతున్నారనే వాదన కూడా ఉంది.

### గూడెం ప్రధాన మార్కెట్!

మధ్యప్రదేశ్‌లో ఇటీవల కొత్త వెల్లుల్లి దిగుబడి మొదలైంది. కానీ రాజమహేంద్రవరం మార్కెట్‌కు అది రావడం లేదు. నిల్వ ఉంటే నల్లగా మారిపోతుందంటున్నారు. పైగా ఇటీవల తాడేపల్లిగూడెం ప్రధాన మార్కెట్‌గా మారడంతో అక్కడికే కొత్తపాయలు ముందు వస్తాయని, ఇక్కడకు వచ్చేసరికి ఆలస్యమవుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

### రాష్ట్రంలో పంట లేకే..!

ఉల్లి పంట రాష్ట్రంలో ఎక్కడా పండడం లేదు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో ఎక్కువగా పండిస్తారు. తూర్పు గోదావరి జిల్లాకు మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర నుంచి వెల్లుల్లి వస్తుంది. సరుకు వచ్చిన రెండు నెలల్లోగా వినియోగించకుంటే నాణ్యత దెబ్బతినడం ప్రారంభమవుతుంది.

### ఆ రాష్ట్రాల నుంచి సరుకు వస్తేనే!

ఇటీవల దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో వెల్లుల్లి పంట దెబ్బతిన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీనివల్లే దిగుబడులు తగ్గాయంటున్నారు. డిమాండ్ అధికంగా ఉండటం, సరుకు లేకపోవడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నట్లు పేర్కొంటున్నారు. సంక్రాంతి తర్వాత మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెల్లుల్లి పంట వచ్చే అవకాశం ఉంది. అక్కడ అధికంగా దిగుబడులు వస్తే రేటు తగ్గుముఖం పట్టే అవకాశముందని వ్యాపారులు తెలిపారు. లేకుంటే ఇదే ధర కొనసాగుతుందని చెప్పారు. మార్చి నుంచి ఆవకాయ సీజను కావడం, డిమాండ్ అధికంగా ఉండే అవకాశమున్న నేపథ్యంలో కొత్త పంట వచ్చినా రేటు తగ్గదల స్వల్పంగానే ఉండవచ్చంటున్నారు.

## లోకం తీరు




నిధులు ఇస్తాడనుకుంటే..
చెరొక గాలి బుడగ ఇచ్చి వెళ్లాడు..

### చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 18.0 | 27.3 |
| అనంతపురం | 18.0 | 24.2 |
| విశాఖపట్నం | 19.4 | 28.4 |
| విజయవాడ | 21.0 | 29.4 |
| ఒంగోలు | 22.3 | 29.1 |

### శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమలలో మంగళవారం రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 75 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి దాదాపు 15 గంటలు పడుతోంది. గురువారం సూర్యగ్రహణం సందర్భంగా ఎలాంటి ఆర్జితసేవలు వారపు సేవలు ఉండవు. కాబట్టి బుధవారం లక్కీడిప్‌ను రద్దు చేశారు.



### జాతీయతావాదంలో హిందూసమాజం నపుంసకం

జాతీయతావాదం విషయంలో హిందూ సమాజం నూటికి నూరుశాతం నపుంసక పోకడలను అనుసరిస్తోంది. అలా నపుంసకంగా జీవించేవారి వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను హిందూసమాజం సరిగ్గా అర్థం చేసుకోలేకపోతోంది. ఇక ముస్లింల నుంచి దేశభక్తిని ఆశించడమంటే పెద్ద మూర్ఖత్వమే అవుతుంది.

**- శంభాజీ భిడే, శివ్ ప్రతిష్ఠాన్ హిందుస్థాన్ చీఫ్**



### 2024కల్లా ఆకాశవాణి డిజిటల్ రేడియో

ఆకాశవాణిని పునర్ వ్యవస్థీకరిస్తాం. 2024కల్లా 'డిజిటల్ రేడియో' రూపంలో అత్యాధునిక సాంకేతిక హంగులతో దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం. రేడియో ప్రసార రంగంలోని ప్రైవేటు చానళ్లతో పోటీపడేలా దాన్ని తీర్చిదిద్దుతాం. స్పష్టమైన సౌండ్ ఎఫెక్ట్‌లతో.. ఇప్పుడున్న వాటి కంటే నాలుగు రెట్లు ఎక్కువ స్టేషన్లతో దేశంలో ఎక్కడివారైనా ప్రసారాలు పొందేలా ఆకాశవాణి డిజిటల్ రేడియో ఉంటుంది.

**- ప్రకాశ్ జావడేకర్, కేంద్ర మంత్రి**

## నా కొడుకు ప్రాణం నిలబెట్టండి!

- కిడ్నీలు పాడై క్షీణిస్తున్న ఆరోగ్యం
- ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు 15లక్షల ఖర్చు
- కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చిన తల్లి
- ఆపరేషన్‌కు డబ్బుల్లేక ఇబ్బందులు
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు



నాగరాజు (ఫైల్)

నూజివీడు టౌన్, డిసెంబరు 24: చిన్నతనంలోనే తండ్రి దూరమయ్యాడు. తల్లి కూలి పనులు చేస్తూనే కొడుకుని ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ చదివించింది. డిగ్రీ చేతికొచ్చిన తర్వాత తల్లికి అండగా నిలవాల్సిన కొడుకు.. రెండు కిడ్నీలూ పాడైపోవడంతో ఆమెకు మరింత భారమయ్యాడు. కిడ్నీ ఇచ్చేందుకు తల్లి ముందుకొచ్చినా.. ఆపరేషన్‌కు డబ్బుల్లేక ఆపన్నహస్తం కోసం ఆమె వేడుకుంటోంది. గుంటూరు జిల్లా అమృతలూరు మండలానికి చెందిన మైలా నాగరాజు చిన్నప్పటి నుంచి చదువులో ముందుండేవాడు. తల్లి కష్టపడి చదివిస్తే ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. కొన్నాళ్లుగా నాగరాజు కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. అది తీవ్రం కావడంతో వైద్యులు మూత్రపిండాల మార్పిడి చేయాలన్నారు. ఆపరేషన్‌కు రూ.15 లక్షలకుపైగా ఖర్చు అవుతుందన్నారు. ఓ కిడ్నీ ఇచ్చేందుకు తల్లి ముందుకొచ్చినా.. శస్త్రచికిత్సకు డబ్బుల్లేక ఆ ప్రక్రియ ఆగిపోయింది. తోటి విద్యార్థులు రూ.7 లక్షలు సేకరించి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా రమాదేవికి అందజేశారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సైతం మరో రూ.25వేలు సేకరించారు. ఇంకా ఆరేడు లక్షలు కావాల్సి రావడంతో ఆ నిరుపేద తల్లి దిక్కుతోచని స్థితిలో ఉంది. వ్యాధి తీవ్రత కావడంతో నాగరాజు ప్రస్తుతం విజయవాడలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. తన కుమారుడిని బతికించుకోవడం కోసం రమాదేవి దాదల సాయం కోరుతోంది. ఆర్థిక సహాయం అందించాలనుకునే వారు 7013957862 లేదా 9959614216 ఫోన్ నంబర్లను సంప్రదించాలని లేదా మైలా నాగరాజు అకౌంట్ నంబర్ 20332016662 ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0014367 అమృతలూరు బ్రాంచ్‌కు పంపి తన కొడుకు ప్రాణాలు కాపాడాలని వేడుకుంటోంది.

## 'ఆయేషా'కు న్యాయం చేయండి!

- తండ్రి ఇక్బాల్ ప్రత్యక్షపోరు
- హత్యాచారం జరిగిన డిసెంబరు 27న బెజవాడలో దీక్ష

తెనాలి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): "దిశ నిందితులను కాల్చి చంపారు. నిర్భయ దోషులకు ఉరివేయబోతున్నారు. మరి మా అమ్మాయి ఆయేషా ఏం పాపం చేసుకుంది? ఆమెను దారుణంగా హత్యాచారం చేసిన హంతకులను ఎందుకు వదిలేశారు? ఇప్పటి వరకు ఎందుకు గుర్తించలేక పోయారు? ఈ విషయాన్ని ప్రత్యక్ష పోరాటంతోనే తేల్చుకుంటా" అని బీఫార్మసీ విద్యార్థిని, హత్యాచారానికి గురైన ఆయేషా మీరా తండ్రి ఇక్బాల్ బాషా వెల్లడించారు. తన పోరాటానికి ప్రజాసంఘాలు, విద్యార్థులు, మహిళలు మద్దతు పలకాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయేషాపై దారుణం జరిగిన డిసెంబరు 27నాడే విజయవాడలోని ధర్నాచౌక్‌లో సత్యాగ్రహ దీక్షకు దిగుతున్నట్టు చెప్పారు. నిర్భయ, దిశ కేసుల్లో జరిగిన న్యాయం 13 ఏళ్లు గడిచినా తమ కుమార్తె కేసులో జరగలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఏ ప్రభుత్వమూ సహకరించలేదని, అందువల్లే న్యాయపోరాటానికి దిగుతున్నామని తెలిపారు. "నేరస్తులను శిక్షిద్దాం. న్యాయాన్ని పరిరక్షిద్దాం. ఆడబిడ్డలను కాపాడుకుందాం" నినాదంతో పోరాటానికి దిగుతున్నట్టు చెప్పారు. ఆయేషా నిందితులను పట్టుకుని శిక్షవేయటంతోనే తమకు, తమ కుమార్తెకు న్యాయం జరుగుతుందన్నారు. ఇన్నేళ్లయినా తమ పాపకు న్యాయం జరగకపోవడానికి తాము మైనారిటీలం కావడం ఒక్కటే కారణమా? అని ప్రశ్నించారు. ఆయేషామీరా న్యాయపోరాట కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

# ఇంత కక్షా?

(మొదటి పేజీ తరువాయి)

చేయడంతోపాటు తనపై ఏసీబీ/సీఐడీ దర్యాప్తునకు ఆదేశిస్తూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను జాస్తి కృష్ణకిశోర్ 'క్యాట్'లో సవాల్ చేసిన విషయం తెలిసిందే. ఆయన పిటిషన్‌ను 'క్యాట్' చైర్మన్ జస్టిస్ లింగాల నరసింహారెడ్డి, సభ్యులు బీవీ సుధాకర్‌ల ధర్మాసనం మంగళవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం తీరును ధర్మాసనం తూర్పారబట్టింది. ఆయనను సస్పెండ్ చేస్తూ ఇచ్చిన జీవో అమలును నిలిపివేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను జనవరి నెలాఖరు వరకు పొడిగించింది. కృష్ణకిశోర్‌కు చెల్లించాల్సిన బకాయి వేతనాలను రెండు వారాల్లోగా చెల్లించాలని తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

### ఇది మంచిపద్ధతి కాదు...

"ఒక బాధ్యతాయుతమైన వ్యక్తిగా చెబుతున్నా. ఈ తరహా దురుద్దేశంతో కూడిన, కక్షసాధింపు పరిణామాలు ప్రభుత్వాన్ని సమస్యల్లోకి నెట్టేస్తాయి. స్పెషల్ సెక్రటరీ స్థాయి అధికారిపై డిప్యూటీ కలెక్టర్ ఫిర్యాదు చేయడమా? ఇది హాస్యాస్పదంగా ఉంది. ఇలా అయితే రేపు చీఫ్ సెక్రటరీ మీద ఒక ఎంఆర్‌వో ఫిర్యాదు చేస్తాడు. కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు పనిచేయడానికి వచ్చిన అధికారిపై వ్యవహరించి తీరేనా ఇది? అయినా పీవీ రమేశ్ ఎవరు? ఈడీబీ సీఈవోపై చర్య తీసుకునేందుకు ఆయనకున్న అధికారాలేమిటి?" అని జస్టిస్ నరసింహారెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రం విజ్ఞప్తి మేరకు కేంద్ర సర్వీసుల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఒక అధికారిపై ఇంత కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు.

"ఈడీబీ సీఈవోగా డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు వచ్చిన కేంద్ర సర్వీసులకు చెందిన అధికారిని, ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా ఉన్న ఆయనను రాష్ట్ర సర్వీసులోకి ఎలా బదిలీ చేస్తారు? ఈ తరహా చట్టవిరుద్ధమైన చర్యలు తీసుకోవడానికి ఎంత ధైర్యం? బోర్డు సీఈవోగా ఉంటే చర్యలు తీసుకోలేరు కాబట్టి... కేవలం కక్షసాధింపు చర్యలు తీసుకోవడానికే ఆయనను సాధారణ పరిపాలనా విభాగానికి మార్చినట్లుగా ఉన్నారు" అని జస్టిస్ నరసింహా రెడ్డి అభిప్రాయపడ్డారు. "ఆరు నెలలుగా జీతం, పోస్టింగ్ ఇవ్వకుండా ఖాళీగా ఉంచుతారా? కృష్ణకిశోర్‌కు హానిచేయాలన్న(సినిస్టర్) ఉద్దేశంతోనే ఈ తరహా విధానాలకు పాల్పడుతున్నట్లుగా ఉంది. ఇటువంటి దురుద్దేశంతో కూడిన కక్షసాధింపు చర్యలు ప్రభుత్వానికి తలవంపులు తేవడంతోపాటు సమస్యల్లోకి నెట్టేస్తాయి" అని జస్టిస్ నరసింహారెడ్డి స్పష్టం చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు.

### వాడి వేడి వాదనలు...

**అం**తకుముందు ట్రైబ్యునల్ ముందు కృష్ణ కిశోర్ తరపు న్యాయవాది నీరజ్ మల్హోత్రా బలమైన వాదనలు వినిపించారు. "28 ఏళ్ల సర్వీసులో మచ్చలేని అధికారిగా కృష్ణకిశోర్‌కు పేరుంది. జగతి పబ్లికేషన్స్ ఆస్తులను ఆయన గతంలో మదింపు చేశారు. దీంతో కృష్ణకిశోర్‌పై కక్ష పెంచుకున్నారు. నిజానికి మదింపు అధికారి ఇచ్చిన నివేదికను న్యాయస్థానంలో సవాల్ చేశారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత తనను మాతృసంస్థకు పంపించాలని కోరుతూ ఈ ఏడాది మే 19న కృష్ణకిశోర్ రాష్ట్ర ప్రభుత్వానికి రాతపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. తనకు చీఫ్ కమిషనర్‌గా పదోన్నతి వచ్చే అవకాశం ఉందని, కాబట్టి వెంటనే తనను రిలీవ్ చేయాలని కోరారు. దీనికి స్పందన లేకపోవడంతో జూలై 3న మరో విజ్ఞాపనపత్రం పంపారు. అదే రోజున ఆయనను ఎక్స్‌అఫీషియో సెక్రటరీగా జీఏడీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అప్పటి నుంచి జీతం, పోస్టింగ్ ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నారు. కక్షసాధింపు ధోరణితోనే కేంద్ర సర్వీసులకు చెందిన అధికారిని ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోంది" అని నీరజ్ మల్హోత్రా వాదనలు వినిపించారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం తరపున జీపీ గోవిందరెడ్డి వాదనలు వినిపించారు. "కృష్ణకిశోర్ ఈడీబీ సీఈవోగా విధులు నిర్వహించిన సమయంలో అక్రమాలకు పాల్పడ్డారు. డిప్యుటేషన్ గడువు పూర్తయ్యేవరకూ సదరు అధికారులను వెనక్కుపంపరాదని కేంద్ర సిబ్బంది వ్యవహారాల విభాగమే ఉత్తర్వులు ఇచ్చింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఎంతగా రాజకీయ కక్షతో వ్యవహరించారో అందరికీ తెలుసు. అధికారం ఎల్లకాలం శాశ్వతం కాదనే విషయాన్ని వాళ్లు కూడా గుర్తుంచుకోవాలి" అని ఆయన వాదించారు. దీనిపై కృష్ణకిశోర్ తరపు న్యాయవాది స్పందిస్తూ.. జీపీ వాదనతో అసలు గుట్టు రట్టయ్యిందని, రాజకీయ కక్షతోనే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు.

## హక్కుల కమిషన్ దృష్టికి 'రాజధాని'

- భూములిచ్చిన రైతులను ఆదుకోండి
- పిల్లాజెల్లాతో మేమందరం రోడ్డుపైనే
- ఐనా సర్కార్‌కు చీమకుట్టినట్టైనా లేదు
- ఎన్‌హెచ్‌ఆర్‌సీకి అన్నదాత ఫిర్యాదు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కొందరు రాష్ట్ర మంత్రులు రాజధానిపై చేస్తున్న ప్రకటనలతోపాటు జీఎన్ రావు కమిటీ చేసిన సూచనలు అమరావతికి భూములిచ్చిన వేలాదిమంది రైతులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నాయని జాతీయ మానవ హక్కుల సంఘానికి పొదిలె వెంకటేశ్వరరావు అనే రైతు ఫిర్యాదు చేశారు. రాజధాని తమ ప్రాంతంలో వస్తుందన్న అభిప్రాయంతో దాని నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ ప్రాతిపదికన భూములిచ్చిన 29 గ్రామాలకు చెందిన రైతుల్లో ఈయన కూడా ఒకరు. రాజధాని గ్రామాల్లోని రైతులు, వారి కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని తన పిటిషన్‌లో వెంకటేశ్వరరావు కోరారు. "'నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిగా రాష్ట్రానికి నడిబొడ్డున ఉన్న అమరావతిని ఎంపిక చేసినట్లు గత టీడీపీ ప్రభుత్వం ప్రకటించి, అందుకు అవసరమైన భూములను పూలింగ్ ప్రాతిపదికన ఇవ్వాల్సిందిగా కోరితే 29 గ్రామాలకు చెందిన 24,000 మందికిపైగా రైతులు సుమారు 34,000 ఎకరాలను అందజేశారు. ఆ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం మేరకు భూములిచ్చిన రైతులకు బదులుగా అందజేసిన రిటర్నబుల్ ప్లాట్లను ఏపీసీఆర్డీయే ద్వారా పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచి, అప్పగించాల్సి ఉంది. గత ప్రభుత్వం అమరావతి మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా రైతులిచ్చిన భూముల్లో రహదారులు, కట్టడాలు చేపట్టడంతో ఆ భూముల స్వరూపాలు, స్వభావాలు పూర్తిగా మారిపోయాయి. అయినప్పటికీ తాము త్యాగం చేసిన భూముల్లో బ్రహ్మాండమైన, అంతర్జాతీయస్థాయి రాజధాని రూపుదిద్దుకుంటోందని రైతులు, వారి కుటుంబసభ్యులు ఎంతగానో సంతసించారు. అయితే.. ఈ నెల 17న సీఎం జగన్ రాజధానిని అమరావతి నుంచి వికేంద్రీకరించే యోచన ఉందంటూ చేసిన ప్రకటన, ఆ తర్వాత మూడు రోజులకు ఇంచుమించుగా అవే ప్రతిపాదనలు చేసిన జీఎన్‌రావు కమిటీ నివేదిక, అనంతరం పలువురు మంత్రులు అదే తరహాలో చేసిన ప్రకటనలతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో తమ భవిష్యత్తును తలచుకుని వేలాదిమంది రాజధాని రైతులు, వారి కుటుంబసభ్యులు 10 రోజులుగా నిద్రాహారాల్లేకుండా గడుపుతున్నారు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు అన్న తేడా లేకుండా అందరూ రోడ్లపైకి వచ్చి ఆందోళనలు జరుపుతున్నా ప్రభుత్వ పెద్దలకు చీమ కుట్టినట్లయినా లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే, రైతులు, వారి కుటుంబసభ్యులకు ఆత్మహత్యలే శరణ్యమయ్యే దుస్థితి తలెత్తవచ్చు. జాతీయ మానవ హక్కుల సంఘం వెంటనే స్పందించి, వారిని ఆదుకునేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరుతున్నాను' అని అభ్యర్థించారు.



### 'లేజర్ అల్ట్రాసౌండ్'లో మనిషి ఇలా..

ఇది మనిషి లేజర్ అల్ట్రాసౌండ్ చిత్రం. ప్రపంచంలోనే తొలిసారిగా దీన్ని అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) శాస్త్రవేత్తలు చిత్రీకరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అల్ట్రాసౌండ్ స్కానింగ్‌తో చర్మానికి, కంటికి హాని ఉండేది. కానీ ఎంఐటీ శాస్త్రవేత్తలు అభివృద్ధిపరిచిన సరికొత్త లేజర్ ఆధారిత అల్ట్రాసౌండ్ పరికరం చర్మానికి ఎలాంటి హాని చేయకుండానే అవయవాలు, శరీర భాగాల చిత్రాలను సేకరించగలదు.

### 'రామన్' సూత్రంతో.. వైరస్ ఫొటోలు

సూక్ష్మాతిసూక్ష్మంగా ఉండే వైరస్‌ల ఫొటోలు తీయడంతో పాటు వాటి పుట్టుపూర్వోత్తరాలనూ చెప్పేయగల సరికొత్త పరికరాన్ని అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. వైరస్‌ల గుట్టు బట్టబయలు చేసేది కాబట్టి దానికి 'వైరియాన్' అని పేరుపెట్టారు. ఇది ప్రఖ్యాత భారత శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ ప్రతిపాదించిన రామన్ వర్ణమాలాదర్శనం(స్పెక్ట్రోస్కోపీ) సూత్రం ఆధారంగా పనిచేస్తూ.. వైరస్‌ల కదలికలను పసిగడుతుంది. భవిష్యత్తులో ప్రతీ డాక్టర్ వద్ద స్టెతస్కోపుతో పాటు 'వైరియాన్' కూడా అవకాశాలు లేకపోలేదు.



### భారీ కొండచిలువ హతం

**తూ**ర్పుగోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం పశువుల్లంక గ్రామంలో మంగళవారం భారీ కొండచిలువ గ్రామస్థుల చేతిలో హతమైంది. లంక కొబ్బరితోట, రొయ్యల చెరువు సమీపంలో ఉన్న గుడిసె ఆవరణలో సుమారు పన్నెండు అడుగుల భారీ కొండచిలువ ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గ్రామస్థులు ఆ కొండచిలువను కొట్టి చంపారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

*-ఐ.పోలవరం*

# స్పాట్ అడ్మిషన్లకు 'స్పాట్'

- వృత్తివిద్యా కోర్సుల్లో ఇష్టారాజ్యం
- అభ్యర్థుల పేర్ల అప్‌లోడ్‌లో జాప్యం
- గడువు దాటిన తర్వాతా రాటిఫికేషన్
- పేర్లు తొలగింపు, జోడింపులోనూ చేతివాటం
- ఇంజనీరింగ్, బీఫార్మసీ, ఎంబీఏ
- అడ్మిషన్లలో కళాశాలల అక్రమాలు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బీటెక్, ఎంటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంబీఏ, బీఈడీ తదితర వృత్తివిద్యా కోర్సుల స్పాట్ అడ్మిషన్లలో కొన్ని కళాశాలలు అక్రమాలకు పాల్పడుతున్నాయి. ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్స్)కు సంబంధించి అడ్మిషన్ల కన్వీనర్లు ఇచ్చిన షెడ్యూల్‌ను పాటించకుండా అక్రమాలకు తెగబడుతున్నాయి. కన్వీనర్ కోటాలోని సీట్ల భర్తీకి పలు విడతల్లో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసుకునేందుకు వీలుగా స్పాట్ అడ్మిషన్లకు ఉన్నత విద్యా మండలి వెసులుబాటు కల్పించింది. ఈ అవకాశాన్ని కాలేజీ యాజమాన్యాలు సద్వినియోగం చేసుకోకుండా.. అడ్డదారుల్లో లాభార్జనకు తెరదీశాయి. స్పాట్ కింద అడ్మిషన్ కల్పించదలచుకున్న అభ్యర్థుల పేర్లను కాలేజీలు సకాలంలో వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆలస్య రుసుముతో అప్‌లోడింగ్‌కు అవకాశం ఇస్తే ఆ మేరకు ఫీజు చెల్లించి గడువులోగా హార్డ్ కాపీని ఉన్నత విద్యా మండలికి అందజేయాలి. ఈ విధానాన్ని అన్ని కాలేజీలు అనుసరించాలి. అయితే, పలు కాలేజీలు నిర్దేశిత గడువు లోగా అభ్యర్థుల పేర్లను వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం లేదు. ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయి. సెట్ ర్యాంకర్లను చేర్చుకునేందుకు సమయం పడుతుంది కాబట్టి.. ఇతర రాష్ట్రాల నుంచి అభ్యర్థులను స్పాట్‌లో చేర్చుకునే ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. తాము చెప్పిన అభ్యర్థుల పేర్లను ఎలాగైనా సరే రాటిఫై చేయాలంటూ ఉన్నత విద్యా మండలిలోని సెట్స్ విభాగంలో పైరవీలకు పాల్పడుతున్నాయి. స్పాట్ నిబంధనలకు విరుద్ధంగా గడువు దాటిన తర్వాత చేసుకున్న అడ్మిషన్లను రాటిఫై చేసేందుకు సిబ్బంది చేతులు తడుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిలో భాగంగా.. తొలిదశ కౌన్సెలింగ్‌లో సీటు పొందిన అభ్యర్థులు రిపోర్టు చేయనప్పుడు.. ఆయా అభ్యర్థులకు సంబంధించిన సీట్లను రెండో దశలో ఖాళీగా చూపించాలి. కానీ అలా చేయకుండా వారి స్థానంలో కొత్తవారి పేర్లను మాన్యువల్‌గా అనుమతించి తర్వాత పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు సమాచారం.

### అడ్మిషన్ షెడ్యూల్ ఇదీ..

ఎంసెట్ అడ్మిషన్లకు అభ్యర్థుల పేర్ల అప్‌లోడింగ్‌కు 2019 సెప్టెంబరు 17 వరకు గడువుంది. హార్డ్ కాపీల సమర్పణకు సెప్టెంబరు 20 వరకు గడువు ఇచ్చారు. బీఫార్మసీ అడ్మిషన్లకు అప్‌లోడింగ్‌కు 2019 అక్టోబరు 8 వరకు, హార్డ్ కాపీల సమర్పణకు అక్టోబరు 10 వరకు గడువు ఇచ్చారు. పీజీఈసెట్ అడ్మిషన్లకు అభ్యర్థుల పేర్ల అప్‌లోడ్‌కు అక్టోబరు 5 వరకు, హార్డ్ కాపీల సమర్పణకు అదేనెల 11 వరకు గడువుంది. ఐసెట్ అడ్మిషన్లకు అభ్యర్థుల పేర్ల అప్‌లోడ్‌కు సెప్టెంబరు 20 వరకు, హార్డ్ కాపీల సమర్పణకు అక్టోబరు 3 వరకు గడువు ఇచ్చారు. కాలేజీల అభ్యర్థన మేరకు బీఫార్మసీ, పీజీఈసెట్, ఐసెట్ అడ్మిషన్లకు ఈ ఏడాది అక్టోబరు 15 వరకు అవకాశం ఇచ్చినా.. ఇప్పటికీ స్పాట్ కింద రాటిఫికేషన్ చేస్తుండటం గమనార్హం.

### వెలుగు చూసిన అక్రమాలు

- నెల్లూరు జిల్లా గూడూరులోని ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కి చెందిన దాదాపు 20 మంది ఇతర రాష్ట్ర అభ్యర్థుల పేర్లను గడువులోగా వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనప్పటికీ స్పాట్ కింద రాటిఫై చేశారు. ఇదే కాలేజీకి చెందిన ఐసెట్ అడ్మిషన్లలో 11 మంది అభ్యర్థులకు స్పాట్ కింద చేసిన రాటిఫికేషన్‌లో కొందరికి లంచాలు ముట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- నెల్లూరు జిల్లాలోని సన్ ఫార్మసీ కళాశాలలో కూడా కొందరి పేర్లు తొలగించి ఆ స్థానంలో కొత్త వారి పేర్లు యాడ్ చేసినట్లు తెలుస్తోంది.
- గుంటూరు జిల్లాలోని మిట్టపల్లి ఇంజనీరింగ్ కాలేజీ ఎంటెక్ స్పాట్ అడ్మిషన్లలో 30 మంది అభ్యర్థుల పేర్లను నిబంధనలకు విరుద్ధంగా ఉన్నత విద్యా మండలి సిబ్బంది రాటిఫికేషన్ చేసినట్లు సమాచారం.
- విశాఖపట్నం జిల్లాలోని ఇమ్మాన్యుయెల్ ఎంఫార్మసీ కళాశాలలో గడువు లోగా ఒక అభ్యర్థి పేరు అప్‌లోడ్ చేయనందుకు రూ.50 వేలు ఫైన్ వేసి రాటిఫై చేశారు.
- పశ్చిమగోదావరి జిల్లాలోని గ్రేప్స్ కళాశాలలో ఫార్మసీ అడ్మిషన్లకు సంబంధించి 20 మంది అభ్యర్థుల పేర్ల రాటిఫికేషన్‌లోనూ అక్రమాలు జరిగినట్లు తెలిసింది.

## ముత్తూట్‌లో బాత్రూంకు కన్నం వేసి..
## 70 కిలోల బంగారం చోరీ

బెంగళూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బాత్‌రూమ్‌కు కన్నం వేసి ఫైనాన్స్ సంస్థ కార్యాలయంలోకి జొరబడిన దొంగలు 70 కిలోల బంగారు ఆభరణాలను అపహరించారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో శనివారం అర్ధరాత్రి ఈ చోరీ జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. తూర్పు విభాగం డీసీపీ శరణప్ప మంగళవారం ఈ వివరాలను మీడియాకు వివరించారు. పులకేశినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెణ్ణూరు-బాణసవాడి రోడ్డులో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయంలో ఈ చోరీ జరిగింది. దొంగలు బీరువాలను గ్యాస్ కట్టర్‌తో కత్తిరించారని, ఖాతాదారులు కుదువ పెట్టిన రూ.16 కోట్ల విలువైన బంగారాన్ని దోచుకెళ్లారని డీసీపీ చెప్పారు. కార్యాలయ సిబ్బంది పులకేశినగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నామని, పోలీస్ కమిషనర్ భాస్కర్‌రావు, అదనపు పోలీస్ కమిషనర్ మురుగన్ ఘటన స్థలాన్ని పరిశీలించారని చెప్పారు.

## నేటి రాత్రి 11గంటలకు శ్రీవారి ఆలయం మూత

తిరుమల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూర్యగ్రహణాన్ని పురస్కరించుకుని ఈనెల 25వ తేదీ బుధవారం రాత్రి నిర్ణీత సమయం కన్నా ముందుగానే తిరుమల శ్రీవారి ఆలయాన్ని మూసివేయనున్నారు. 26వ తేదీ ఉదయం 8.08-11.16 గంటల మధ్య సూర్యగ్రహణం సంభవించనున్నందున అందుకు 9 గంటల ముందుగా.. బుధవారం రాత్రి 11 గంటలకే ఆలయ ప్రధాన తలుపులు మూసివేస్తారు. ఆ సమయం వరకు ఎంతమంది దర్శనం చేసుకోగలరో అంచనావేసి ఆ మేరకు మాత్రమే భక్తులను క్యూకాంప్లెక్స్‌ల్లోకి అనుమతిస్తారు. ఆ వెంటనే క్యూలైన్ల ప్రవేశ ద్వారాలన్నింటికీ తాళాలు వేస్తారు. బుధవారం ఉదయం కేవలం ప్రొటోకాల్, శ్రీవాణి ట్రస్టు దర్శనాలకే 'బ్రేక్' పరిమితం చేశారు. దీంతోపాటు స్లాటెడ్ దివ్య, సర్వదర్శన టోకెన్ల సంఖ్యను కుదించారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డ తల్లిదండ్రుల ప్రత్యేక ప్రవేశాలను పూర్తిగా రద్దు చేశారు. గురువారం మధ్యాహ్నం12 గంటలకు ఆలయ తలుపులు తెరిచి, 2 గంటల నుంచి స్వామివారి దర్శనం పునఃప్రారంభిస్తారు.

## ఏపీపీ పోస్టులకు ఇంటర్వ్యూలు

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు జనవరి 3నుంచి 5 వరకూ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అమిత్ గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పాఠ్యపుస్తకాల ప్రమాణాలకు పెద్దపీట: శ్రీనివాసరెడ్డి

విజయవాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాణాలతో కూడిన పాఠ్య పుస్తకాల ప్రచురణకు తొలి ప్రాధాన్యమిస్తామని నవ్యాంధ్ర తెలుగు అకాడమీ వ్యవస్థాపక సంచాలకుడు ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి చెప్పారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలుగు అకాడమీ తెలంగాణకు పరిమితమైంది. దీంతో ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రభుత్వం తెలుగు అకాడమీని ఏర్పాటు చేసి, శ్రీనివాసులురెడ్డిని ప్రథమ సంచాలకుడిగా నియమించింది. సోమవారం ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర నుంచి శ్రీనివాసరెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలోని తన కార్యాలయంలో మంగళవారం విధులకు హాజరయ్యారు. ఇంటర్, డిగ్రీ, బీఈడీ, డీఎల్‌ఈడీ కోర్సులకు సంబంధించి పాఠ్యపుస్తక ప్రచురణకు తొలి ప్రాధాన్యమిస్తానని ఈ సందర్భంగా చెప్పారు.

## నేతన్న హస్తం అందలేదని
## చేనేత కార్మికుడి ఆత్మహత్య

సోమందేపల్లి, డిసెంబరు 24 : వైఎస్సార్ నేతన్న హస్తం సాయం అందలేదని చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకొన్న సంఘటన అనంతపురం జిల్లా సోమందేపల్లిలో మంగళవారం జరిగింది. సోమందేపల్లికి చెందిన నీలూరి నరసింహులు (43) చేనేత వృత్తితో జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు కూతుళ్లు కూడా ధర్మవరంలో ఉంటూ మగ్గం నేస్తున్నారు. చేనేతకు అందించే వైఎస్సార్ నేతన్న హస్తం కోసం దరఖాస్తు చేసుకున్నా సాయం అందక పోవడంతో ఆవేదన చెందారు. సోమవారం రాత్రి నరసింహులు తన ఇంటి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెనుకొండ సీఐ శ్రీహరి తెలిపారు.

## అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

కంబదూరు/బ్రహ్మసముద్రం, డిసెంబరు 24: అప్పుల బాధతో అనంతపురం జిల్లాలో మంగళవారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కంబదూరు మండల కేంద్రంలోని మారెమ్మగుడి కాలనీకి చెందిన రైతు జి.బలరామ్ యాదవ్(47) తనకున్న ఆరెకరాల భూమిలో బోర్లు వేయడానికి, పంటల సాగు, పెట్టుబడులకు సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. అటు పంటలు చేతికిరాక, బోర్లలో నీరు ఇంకిపోవడంతో రుణదాతల ఒత్తిళ్లు అధికమయ్యాయి. చేసిన అప్పులు ఎలా తీర్చాలన్న వేదనతో మంగళవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లి పురుగులు మందు తాగాడు. మృతునికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బ్రహ్మసముద్రం మండలం సూగేపల్లికి చెందిన రైతు కురుబ కరేగౌడ్(45) తనకున్న నాలుగున్నర ఎకరాల పొలంలో బోర్లు వేసేందుకు, సాగుకు బ్యాంకులు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.8 లక్షల అప్పు చేశాడు. పంట చేతికిరాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలని మనోవేదనకు గురై పురుగుల మందు తాగాడు.

## పంటల బీమాకు ఈ-కర్షక్ యాప్

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమలు చేయడానికి 'ఈ-కర్షక్' పేరుతో వ్యవసాయ శాఖ కొత్త యాప్‌ను సిద్ధం చేస్తోంది. ఈ యాప్ ద్వారా పంటలను నమోదు చేసి, రైతుల వివరాలను పంటల బీమా పథకంలో నమోదు చేసేలా ఆలోచన చేస్తున్నారు. ఈ-కర్షక్ యాప్ రూపకల్పనపై వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ మంగళవారం జేడీఏలు, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



ఆలయం ముందు జస్టిస్ అరుప్ కుమార్ గోస్వామి, జస్టిస్ సంజయ్ కరోల్, ప్రపంచబ్యాంక్ భారతదేశ డైరెక్టర్ జునైద్ అహమ్మద్

## తిరుమలేశుడి సేవలో
## ప్రధాన న్యాయమూర్తులు

తిరుమల, డిసెంబరు 24: తిరుమల శ్రీవారిని మంగళవారం సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుప్‌కుమార్ గోస్వామి, పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో వేర్వేరుగా ఆలయంలోకి వెళ్లిన వీరు ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వారిని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు ప్రసాదాలు అందజేశారు.

### శ్రీవారిసేవలో ప్రపంచబ్యాంక్ భారతదేశ డైరెక్టర్

ప్రపంచ బ్యాంక్ ఇండియా డైరెక్టర్ జునైద్ అహమ్మద్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

## సార్వత్రిక సమ్మెలో
## పాల్గొంటాం

- ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్

విజయవాడ (బస్‌స్టేషన్), డిసెంబరు 24: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా జనవరి 8న చేపట్టిన సమ్మెకు ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) మద్దతు ఇచ్చిందని, ఈ సమ్మెలో ఆర్టీసీ ఉద్యోగులు కూడా పాల్గొంటారని యూనియన్ రాష్ట్ర నేతలు వైవీ రావు, పి.దామోదరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని మంగళవారం ఆర్టీసీ ఎండీ కృష్ణబాబుకు సమ్మె నోటీసు ఇచ్చినట్లు వారు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.21వేలుగా నిర్ణయించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. మరికొన్ని సమస్యల పై కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఆర్టీసీ ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొనాలని వారు ప్రకటనలో కోరారు.


**VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)**

**CIRCLE -1 ENGINEERING**

'e' Procurement Tender Notice No. Rc. E6/DB/119991/19/T.No.26, Dt. 23-12-2019.

| Sl. No. | Name of Work | Estimate Amount |
|---|---|---|
| 1 | a) Construction of CC roads, b) Providing 300 MM dia DI Pumping main c) Supply of G.I., HDPE & C.I Material d) Spot Billing for Metered Water Supply Tap Connections e) Painting to 1500KL Priyadarshini Colony ELSR f) Maintenance of G.I & M.S pipe line leaks g) Providing water facilities with power bore with Submergible pump set in Circle-I area no. of works -12 | Rs. 230.14 lakhs |

Contact : E.E-1, VMC, Vijayawada - 520 001.
Further details can be seen@ 'e'procurement market place @ www.apeprocurement.gov.in
Download of bid documents starts from 27-12-2019 @ 10.30 A.M.
Last date / time for receipt of bids 10-01-2020 upto 15-00 hours
Sd/- A. SATYANARAYANA RAO for Commissioner

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
**పబ్లిక్ హెల్త్ & మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నం. 4 to 6/PNGR/DB/ATO/2019 తేది: 18.12.2019
నెల్లూరు జిల్లాలో వనరుగా A.V.R.H.N.S.S. పుంగనూర్ బ్రాంచ్ కెనాల్‌తో పుంగనూర్ నీటి సరఫరా పథకం క్రింద 3 పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. **అంచనా విలువ: రూ.113,38,379/- మూడు పనుల కొరకు.** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 20.12.2019న ఉ. 11.00 గం.లకు. బిడ్ల డౌన్‌లోడ్ కొరకు ఆఖరి తేది: 03.01.2020న మ. 2.00 గం.ల వరకు. బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది: 03.01.2020న సా. 5.00 గం.ల వరకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.e.procurement.gov.in వద్ద చూడవచ్చును. ఫోన్: 0861-2328649.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ సర్కిల్, నెల్లూరు
DIPR RO No.1405/CL/ADVT/1/1/2019-20, తేది:24.12.2019






**సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్**
**(మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఉన్నత విద్యాశాఖ, భారత ప్రభుత్వం)**
**మానసగంగోత్రి, మైసూర్-570006, ఇండియా.**

**ప్రకటన-వాక్-ఇన్-ఇంటర్వ్యూ**

ఆంధ్రప్రదేశ్-**నెల్లూరు** వద్ద దాని కేంద్రానికి సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ ప్రాజెక్టు క్రింద, క్లాసికల్ తెలుగులో అధ్యయనం కొరకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో **2 నం.ల లోయర్ డివిజన్ క్లర్క్** ఉద్యోగానికి అర్హతగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.
దరఖాస్తు మరియు తదుపరి వివరాలకు ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్: **www.ciil.org under Announcements** చూడగలరు. పూర్తి చేసిన దరఖాస్తును తపాలా ద్వారా **"డైరెక్టర్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్, మానసగంగోత్రి, హున్సూర్ రోడ్, మైసూర్-570006, కర్ణాటక"** వారికి పంచవచ్చును (లేదా) ఇంటర్వ్యూ సమయంలో దాఖలు చేయవచ్చు.

**అసిస్టెంట్ డైరెక్టర్ (Admin)**
**Ciil-మైసూర్**

davp 21248/11/0008/1920

**GOVERNMENT OF INDIA**
**DEPARTMENT OF SPACE**
**NATIONAL ATMOSPHERIC RESEARCH LABORATORY**
**Construction and Maintenance Division**
**Gadanki - 517 112**
**Fax: 08585 272018 / 20, Phone: 08585 272006 / 0877 2500611**

**24-12-2019**

1. On Behalf of the President of India, online item-rate tenders are invited for the following works.

| Sl. No. | Title of work & NIT No. | Estimated cost (₹ in lakhs) | Earnest Money Deposit (EMD) |
|---|---|---|---|
| 1. | Augmentation to X-BAND Radar Building at NARL, Gadanki. Tender Notice No: NARL/CMD/E-Tender /MJ/C/09/2019-20, dated 20.12.2019 | ₹ 54.34 lakhs | ₹ 1,08,680.00 |

| | |
|---|---|
| Period during which the request for tender document can be downloaded | From 10:00 hrs on 25.12.2019 to 16:00 on 08.01.2020 |
| Bid Clarifications | From 10:00 hrs on 26.12.2019 to 16:00 on 09.01.2020 |
| Last date of reply to Bid clarification | 10.01.2020 up to 11:00 hrs |
| Last date and time for receipt of tenders | 13.01.2020 up to 14:30 hrs |
| Due date and time of opening of tenders | 16.01.2020 after 14:30 hrs |

2. Interested tenderers may please log on **www.tenderwizard.com/ISRO** for eligibility, Terms & Conditions and participating in tenders. For further details please contact this office of Head, CMD, NARL, Gadanki over phone No. 08585 272006 / 0877 2500611or visit our website **www.narl.gov.in**

**Sd/- Head, CMD**




# మరో అస్త్రం

పౌరసత్వ చట్టం, పౌర జాబితాలమీద దేశం ఆగ్రహిస్తున్న తరుణంలోనే కేంద్రమంత్రివర్గం జాతీయ జనాభా పట్టిక రూపకల్పనకు సంబంధించిన కీలకమైన అడుగువేసింది. నాలుగేళ్ళక్రితం ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన డేటాకు మరిన్ని అదనపు వివరాలు చేర్చడం ద్వారా ఈ నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పీఆర్)ను ఆధునీకరించబోతున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో దీనిని జనాభాలెక్కల సేకరణ తొలివిడత కార్యక్రమంతో కలిపి ప్రభుత్వం అమలు జరపబోతున్నది. ప్రభుత్వం ఎన్ని వాదనలు చేస్తున్నప్పటికీ, ఇప్పటికే కొత్త పౌరసత్వ చట్టాన్నీ, దేశవ్యాప్త ఎన్నార్సీనీ ప్రజలు ఒకదానికొకటి కలగలిపి అనుమానిస్తునే ఉన్నారు. తాము ఎన్నడూ ఎన్నార్సీ చర్చచేయనే లేదని ప్రధాని ఓ పక్క అంటున్నా, పలుమార్లు అమిత్ షా చేసిన ఉద్ఘాటనల ముందు ఆయన వాదన ప్రజలకు నమ్మకం కలిగించలేకపోతున్నది. ఇంతటి ఉక్కపోత మధ్య, దేశప్రజల జాతకాలను నమోదుచేసే మరో కొత్త కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తెచ్చినప్పుడు భయాలు, అనుమానాలు రేగకతప్పదు.

సర్వసాధారణంగా సాగిపోయే కార్యక్రమాలు సైతం ఇప్పుడు ప్రజలకు పెను సవాళ్ళుగా కనిపిస్తున్నాయి. ఎన్‌పిఆర్‌కు ఎన్నార్సీకి ఎంతమాత్రం సంబంధం లేదని ప్రకాష్ జవదేకర్ అంటున్నప్పటికీ, దేశంలోని ప్రతీ ఒక్కరి పౌరసత్వాన్నీ నిగ్గుతేల్చే ఎన్‌పిఆర్ ఆధారంగానే ఎన్నార్సీ రూపొందబోతున్నదని ఐదేళ్ళక్రితం హోంశాఖ సహాయమంత్రిగా కిరణ్ రిజిజు లోక్‌సభలో చేసిన ప్రకటన ఇప్పుడు అందరికీ గుర్తుకొస్తున్నది. రిజిస్ట్రార్ జనరల్ వార్షిక నివేదికలోని పదిహేనవ చాప్టర్ సైతం ఎన్నార్సీకి ఎన్పీఆర్ పునాది అనే అంటున్నది. ఈ ఏడాది జులై 31గెజిట్‌నోటిఫికేషన్ సైతం ఈ రెండింటి మధ్యా ఉన్న బంధాన్ని వివరిస్తున్నది. అనధికారంగా బీజేపీ నాయకులు తమ వ్యాఖ్యల్లో ఎన్‌పిఆర్‌ను తాము ఆశిస్తున్న మత ప్రక్షాళనకు అస్త్రంగా ప్రదర్శించడం, ప్రశంసించడం గతంలో జరిగినదే. ఎన్‌పిఆర్‌మీద ప్రజలకు ఏ అనుమానాలూ అక్కరలేదన్న ప్రభుత్వ పెద్దల వాదనలో నిజమున్నపక్షంలో, దేశవ్యాప్త ఎన్నార్సీ ఉన్నదీ లేనిదీ వారు ఇప్పటికే నిర్దిష్టంగా తేల్చివుంటే బాగుండేది. ఎన్నార్సీకి నివాసితుల జాబితా ఆధారం కనుక, అది ముస్లింల ఏరివేతకు ఉద్దేశించిందన్న విమర్శలున్నందున, ఎన్నార్సీపై చర్చే చేయలేదని మాటమాత్రంగా అంటున్న ప్రధాని దానిని నిర్వహించబోవడం లేదని గట్టిగా చెప్పివుంటే ఈ కొత్త అప్‌డేషన్ ప్రక్రియను దానితో కలగలిపి చూసే వీల్లేకుండా ఉండేది. మన పాలకులకు విషయ స్పష్టత, విశ్వసనీయతకంటే, కొన్ని వర్గాలను నిత్యం భయంలో ఉంచడం, తీవ్ర గందరగోళం మధ్య సమాజంలో చీలికలు సృష్టించడం కావాలి.

అభివృద్ధి కొలమానంగా భావిస్తున్న జనాభా లెక్కల మాదిరిగానే, ఎన్‌పిఆర్‌ను సైతం ఓ ప్రక్రియగా తప్పుబట్టాల్సిందేమీ ఉండదు. కానీ, సరికొత్త ఎన్‌పిఆర్‌లో అదనంగా కొన్ని అంశాలను చేర్చినట్టుగా వస్తున్న వార్తలే అనుమానాలు రేపుతున్నాయి. స్థానికంగా నివాసించేవారి ఈ డేటా సేకరణ సుదీర్ఘ పత్రాల నింపుడు కార్యక్రమం కాదనీ, సమర్థింపు డాక్యుమెంట్ల ఏమాత్రం అవసరం లేని సాధారణ వివరాలు సరిపోతాయని ప్రభుత్వం అంటున్నది. ఆధునిక సాంకేతికతను అద్భుతంగా వాడుకోవచ్చని హామీ ఇస్తున్నది. కానీ, 15 అంశాలున్న గత ఎన్‌పిఆర్‌కు ఇప్పుడు అదనంగా మరో ఆరు చేరినట్టు చెబుతున్నారు. పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు ఇత్యాదివి 'స్వచ్ఛందం' అని వదిలేస్తున్నప్పటికీ, తల్లి, తండ్రి, జీవితభాగస్వామి పేర్లు కొత్తగా ఒక అంశంగా వచ్చిచేరాయి. మరీ ముఖ్యంగా, తల్లిదండ్రులు పుట్టిన తేదీ, స్థలం, గత నివాస వివరాలు తెలియచేయవలసి ఉంది. ఉంటుంది. ఎన్‌పిఆర్ అమలవుతున్నంత మాత్రాన ఎన్నార్సీ రాక ఖాయమని భావించనక్కరలేదు కానీ, దానికిది పునాదిగా, బలమైన ఊతంగా ఉపకరిస్తుందన్నది నిజం. ఎన్నార్సీని వ్యతిరేకిస్తున్న రాష్ట్రాలు ఎన్‌పిఆర్‌ను నిలిపివేయాలనుకోవడానికి ఇదే కారణం. వారం క్రితం మమతాబెనర్జీ ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు బంగ్లాదేశీ చొరబాటు దారులను రక్షించుకోవడానికి ఆమె దేశభద్రతను ప్రమాదంలో పడేస్తున్నదంటూ బీజేపీ నాయకులు వ్యాఖ్యానించారు. కొన్ని ప్రభుత్వ విభాగాలకు మాత్రమే అందుబాటులో ఉండే ఈ డేటా దుర్వినియోగం కాబోదన్న నమ్మకమూ లేదు. ఎన్నార్సీకీ, ఎన్‌పిఆర్‌కు సంబంధం లేదని అంటున్నవారే రెండు వేర్వేరు అంశాలైన జనాభా లెక్కలనూ, ఎన్‌పిఆర్‌ను ఉద్దేశపూర్వకంగా కలగలుపుతున్నారు. దేశభద్రత రీత్యా యూపీఏ ఆమోదించి, ఆచరించిన కార్యక్రమాన్ని ఇప్పుడు సరికొత్త రూపంలో నెత్తికెత్తుకోవడం వెనుక 'అనుమానితుల'ను వేరు చేసే లక్ష్యం ఉండివుండవచ్చు. పాలకుల ఏ హామీనీ ప్రజలు నమ్మలేని దుస్థితి నెలకొనడం విషాదం.

## జనవాక్యం

### రహదారులు అధ్వాన్నం

రాష్ట్రంలో రహదారుల నిర్వహణ నానాటికి తీసికట్టుగా మారింది. ఏ దారి చూసినా గోతుల మయం. రాత్రి వేళల్లో మరింత భయానకం. ఎక్కడా వీధి దీపాలు వెలగవు. రేడియం మార్కింగ్ కానరాదు. కనీసం విభాజికాలకు కూడా రేడియం మార్కింగ్ వేయకపోవటం దారుణం. రహదారుల నిర్వహణ ఇంత అధ్వాన్నంగా ఉన్నా ఏ ఒక్క ప్రజాప్రతినిధి పట్టించుకోవటం లేదు. పన్నులు, టోల్ గేట్ టాక్సులు వసూలు చేస్తున్నా, రహదారుల సక్రమ నిర్వహణ తమ బాధ్యత కాదన్నట్లు రహదారుల శాఖ వ్యవహరించటం శోచనీయం. పాలకులు ఈ లోపాలన్నింటినీ సరిదిద్ది ప్రజల ప్రాణాలను కాపాడాలి.

– **కంభంపాటి కోటేశ్వర రావు,** విశాఖపట్నం

### అమలు కాని వాగ్దానాలు

ప్రమాణ స్వీకారం రోజున ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పింఛనులను 65 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు తగ్గిస్తూ తొలి సంతకం చేశారు. అయితే ఆ హామీ ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. ఆపైన రకరకాల నిబంధనలు, సర్వేలు చేయిస్తూ గత ప్రభుత్వంలో పింఛనులు పొందిన అర్హుల పింఛనులు కూడా తొలగిస్తున్నారు. ఇలా అయితే ఇంకా విశ్వసనీయత ఎక్కడ? తానిచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి ఓసారి సమీక్షించుకుంటే మంచిది. చట్టాలు చేసేయటం, సంతకాలు పెట్టేయటంతోనే కథ ముగియదు, అక్కడే ప్రారంభం అవుతుంది. ఈ సూక్ష్మాన్ని తెలుసుకోకుంటే భంగపాటు తప్పదు.

– **గరిమెళ్ళ రామకృష్ణ,** ఏలూరు

# పౌరసత్వ సత్యాలు – తప్పుడు ప్రచారాలు



■ జి. కిషన్ రెడ్డి

పౌరసత్వ సవరణ చట్టాన్ని కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధికి ఉపయోగించుకుంటున్నాయి. చట్టంలోని వాస్తవాలను దాచి పెట్టి కొన్ని వర్గాలకు నష్టం కలుగుతుందని అబద్ధపు ప్రచారం కొనసాగిస్తున్నాయి. తద్వారా ఆయా వర్గాల్లో అభద్రతను సృష్టించి భయాందోళనలకు గురి చేస్తున్నాయి. మాయమాటలతో వారితో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేయించి హింసాత్మక చర్యలకు పాల్పడేలా సమాజంలో అశాంతిని సృష్టిస్తున్నాయి. స్వేచ్ఛా పిపాసులు, ఆలోచనాపరులైన భారతీయులారా ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు. ప్రభుత్వం ఏ విషయాలనూ దాచడం లేదు. పౌరసత్వ చట్ట సవరణతో ఏ వర్గానికీ ఎలాంటి నష్టం జరుగదు. మాది ప్రజల ప్రభుత్వం, నీతివంతమైన ప్రభుత్వం. అందుకని, ఎవరికైనా ఎలాంటి నష్టమైనా జరిగిందీ అంటే, అది భాజపాయేతర పక్షాల వల్లే అనేది సుస్పష్టం. ఈ చట్టంలోని వాస్తవాలను తెలుసుకుని సొంతంగా ఆలోచించి అడుగేయండి. కానీ, ప్రతిపక్షాలు, ఇతరులు చెప్పింది నమ్మవద్దు.

తమ రాజకీయ లబ్ధికోసమే ఈ చట్టం గురించి కొందరు తప్పుడు సమాచారమిస్తూ, ప్రభుత్వంపై విద్వేష ప్రచారం సాగిస్తున్నారు. ఈ చట్టం గురించి మాట్లాడే ముందు కొన్ని చారిత్రక అంశాలనూ పరిశీలించాలి. దేశ స్వాతంత్ర్య సమయంలో మహ్మద్ అలీ జిన్నా మత ప్రాతిపదికన దేశ విభజనను కోరుకున్నారు. మతపరమైన విభజనను కాంగ్రెస్‌తో సహా అందరూ వ్యతిరేకించారు. అయినా, బ్రిటిషు వారు తమ స్వీయ ప్రయోజనాల కోసం దేశాన్ని విభజించి పాకిస్థాన్ ఏర్పాటుకు కారకులయ్యారు. అప్పట్లో పాకిస్థాన్‌లో స్థిరపడదలచుకున్న వారు అక్కడికి వెళ్లగా, కొంతమంది అక్కడి నుంచి భారత్‌కూ వచ్చారు. ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్‌లలో అధికారిక మతం ఇస్లాం. పాకిస్థాన్ నుంచి విముక్తి పొందిన బంగ్లాదేశ్ కూడా తన అధికారిక మతంగా ఇస్లాంను ప్రకటించుకుంది. ఈ నేపథ్యంలో 1930లో భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ ప్రధాన మంత్రి లియాఖత్ అలీల నేతృత్వంలో మైనారిటీల రక్షణకు సంబంధించి ఇరుదేశాల మధ్య ఢిల్లీలో ఒక ఒప్పందం జరిగింది. దీని ప్రకారం రెండు దేశాలూ తమ మైనారిటీల రక్షణకు చర్యలు తీసుకోవాలి. అయితే, మన దేశం మైనారిటీల రక్షణకు చర్యలు తీసుకోగా, పాక్ ఈ విషయంలో విఫలమైంది. ఈ కారణంగా పొరుగు దేశంలో తీవ్ర పీడన, అణచివేతకు గురవుతున్న మైనారిటీలు అక్కడ ఉండలేక వలస బాట పట్టాయి. గతంలో జరిగిన చారిత్రక తప్పిదాలను చక్కదిద్ది పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లలో పీడనకు గురవుతున్న మైనారిటీల బాధలు తీర్చేందుకు, మోదీ ప్రభుత్వం మానవతా దృక్పథంతో తీసుకు వచ్చిందే ప్రస్తుత చట్టమని గమనించాలి. విద్వేష ప్రచారాలతో, తప్పుడు సమాచారంతో ప్రజలను గందరగోళంలోకి నెడుతున్న శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిణత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే రీతిలో సాగే ఈ దుష్ప్రచారాలను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. రాజ్యాంగ సూత్రాలను అంగీకరించి వాటికి బద్ధులై వ్యవహరిస్తూ, అహింసా సూత్రాలపై అచంచల విశ్వాసం ప్రకటిస్తూ, సమష్టి తత్వాల బలంపైన భారత ప్రజాస్వామ్యం ఆధారపడి పని చేస్తుంది. ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని నిలబడింది. కొన్ని సమూహాల్లా, సమాజాల్లా మన ఉనికి, జాతీయత అనేవి ప్రాంతీయ గుర్తింపు, మత విశ్వాసాలు, సామాజిక కట్టుబాట్లు, ఆలోచనలకు పరిమితమైనవి కావు. వాటికన్నా అతీతమైనదని ప్రపంచానికి మనం భరోసా ఇస్తున్నాం. అన్నింటికన్నా ముందు మనం భారతీయులం. మనల్ని ఒక్కటిగా కలిపి ఉంచుతున్నది, కాపాడుతున్నది, రక్షిస్తున్నది ఈ భావనే. మనం సహోదరుల్లా కలిసి మెలసి ఉంటూ సమష్టిగా పురోగతి సాధించడాన్ని సహించలేని శక్తులు సృష్టిస్తున్నా కూడా ఈ సమష్టితత్వమే మనల్ని ఒక్కటిగా కలిపి ఉంచుతున్నది.




పౌరసత్వ చట్టం పొరుగున ఉన్న మూడు దేశాలలో పీడనకు గురవుతున్న మైనారిటీలకు ఉద్దేశించినది తప్ప ఎవరికీ నష్టం కలిగించేది కాదు. దేశంలోని కుల, మత, వర్గాలకు చెందినవారెవరూ ఈ చట్టం విషయంలో భయపడాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని ప్రజలందరికీ నేను హామీ ఇస్తున్నాను.

పుకార్లు, గందరగోళంతో ఆవేదన చెందుతున్న ప్రజలు, ప్రత్యేకించి యువతకు నేను కొన్ని విషయాలు తెలియజేయాలనుకుంటున్నాను. సరైన సమాచారం తెలుసుకోవడం, తగిన నిర్ణయాలు తీసుకునే హక్కు పౌరులకు ఉన్నాయి. పౌరసత్వ సవరణ చట్టం చుట్టూ చక్కర్లు కొడుతున్న పుకార్లు, తప్పుడు సమాచారం కీలక హక్కును హరించి వేస్తున్నాయి. ఒక వర్గం సంకుచిత ప్రయోజనాలే పరమావధిగా తయారు చేసిన ఇలాంటి అబద్ధపు సమాచారం, పుకార్లు స్వతంత్ర పౌరులుగా ప్రజలకున్న మౌలిక హక్కును హరించి వేస్తున్నాయి. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర ఆనవాయితీని నెలకొల్పే అవకాశం కూడా ఉంది. ఈ విషయంలో ఇతరుల ప్రభావం వల్ల కాకుండా, మీకు మీరుగా సంతృప్తి చెందితేనే స్పందించమని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను. మనం స్వతంత్రంగా వ్యవహరించాలని కోరుకుంటాం. ఇతరులు చెప్పినట్లు చేస్తే మన హక్కులు వినియోగించనట్లే కదా? ఎవరో ఇతరుల కోసం పని చేసినట్లు కాదా? మన యువత అలా ఒకరికి సేవకులుగా పని చేయాలని నేను అనుకోవడం లేదు. వారు వాస్తవాలు తెలుసుకుని సమాజంలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చూడాలని నేను కోరుకుంటున్నాను.

పౌరసత్వ చట్టం, పొరుగున్న ఉన్న మూడు దేశాలలో పీడనకు గురవుతున్న మైనారిటీలకు ఉద్దేశించినది తప్ప ఎవరికీ నష్టం కలిగించేది కాదు. దేశంలోని కుల, మత, వర్గాలకు చెందినవారెవరూ ఈ చట్టం విషయంలో భయపడాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని ప్రజలందరికీ నేను హామీ ఇస్తున్నాను. ఇది ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో అంతులేని పీడనను భరించలేక భారత్‌కు వలస వచ్చిన వారికి సంబంధించినది. మానవతా దృక్పథంతో తీసుకున్న ఈ నిర్ణయంపై ఎందుకు హింసా విధ్వంసాలు? పొరుగున ఆయా దేశాలలో అంతులేని పీడన కారణంగా విషాదాన్ని ఎదుర్కొన్న కుటుంబాల బాధను తీర్చేందుకు తీసుకు వచ్చిన సవరణ చట్టం ఇది. ఈ సవరణ చట్టం కిందికి రాని వారికి పౌరసత్వాన్ని ఏ రకంగానూ నిరోధించడం లేదన్నది అర్థం చేసుకోవాలి. ఈ చట్టం కింద అలాంటి వారికి ఇప్పటికీ కొన్ని ప్రొవిజన్లు ఉన్నాయి. అక్రమ వలసలు, మానవ హక్కులు, అంతర్గత భద్రత సంక్లిష్టమైన అంశాలు. వీటికి సంబంధించి గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. ఇందులో భాగంగానే పార్లమెంటు ఆమోదంతో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మరో ఉపశమన చర్య ఈ పౌరసత్వ చట్ట సవరణ. నిర్మాణాత్మక చర్చలు జరపడం, అభిప్రాయాలు ప్రకటించడం ప్రజాస్వామ్యంలో స్వాగతించదగినది. అంతేకాదు, చర్చా సంస్కృతి ప్రజాస్వామ్యాన్ని మరింత పరిపుష్టం చేస్తుంది కూడా. పార్లమెంటులోని ఉభయ సభలు అలాంటి చర్చావేదికను ఏర్పరుస్తున్నాయి. ఇక్కడ ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి, తమ ఆలోచనలను, ప్రత్యామ్నాయ పద్ధతులను సూచించడానికి అవకాశం ఉంది. అలా చర్చించి ఒక నిర్ణయానికి రావచ్చు. పౌరసత్వ సవరణ బిల్లును ఉభయ సభలూ ఆమోదించి, రాష్ట్రపతి ఆమోద ముద్ర పడిన తర్వాత కొందరు దీనిపై అనుచిత రాద్ధాంతం చేస్తూ, హింసకు పాల్పడుతున్నారు. రాజ్యాంగం ప్రకారం పాటించవలసిన ప్రక్రియను సిఏఏ విజయవంతంగా పూర్తిచేసుకున్న అనంతరం ఈ హింసాత్మక దాడులు, గందరగోళం ఏమిటో విచిత్రం. ప్రస్తుత సామాజిక మాధ్యమాల యుగంలో, ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసేందుకు, ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామిక వ్యవస్థలను దెబ్బతీసేందుకు తప్పుడు సమాచారం ఒక ఆయుధంగా ఉపయోగపడగలదని మనం అర్థం చేసుకోవాలి. అయితే, ఈ సమస్యను అధిగమించడం కష్టమేమీ కాదు. తగిన జాగ్రత్త, ఎరుకతో ఉండడం ద్వారా దీనిని ఎదుర్కోవచ్చు. ఇందుకు మనం చేయవలసిందల్లా మన ఆలోచనా పరిధిని విస్తృతం చేసుకుంటూ, మన మేధస్సును ఉపయోగించి, సానుకూల, వ్యతిరేక అంశాలను బేరీజు వేసుకుంటూ స్పందించడమే. తప్పుడు ప్రచారాలూ, దురాశాపూరిత ఎత్తుగడలు సరైన ఆలోచనాపరులను ఏ మాత్రం ప్రభావితం చేయలేవు.

*(వ్యాసకర్త కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి)*

# బిజెపి వైఖరిలో మార్పు వస్తుందా?

ఇండియాగేట్



■ ఎ. కృష్ణారావు

తీవ్రమైన శీతాకాలంలోనైనా అగ్ని రాజుకునేలా చేయడంలో భారతీయ జనతా పార్టీకి సాటి రాగలిగిన పార్టీ మరేదీ లేదని మరో సారి రుజువు అయింది. 1992 డిసెంబర్ 6 ఘటన నుంచి, ఈ డిసెంబర్ రెండవ వారంలో పౌరసత్వ సవరణ చట్టం చేయడం వరకూ బిజెపి లక్షణాలు, లక్ష్యాలు పెద్దగా మారలేదన్న విషయం మరెవరూ నిరూపించనవసరం లేదు. 'ఆఫీసుకు ఎలా రావాలి సార్, మెట్రోలు, బస్సులు పనిచేయడం లేదు, మా సీలంపూర్ ప్రాంతం అంతా అల్లర్లు జరుగుతున్నాయి. అడుగడుగునా ట్రాఫిక్ ఆంక్షలు, పోలీసుల స్వైర విహారం. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయం వేస్తోంది. ఢిల్లీ నగరంలో ఈ పరిస్థితి ఎప్పుడూ చూడలేదు' అని గతవారం ఒక ఆఫీసు అటెండర్ చెబుతుంటే ఏమి జవాబు చెప్పాలో అర్థం కాలేదు. అసలు ఈ చట్టం ఇప్పుడు అవసరమా సార్, ప్రశాంతంగా ఉన్న వాతావరణం చెడిపోయింది.. అని అతడు వాపోయాడు. 'గత నెలరోజులుగా ఉల్లి గడ్డల ధర కిలోకు రూ.120 కంటే తక్కువకు దిగడం లేదు. కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వమంటే ముందుగా వీటిపై దృష్టి సారించాలి కదా' అని చెప్పాడు.

పౌరసత్వ చట్ట సవరణ చేసిన రోజు నుంచీ దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఢిల్లీ, ఉత్తరాదిన జరుగుతున్న నిరసన ప్రదర్శనలు దేశ రాజకీయ వాతావరణంలో ఒక్కసారిగా మార్పును తీసుకువచ్చాయి. ఇది దేశంలో దాదాపు అన్ని పార్టీలను ఒక వైపు, భారతీయ జనతా పార్టీని మరో వైపు సమీకృతం చేశాయి. న్యూఢిల్లీలో నడిబొడ్డున ఉన్న మండీ హౌజ్ వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించకుండా నిషేధాజ్ఞలు విధించినప్పటికీ జామియా మిలియాతో పాటు పలు యూనివర్సిటీల విద్యార్థులు నినాదాలు చేస్తూ మండీ హౌజ్ నుంచి జంతర్ మంతర్ వరకు ఊరేగింపు జరిపారు. ఉత్తర ప్రదేశ్‌తో పాటు దేశంలో వివిధ ప్రాంతాలు ఇంకా ఉద్రిక్తంగా ఉన్నాయి. ఈ పరిస్థితి ఎప్పుడు సద్దుమణుగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఆయన ఆమోదయోగ్యత క్షీణించిందని ఇప్పుడే చెప్పడానికి వీల్లేదు. ఎందుకంటే ఆరునెలల క్రితమే ఆయన భారీ మెజారిటీతో రెండవ సారి అధికారంలోకి వచ్చారు. ఈ ఆరునెలల్లో ప్రతిపక్షాలు బలోపేతమైనవని చెప్పడానికి కూడా ఆధారాలు లేవు. కాని ఈ ఆరు నెలల్లో భారతీయ జనతా పార్టీ అతి ఆత్మవిశ్వాసంతో వేగంగా తీసుకున్న నిర్ణయాలు ప్రతిపక్షాలు బలపడేందుకు ఆస్కారం కలిగించాయని చెప్పక తప్పదు. దేశంలో బలమైన పార్టీని దెబ్బకొట్టే అవకాశాల గురించి ప్రతిపక్షాలు ఎప్పుడూ ఎదురు చూస్తూనే ఉంటాయి. ముఖ్యంగా నరేంద్ర మోదీ, అమిత్ షా వంటి బలమైన నాయకులతో ఉన్న పార్టీని ఎదుర్కోవడం అంత సులభం కాదని తెలిసినప్పటికీ ఏ చిన్న అవకాశం వచ్చినా ప్రత్యర్థులు వదులుకోలేరు. కశ్మీర్‌లో 370 అధికరణ రద్దు చేసినప్పుడు దేశభక్తి అనే సున్నితమైన అంశం ఇమిడి ఉన్నందువల్ల ప్రతిపక్షాలు బిజెపిని ఎదుర్కోవడంలో అంత సఫలీకృతం కాలేదు. రామ మందిరానికి అనుకూలంగా సుప్రీంకోర్టే తీర్పు ఇచ్చినందువల్ల ప్రతిపక్షాలు ఆచితూచి స్పందించాల్సి వచ్చింది. ఇవే కాదు, మోదీ హిందూత్వ, దేశభక్తి కార్డులను విజయవంతంగా ఉపయోగించుకొన్నప్పుడల్లా ప్రతిపక్షాలు నీరుకారిపోయాయి. కాని పౌరసత్వ సవరణ చట్టంతో ఇన్నాళ్లు తొక్కిపెట్టుకున్న ఒక ఆక్రోశం పెల్లుబికినట్లయింది. దాదాపు బిజెపియేతర పార్టీలన్నీ కలిసికట్టుగా ప్రజల ఆందోళనను నిర్మించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. దీనికి తోడు ఈ దేశంలో భారతీయ జనతా పార్టీ గాలే నచ్చని అనేక సంస్థలు, మేధావి వర్గాలు ఎన్నో ఉన్నాయి. ఇన్ని రకాల శక్తులు కలిసికట్టుగా ఆందోళనకు దిగుతూ, తటస్థంగా ఉన్న వారిని కూడా తమ వైపుకు లాగుతుంటే బిజెపికి పరిస్థితి వ్యతిరేకంగా మారకుండా ఎలా ఉంటుంది?

పౌరసత్వ చట్టంపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలు ఎంత బలంగా ఉన్నాయో చెప్పడానికి పశ్చిమ బెంగాల్ బిజెపి ఉపాధ్యక్షుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ మునిమేనల్లుడు చంద్రకుమార్ బోస్ అడిగిన ప్రశ్నే నిదర్శనం. 'మీరు బంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్ నుంచి వలస వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, క్రైస్తవులు, పార్శీలు, జైనులను మాత్రమే పౌరసత్వ చట్టంలో ఎందుకు చేర్చారు? ముస్లింలను మాత్రం ఎందుకు చేర్చకూడదు?' అని ఆయన ప్రశ్నించారు. ఆ దేశాలు ఇస్లామిక్ దేశాలు కనుక అక్కడ ముస్లింలపై అణచివేత జరగదన్న అభిప్రాయం ఆధారంగా వారికి పౌరసత్వాన్ని నిరాకరించాలన్న వాదనను ఆయన కొట్టి పారేశారు. 'అణిచివేత లేదు కనుక వారు ఎలాగూ మన దేశానికి రారు.. మరి సమస్యేమిటి?' అని ఆయన అడిగారు. 'పాకిస్థాన్‌లోని బెలూచిస్థాన్‌లో నివసించే బెలూచీల మాటేమిటి? మనం ఏది చేసినా పారదర్శకంగా చేయాలి. భారత దేశాన్ని మరే దేశంతో పోల్చరాదు. మన దేశం అన్ని మతాలు, జాతులకు నిలయంగా ఉన్నది' అని ఆయన చెప్పారు.




మోదీ ఆకర్షణ నిరంతరం పనిచేయాలంటే ప్రతిసారీ పుల్వామా, బాలాకోట్ లాంటి ఘటనలు, కశ్మీర్, పౌరసత్వ చట్టం వంటి నిర్ణయాలూ సరిపోవు. ఇవి కల్పించే భావోద్వేగాలు హృదయాలను మండించవచ్చు. కానీ ఆ హృదయం క్రింద ఉన్న కడుపులో రేగే మంటల్ని కూడా పట్టించుకోకపోతే ఏ ఆకర్షణా ఎల్లవేళలా పనిచేయదు. దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దకుండా, ఉపాధి కల్పన, అవినీతి నిర్మూలన మొదలైన హామీల విషయంలో విజయం సాధించకుండా భావోద్వేగాలతో మోదీ సైతం ఎల్లకాలమూ నెగ్గుకు రాలేరు.

పౌరసత్వ చట్టానికి అనుకూలంగా భారతీయ జనతా పార్టీ కోల్‌కతాలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించిన మరునాడే ఆ పార్టీ ఉపాధ్యక్షుడే ఈ చట్టం పట్ల నిరసన తెలుపడానికి ప్రాధాన్యత లేకపోలేదు. నిజానికి తమ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఇంత నిరసన వస్తుందని బిజెపి ఊహించి ఉండకపోవచ్చు. జామియా మిలియాలో హింసాకాండ, పోలీసుల లాఠీ ఛార్జి జరిగిన తర్వాతే బిజెపి నేతలు స్పందించడం మొదలు పెట్టారు. పౌరసత్వ చట్టం ఏ మతానికీ వ్యతిరేకం కాదని, ప్రజలు శాంతిగా ఉండాలని చెప్పసాగారు. అయినా నిరసనలు ఆగకపోవడంతో తమకు జాతీయ పౌరసత్వ నమోదు (ఎన్ఆర్‌సి) చేపట్టాలన్న ఆలోచనే లేదని, అసలే కేబినెట్ సమావేశంలోనూ దానిపై చర్చించలేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా వివరణ ఇచ్చారు. దేశమంతటా ఎన్ఆర్‌సీని అమలు చేస్తామని తన కుడి భుజం, హోంమంత్రి అమిత్ షా పలు సార్లు ప్రకటనలు చేసిన విషయం తెలిసి కూడా మోదీ ఈ వివరణ ఇవ్వడంలో ఆంతర్యమేమిటి? సత్యానంతర (పోస్ట్ ట్రూత్) సమాజంలో రాజకీయ నాయకులు చేసే ప్రకటనలు ఇలాగే ఉంటాయి. విచిత్రమేమంటే బిజెపికి, సంఘ్ పరివార్‌కూ, ఆ భావజాలానికి చెందిన వారు తప్ప మరెవరూ పౌరసత్వ చట్టానికి అనుకూలంగా ప్రతిస్పందించకపోవడం. అదే సమయంలో పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా స్పందిస్తున్న వారిలో కాంగ్రెస్, వామపక్షాలు, బిజెపియేతర పార్టీల నేతలు మాత్రమే కాదు, అనేకమంది తటస్థ భావజాలం గలవారు– రచయితలు, మేధావులు, విద్యార్థులు కూడా ఉన్నారు. దాదాపు ఆరేళ్లుగా దేశంలో జాతీయ స్థాయిలోను, అనేక రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఇవాళ ఒక అంశంపై చట్టం చేస్తే పెద్ద ఎత్తున సమర్థించే అనేక తటస్థ వర్గాలు ఎందుకు ముందుకు రావడం లేదు? ఆరు నెలల క్రితం భారీ మెజారిటీతో ఎన్నికైన ఒక పార్టీ నేతలు, ప్రధానితో సహా అనేకమంది, ఒక చట్టం విషయంలో ఎందుకు ఆత్మరక్షణలో పడాల్సి వచ్చింది?

దేశవ్యాప్తంగా బిజెపియేతర రాజకీయ పార్టీలు, అనేక ఇతర వర్గాలు సంఘటితం కావడం రాష్ట్రాల్లో ప్రభావితం చేస్తోంది. మహారాష్ట్ర, హర్యానా తర్వాత తాజాగా జరిగిన జార్ఖండ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు బిజెపిని అడ్డుకోవడంలో ప్రాంతీయ పార్టీల బలీయమైన పాత్రను నిరూపిస్తున్నాయి. జార్ఖండ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా తో పాటు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దాదాపు 32 ఎన్నికల ర్యాలీలో పాల్గొని అద్భుతమైన, ఆవేశపూరితమైన ఉపన్యాసాలు ఇచ్చారు. కాని వారు ప్రచారం చేసిన చాలాచోట్ల బిజెపి ఓడిపోయింది. ఆఖరుకు బిజెపి ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ కూడా ప్రత్యర్థి చేతుల్లో ఓడిపోయారు. ఆయనను ఓడించిన బిజెపి తిరుగుబాటు అభ్యర్థి సరయూ రాయ్ అవినీతికి, మైనింగ్ కుంభకోణాలకు వ్యతిరేకంగా పోరాడిన నేత. లాలూప్రసాద్ యాదవ్ పశుగ్రాస కుంభకోణాన్ని వెలికి తీసింది ఆయనే.

ఇక్కడకూడా బిజెపి గత ఎన్నికల్లో తమతో కలిసి పోటీ చేసిన ప్రాంతీయ పార్టీ అఖిల జార్ఖండ్ విద్యార్థి సంఘం (ఏజెఎస్‌యు)ను ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసినట్లు ప్రక్కన పెట్టి స్వతంత్రంగా పోటీ చేసింది. ఒక గిరిజన ప్రాంతంలో గిరిజనేతరుడిని ముఖ్యమంత్రిగా నియమించి కేవలం మోదీ ఆకర్షణ ద్వారా విజయం సాధించగలమనే అతి ఆత్మవిశ్వాసం ప్రదర్శించడం వల్లే ఇక్కడ బిజెపి పరాజయం పాలైంది. రాష్ట్రాల స్థాయిలో ప్రతిసారీ మోదీ ఆకర్షణ పనిచేయదనీ, స్థానిక పార్టీలను విస్మరించలేరని ఈ ఎన్నికలు నిరూపించాయి. మోదీ ఆకర్షణ నిరంతరం పనిచేయాలంటే ప్రతిసారీ పుల్వామా, బాలాకోట్ లాంటి ఘటనలు, కశ్మీర్, పౌరసత్వ చట్టం వంటి నిర్ణయాలూ సరిపోవు. ఇవి కల్పించే భావోద్వేగాలు హృదయాలను మండించవచ్చు. కానీ ఆ హృదయం క్రింద ఉన్న కడుపులో రేగే మంటల్ని కూడా పట్టించుకోకపోతే ఏ ఆకర్షణా ఎల్లవేళలా పనిచేయదు. జార్ఖండ్‌లో ప్రజల దైనందిన సమస్యలు, విద్య, వైద్య వ్యవస్థలు దిగజారిపోవడం, గిరిజన వ్యతిరేక నిర్ణయాలు, ముఖ్యమంత్రి అహంభావ ధోరణితో పార్టీలో ఏర్పడిన అసమ్మతి బిజెపి ఓటమికి దారి తీశాయి. దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దకుండా, ఉపాధి కల్పన, అవినీతి నిర్మూలన మొదలైన హామీల విషయంలో విజయం సాధించకుండా భావోద్వేగాలతో మోదీ సైతం ఎల్లకాలమూ నెగ్గుకు రాలేరు. ముఖ్యంగా తమను ఒంటరి చేసే నిర్ణయాల ద్వారా విజయం సాధించలేరు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

# అభివృద్ధి సాధనలో కాకాని ఒరవడి

'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' అని గురజాడ అంటే, 'పదండి ముందుకు, పదండి తోసుకు' అని ఉద్బోధించారు మహాకవి శ్రీశ్రీ. దశాబ్దాల కిందటే వారీ నిత్య సత్యాలను ప్రబోధించారు. ఇప్పుడు రోజులు మారాయి. ఈ మహాకవుల సూక్తులకు రూపం మార్చి వక్రీకరించి, 'దేశం అంటే రాజకీయాలు, దేశం అంటే ఫక్తు రాజకీయాలే' అని, 'వెళుతున్నాం వెళుతున్నాం వెనక్కి వెనక్కి' అంటూ కొత్త భాష్యాలు చెబుతున్నారు. ఈ రకపు రాజకీయుల సంఖ్య నానాటికీ పెరుగుతూ వచ్చి చివరకు 'చెప్పేది ఒకటి, చేసేది మరొకటి' అనే తీరుగా వారి తీరుతెన్నులు మారిపోతూ, వర్తమాన రాజకీయాల రంగూ రుచీ పూర్తిగా మారిపోయే దుస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలో నాకు తెలిసిన, బాగా పరిచయం ఉన్న 50 ఏళ్ళనాటి రాజకీయ నాయకులు గుర్తుకు వస్తున్నారు. వీరిలో ప్రాతఃస్మరణీయులు కాకాని వెంకట రత్నం. కాకాని శిష్య పరంపర కూడా ఆయన అడుగుజాడల్లో నడిచి ఆదర్శ నాయకులు అనిపించుకున్న వాళ్ళే. రేబాల బుచ్చి రామయ్య శ్రేష్ఠి, పేట బాపయ్య, అప్పికట్ల జోసెఫ్, అక్కినేని భాస్కరరావు, మరుపిళ్ళ చిట్టి (చిన్ని) వీరిలో ముందు వరసలో వుంటారు. వీరి జీవన విధానాలను దగ్గరినుంచి గమనించే అవకాశం దక్కిన నాకు, అప్పటికీ ఇప్పటికీ రాజకీయుల మనస్తత్వాలు ఎలా మారిపోయాయన్నది చూస్తుంటే చాలా ఆశ్చర్యం కలుగుతోంది. ఆనాటి రాజకీయ నాయకుల మాట తీరు, వారి ఆలోచనా విధానం, పనులు చక్కబెట్టే పద్ధతి, పాటించిన క్రమశిక్షణ ఇవన్నీ ఇప్పటివారితో పోల్చి చూసుకుంటే రోజులు ఇంతగా మారిపోయాయా, మనుషులు ఇంతగా మారిపోయారా అనే విభ్రమ కలుగుతోంది. ఉదాహరణకు పేర్కొన్న ఈ నాయకులే కాదు, నాటి రాజకీయుల్లో చాలామంది ఇదే విధంగా హుందాగా వుండేవారు. అందుకే వారంటే ప్రజల్లో అంతటి ఆదరాభిమానాలు. నేను న్యూఢిల్లీకి వచ్చి సుమారు అరవై సంవత్సరాలు కావస్తోంది. ఈ సుదీర్ఘ ప్రస్థానంలో నలుగురు ప్రధాన మంత్రులను, ఇంచుమించు పాతిక ముప్పయిమంది కేంద్ర మంత్రులతో సన్నిహితంగా మెలిగే అవకాశం వృత్తి రీత్యా లభించింది. అలాగే ఎంతోమంది రాష్ట్ర స్థాయి రాజకీయ నాయకులు కూడా పరిచయమయ్యారు. నా దృష్టిలో రాజకీయ నాయకులందరూ చెడ్డవాళ్ళు కాదు. నేను కలిసిన అనేక మందిలో ఏదో ఒక మంచి లక్షణం నాకు కనిపించేది. అయితే వారెవ్వరూ కూడా వ్యక్తిగత విషయాలపై పరస్పర విమర్శలు, ఆరోపణలు చేసుకోవడం నేనెప్పుడూ చూడలేదు. అయితే సమాజానికి, దేశానికి సంబంధించిన వివిధ అంశాలపై విభేదించుకోవడం తరచూ జరిగేది. నాకు తెలిసినవాళ్ళెవ్వరూ కూడా అంతా ఒకే పార్టీకో, ఒకే వర్గానికో, లేదా ఒకే భావజాలానికో చెందిన వాళ్ళు కాదు. వాళ్ళల్లో అన్ని పార్టీల వాళ్ళు వున్నారు. వాళ్ళు ఏ పార్టీకి చెందిన వాళ్ళయినా సరే వాళ్ళందరూ ఒక పద్ధతిలో వ్యవహరించే వాళ్ళు. హుందాగా ప్రవర్తించేవాళ్ళు. పొరబాటున కూడా ప్రత్యర్థులను కానీ, తమ సిద్ధాంతాలతో విభేదించేవాళ్ళను కానీ, పల్లెత్తు మాట అనేవాళ్ళు కాదు.



గ్రామీణ స్థాయి నుంచి విద్యాభివృద్ధికి ఆనాడు కాకాని వేసిన పునాదులే కృష్ణా జిల్లాను అక్షరాస్యతలో అగ్రగామిని చేశాయి. ప్రతిదానికీ పూర్తిగా ప్రభుత్వంపై ఆధారపడకూడదు అనేది ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతం. నిజంగా ఒక దార్శనికుడు మాత్రమే ఈ రకంగా ఆలోచన చేయగలడు.

మరో విషయం ఏమిటంటే.. వాళ్ళల్లో చాలా మందికి కేవలం రాజకీయాలే జీవనాధారం కాదు. రాజకీయాన్ని ఒక దినచర్యగా, రాజకీయాలే ఆధారంగా బతికినవాళ్ళు కాదు. ఎప్పుడూ అలాంటి అభిప్రాయం కలిగించలా. ఏదో లబ్ధి కోసం రాజకీయాలు అనే భావన వారిలో కనబడేది కాదు. వాళ్ళ దృష్టి కోణం ఇందుకు పూర్తిగా విరుద్ధం. అయితే రాజకీయాలతో బాగుపడినవాళ్ళు, లబ్ధి పొందిన వాళ్ళు ఆ రోజుల్లో అసలే లేరని నేను చెప్పడం లేదు. ఇలాంటివాళ్ళు ఆ కాలంలో కూడా లేకపోలేదు. కాకపోతే వీరి సంఖ్య స్వల్పం. అధిక సంఖ్యాకులు కొద్దోగొప్పో సిద్ధాంతాలు, క్రమశిక్షణ కలిగినవాళ్ళే వుండేవారు. తమ పార్టీ భవిష్యత్తుతో పాటు దేశ భవిష్యత్తు కోసం కూడా తపన పడేవాళ్ళు.

ఒక్క కృష్ణా జిల్లా నాయకులు మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు చెందిన అనేక మంది రాజకీయ పార్టీల నేతలు కూడా అదే కోవకు చెందినవారు వున్నారు. ప్రజల సమస్యలు గురించి పట్టించుకునేవాళ్ళు. స్థానిక సంస్థల బలోపేతానికి పునాదులు వేస్తారు.

1966–67లో నేనొక పుస్తకం రాశాను. 'Politics of Leadership in an Indian State' అనేది దాని పేరు. భారత దేశంలో ప్రజాస్వామ్య మనుగడ ఏ విధంగా మొదలయింది, దానికి మూల కారణం ఎవరు అనే విషయాలు ఈ పుస్తకంలో చర్చించాను. జలగం వెంగళరావు (ఖమ్మం), కాకాని వెంకట రత్నం (కృష్ణా జిల్లా), కోట్ల విజయ భాస్కర రెడ్డి (కర్నూలు), సాగి సూర్యనారాయణ రాజు (విశాఖ పట్నం), కల్లూరి సుబ్బారావు (అనంతపురం) వంటి రాజకీయ నాయకులు ఆయా జిల్లాలలో చేసిన కృషి గురించి ప్రస్తావించడం జరిగింది. వారి కృషి ఏ విధంగా ఫలితాలు ఇచ్చిందీ, వాళ్ళు ఏ విధంగా ఆయా జిల్లాల జిల్లా బోర్డు అధ్యక్షులు కాగలిగారో వివరించే ప్రయత్నం చేసాను. ఈ రోజు మళ్ళీ అటువంటి నాయకులను గుర్తుకు తెచ్చుకుంటూ వుంటే, ఈ అరవై సంవత్సరాల్లో వచ్చిన రాజకీయ మార్పుల గురించి మరో పుస్తకం రాయాలనే కోరిక కలుగుతోంది. దేశ ప్రజాస్వామ్యం గురించీ, జాతి సాధించిన అభివృద్ధి గురించీ, పరిపాలనలో స్ఫుటంగా కనబడుతున్న మార్పుల గురించీ గత అయిదేళ్ళలో నేను మూడు పుస్తకాలు రాయడం జరిగింది.

కాకాని వెంకటరత్నంతో నాకున్న సన్నిహిత పరిచయం కారణంగా 1955–1972 మధ్యకాలంలో ఆయన గురించి అనేక వ్యాసాలు రాసాను. ఆయనలో నాయకత్వ పటిమను గురించీ, ఆయన పని తీరు గురించీ రాసిన వ్యాసాలవి. ఈ ఏడాది డిసెంబరు 25 నాటికి కాకాని మరణించి నలభై ఏడేళ్ళు. ప్రజల మనిషి కాకాని చివరికి ప్రజల మధ్యనే కన్ను మూయడం కాకతాళీయం కావచ్చు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని మరో మారు కాకాని వెంకట రత్నం గురించి స్మరించుకోవాలనేది సంకల్పం.

అభివృద్ధి విషయంలో కాకానిది ఒక ప్రత్యేక వొరవడి. ఇంగ్లీష్‌లో డెవలప్‌మెంట్ మోడల్ అంటారు. నిజంగా ఈ విషయంలో ఆయన చూపిన మార్గం ఈ నాటికీ అనుసరించదగినది అని చెప్పడంలో సందేహం లేదు. గ్రామీణ స్థాయి నుంచి విద్యాభివృద్ధికి ఆనాడు కాకాని వేసిన పునాదులే కృష్ణా జిల్లాను అక్షరాస్యతలో ముందుంచుతున్నాయి. జిల్లా బోర్డు అధ్యక్షుడిగా ఎన్నికయిన వెంటనే కాకాని వెంకటరత్నం తొలి అడుగు ఈ దిశగానే పడింది. ప్రతి గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలన్నది ఆయన తీసుకున్న మొదటి కార్యక్రమం. అంతటితోనే ఆగలేదు. ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం, సాగునీటి సదుపాయం అనేవి కూడా ఆయన కన్న కలలే. అలాగే ప్రతి వూళ్ళో ఒక గ్రంథాలయం, ప్రజల నిత్యావసర సరకుల పంపిణీకి ఒక సహకార సంస్థ ఏర్పాటు ఆయన కార్యాచరణ ప్రణాళికలో వున్నాయి. పైగా వీటి ఏర్పాటులో ప్రజల భాగస్వామ్యం. ప్రతిదానికీ పూర్తిగా ప్రభుత్వంపై ఆధారపడకూడదు అనేది ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతం. నిజంగా ఒక దార్శనికుడు మాత్రమే ఈ రకంగా ఆలోచన చేయగలడు. అడుగు ముందుకు వేయగలడు.

ఈ కార్యక్రమంతో కాకాని వెంకటరత్నం ముందుకు కదిలారు. జిల్లాలోని ఊరూరు తిరిగారు. గ్రామస్థులతో మాట్లాడారు. వారి సందేహాలు తీర్చారు. పాలనలో ప్రజల భాగస్వామ్యం ఆవశ్యకతను ఆయన ఆరోజుల్లోనే గుర్తెరిగి నడుచుకున్నారు. తను తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాల అమలులో స్వచ్ఛంద విరాళాలు, పనుల పర్యవేక్షణ రూపంలో ప్రజల నుంచి విశేషమైన సహకారాన్ని పొందడంలో కృతకృత్యులు కాగలిగారు. ఆనాటి ఈ పద్ధతులను నేటితో పోల్చుకుంటే తేడా ఏమిటన్నది మనకు స్పష్టంగా కనబడుతుంది. ఇప్పుడు ఏమి చేయాలన్నా ప్రభుత్వమే చేయాలి. ఏ ఖర్చు పెట్టాలన్నా ప్రభుత్వమే భరించాలి. ప్రతి పని ప్రభుత్వ బాధ్యత అనేది నేటి నినాదంగా మారింది. అలా చేయడం ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల విధి అని నిర్ధారించే స్థితికి చేరుకున్నాం. ఇది పురోగమనమా? తిరోగమనమా? ప్రజల మనస్తత్వమే కాదు, రాజకీయ నాయకుల ఆలోచనా విధానం కూడా మారింది. ప్రజలు ప్రతి విషయానికీ ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే పరిస్థితులు ఏర్పడడంలో రాజకీయుల పాత్ర కూడా వుంది. ఓటు బ్యాంకు రాజకీయాలు దీన్ని మరింత పతనావస్థలోకి నెడుతున్నాయి. ఈ రోజు పోతే మరునాటికి వీరెవరు అని ప్రశ్నించే సమాజంలో నేడు జీవిస్తున్నాము. అలాంటిది కాకాని కన్నుమూసి 47 ఏళ్ళు గడిచిపోయిన తరువాత కూడా ప్రజల కోసం పని చేసి, ప్రజల మధ్యనే ప్రాణాలు విడిచిన ఆ ఉక్కు కాకాని నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా వుండిపోవడం నిజంగా విడ్డూరమే. ఇప్పటికీ జిల్లాలో ఆయన పేరు మీద ఏ సభ జరిగినా జనం స్వచ్ఛందంగా తరలివస్తున్నారంటే ఆయన ఎంతగా ప్రజాభిమానాన్ని చూరగొన్నారో అర్థం చేసుకోవచ్చు.

■ **డాక్టర్ నాగులపల్లి భాస్కర రావు** (సీఎంఎస్)

*(నేడు కాకాని వెంకటరత్నం వర్ధంతి)*

# మొద్దు నిదుర తగదు!

తిరుప్పావై


ప్రముఖ చిత్రకారుడు బాపు బొమ్మ

నోత్తు చ్చువర్క్కమ్ పుగుగిన్ర అమ్మనాయ్!
మాత్తముమ్ తారారో వాశల్ తిఱవాదార్?
నాత్తత్తుళాయ్ ముడి నారాయణన్ నమ్మాల్
పోత్తప్పఱై తరుమ్ పుణ్ణియనాల్ పండొరునాళ్
కుత్తత్తిన్ వాయ్ వీళ్న్ద కుంబకరణనుమ్
తోత్తుమునక్కే పెరుందుయిల్ తాన్ తన్దానో?
అత్త అనందల్ ఉడైయాయ్! అరుంగలమే?
తేత్తమాయ్ వన్దు తిఱ ఏలోర్ ఎంబావాయ్

**పదో పాశురం**

**భావం:** గోపికల్లో శ్రేష్ఠురాలైన ఒక యువతి కృష్ణుడికి ప్రియురాలు. వారు ఒకరి కోసం ఒకరు పరితపిస్తారు. ఆ గోపికను గోదాదేవి ఆహ్వానిస్తోంది. "నందకిశోరుని ఇంటి పొరుగున ఉండే భాగ్యం కోసం నోము నోచినదానా! స్వర్గ సుఖానుభవం పొందనోచినదానా! అదృష్టవంతురాలా! మా పిలుపునకు బదులైనా చెప్పరాదా? తలుపు తెరువరాదా? సౌరభాన్ని ఇచ్చే తులసిని తలపై ధరించిన శ్రీకృష్ణుడు మన స్తుతులకు పరవశిస్తాడు. 'పర' అనే వాద్యాన్ని అనుగ్రహిస్తాడు. పుణ్యాల పంట అయిన ఆయన చేతిలో ఒకానొకనాడు (శ్రీరామావతారంలో) కుంభకర్ణుడు మృత్యువు నోటపడ్డాడు. ఆ కుంభకర్ణుడు కూడా నిద్రలో నీతో పోటీ పడి పరాజయం పొందాడు కాబోలు! అంత నిద్రేమిటి? సోమరితనమా? మా అందరికీ ఆభరణం లాంటి దానా! మెలకువ తెచ్చుకొని, సావధానంగా వచ్చి తలుపు తెరువు! మా అద్వితీయమైన ఈ వ్రతంలో పాలు పంచుకో!" అని ఆమెను ఆండాళ్ మేలుకొలుపుతోంది.

● ఎ. సీతారామారావు

బెటర్ లైఫ్

# భయం వేధిస్తోంది!

నేనో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను. అయితే మా వాళ్లంతా 'అదేం ఉద్యోగం? ఎంత జీతం వచ్చినా ప్రైవేట్ ఉద్యోగం అనేది స్థిరత్వం లేనిది. సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేరై ప్రభుత్వ ఉద్యోగం సంపాదించు' అంటూ రోజూ పోరు పెడుతున్నారు. సివిల్స్‌కు ప్రిపేర్ కావాలంటే ఈ ఉద్యోగం మానేయాలి. కనీసం రెండు మూడేళ్లయినా చదవనిదే పోటీ తట్టుకోలేం కదా! ఒకవేళ ఎగ్జామ్ రాసినా ర్యాంకు సాధిస్తామన్న గ్యారెంటీ ఏముంది? తిరిగి వచ్చేస్తే మళ్లీ ఇలాంటి ఉద్యోగం లభించే అవకాశాలు చాలా తక్కువ. అదంతా పక్కన పెడితే, ఈ 'స్థిరత్వం' అనే మాటేమిటో నాకు అర్థం కావట్లేదు! అసలు జీవితానికే స్థిరత్వం లేదు. ఉద్యోగాల్లో స్థిరత్వాన్ని కోరుకోవడం ఏమిటి? ఉన్నదాన్ని వదిలేసుకుని లేనిదాని కోసం వెంపర్లాడటమేమిటి? అదేమంటే... ఎదుగూ బొదుగూ ఉండదంటారు. పోనీ అంత ఆరాట పడితే మాత్రం కచ్చితంగా ఎదుగుదల ఉంటుందన్న గ్యారెంటీ ఏదీ లేదుగా! అటూ ఇటూ ఆలోచిస్తూ, చివరికి ఎటూ కాకుండా పోవడం ఎందుకన్నది నా భావన. అందుకే అవతలి వాళ్ల సలహాలు, సూచనలను పట్టించుకోవట్లేదు. మొత్తంగా చూస్తే నాలో కొంత అలజడితో ఒక విధమైన భయం నన్ను వేధిస్తోంది. నేను ఓ నిర్ణయానికి రావడం అనేది మీ సలహా పైనే ఆధారపడి ఉంది.

**- వి. సృజన,** బొల్లారం, హైదరాబాద్

'జీవితానికే స్థిరత్వం లేదు' అనే మాటను ఎవరూ కాదనలేరు కానీ, 'జీవితం ఉన్నంత వరకైనా స్థిరత్వం ఉండాలి కదా!' అనేది వారి మాటల్లోని అంతరార్థం. ఎందుకంటే అనిశ్చితికి మించిన సంక్షోభం జీవితంలో మరొకటి ఉండదనేది కొంత మంది పెద్దవాళ్ల బలమైన అభిప్రాయం. జీవితానుభవాలు వారు అలాంటి అభిప్రాయానికి రావడానికి కారణమయ్యాయి. అయితే ప్రైవేట్ ఉద్యోగాల్లో ఎదుగుబొదుగూ ఉండదనే వారి మాటల్లో మాత్రం పూర్తి నిజం లేదు. ఆ మాటకొస్తే స్థిరత్వం, నిశ్చలత్వం సరేగానీ, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎదుగుదల ఏపాటిది? వేతనమైనా, ప్రొమోషన్లయినా ప్రభుత్వం విధించిన రూల్స్ అండ్ రెగ్యులేషన్‌కు లోబడే ఉంటాయి. ప్రైవేట్ ఉద్యోగాలు అందుకు పూర్తిగా భిన్నమైనవి. అక్కడ కృషి, సాధన, సామర్థ్యాన్నిబట్టి మన ఎదుగుదల ఉంటుంది. ఒక ప్రభుత్వ ఉద్యోగికి ఉన్న వేతనం రూ. 20 వేల నుంచి 40 వేలకు పెరగాలంటే కొన్నేళ్లు పడుతుంది. అదే ప్రైవేట్ ఉద్యోగాల్లో అయితే కొత్త కంపెనీలోకి వెళ్లిన ప్రతిసారీ ఏడాదిలోనే రెట్టింపు వేతనం పొందే అవకాశాలుంటాయి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్ప మిగతా కాలాల్లో వేతనం 5 నుంచి 10 శాతం పెరగడమే గగనం. కాకపోతే ఎంత ఎక్కువ వేతనం తీసుకున్నా, ఎంత పెద్ద హోదాలో ఉన్నా, అక్కడే ఉండిపోతామన్న గ్యారెంటీ మాత్రం ప్రైవేట్ ఉద్యోగాల్లో ఉండదు. వేతనం, ప్రొమోషన్ల విషయంలో హై-జంప్ తీసుకునే అవకాశం ఎంత ఉంటుందో.. ఉన్న ఫళాన ఉద్యోగం ఊడిపోయే అవకాశమూ అంతే ఉంటుంది. ఈ కారణంగానే పెద్దవాళ్లు ప్రైవేట్ ఉద్యోగాల పట్ల నెగెటివ్‌గా ఉంటారు. నిజానికి ఏ రంగంలో అయినా కొన్ని సానుకూల అంశాలూ, ప్రతికూల అంశాలూ ఉంటాయి. ప్రైవేట్ ఉద్యోగాల్లో బెనిఫిట్స్ ఎక్కువే... రిస్కూ ఎక్కువే! ప్రభుత్వ ఉద్యోగాల్లో అయితే, రిస్కూ, బెనిఫిట్సూ తక్కువే! అయితే ఎదుటివారు ఏ సలహా ఇస్తున్నారనే దానిపైనే పూర్తిగా ఆధారపడకుండా, మీకు మీరుగా ఏ నిర్ణయం తీసుకుంటారనేదే కీలకం. ఇదే అని కాదు... జీవితంలో తీసుకునే ఏ నిర్ణయమైనా, మీరు ఎంత రిస్కు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారనే దానిపైనే ఆధారపడి ఉంటుంది. ప్లస్‌లూ మైనస్‌లు బేరీజు వేసుకుని మీకు మీరుగా ఒక నిర్ణయానికి రావడంలోనే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.



● **డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చింతపంటి**
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, హైదరాబాద్

నేడు క్రిస్మస్

# అసలు బహుమతి అదే!

మానవాళి చరిత్రలో సంభవించిన అద్భుతాల్లో క్రీస్తు జననం ప్రధానమైనది. ఈ ఘట్టం వివరిస్తున్నదేమిటి? క్రిస్మస్ ఇచ్చే సందేశం ఏమిటి?

"దేవుడు ఒక మంచి తండ్రి. మన మందరం సోదరులం, సోదరీమణులం. మానవత్వం విషయంలో క్రైస్తవ దృక్పథానికి ఈ సత్యమే ప్రాతిపదిక. మనకు ఏసు ప్రభువు ప్రసాదించిన ఈ సౌభ్రాతృత్వం లేకపోతే, మరింత న్యాయబద్ధమైన ప్రపంచం కోసం మనం చేసే ప్రయత్నాలు ఫలించవు, మనం వేసే గొప్ప ప్రణాళికలు, రూపొందించే ప్రాజెక్టులు ఆత్మలేనివిగా, శూన్యమైనవిగా మారిపోయే ప్రమాదం ఉంది". (పోప్ ఫ్రాన్సిస్, క్యాథలిక్ చర్చి అధిపతి)

అందరినీ మనతో సమానంగా పరిగణించినప్పుడు, లోకం ఒక గొప్ప మార్గంలోకి వెళుతుంది. తద్వారా మానవాళి విముక్తి సాధ్యమవుతుంది. పాపాల నుంచి దూరంగా ఉండాలి. వాటి వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను ఎదుర్కోవాలి. అలా చేయాలంటే- మంచి మార్గం, అంటే దైవమార్గం అనుసరించాలి. మానవులు అంటే దేవుడికి ఎంతో ప్రేమ. తన మార్గంలో నడవడానికి వారు ఏం చేయాలనే సందేశాన్ని అందివ్వడం కోసం- తాను చేసిన ఈ సృష్టిని కాపాడడం కోసం తన కుమారుడైన ఏసు క్రీస్తును మన మధ్యకు ఆయన పంపించాడని ప్రగాఢ విశ్వాసం.

క్రీస్తు ఒక దేవతా రూపంలో రాలేదు. ఒక నిర్దిష్టమైన సమయంలో, ప్రదేశంలో మనిషిగా అవతరించాడు. మనుషులందరిలో ఒకడిగా జీవించడానికి వచ్చాడు. మానవాళి పాపాలకు అంతిమమైన మూల్యాన్ని అందరి తరపున చెల్లించిన రక్షకుడు ఏసు క్రీస్తు. కాబట్టి ఆయనతో మనవాళికి ఉన్నది శాశ్వతమైన అనుబంధం. పాపాలతో మానవుడు పతనమైనప్పుడు, రక్తం చిందించకుండా ఆ పాప పరిహారం సాధ్యం కాదు. దైవపుత్రునిగా మానవాళి పాపాలను, ఈ మొత్తం ప్రపంచం పాపాలను విముక్తం చేయడం కోసం క్రీస్తు రక్తం చిందించాడు. మరణించాడు. ఏ కాలానికైనా, ఏ ప్రాంతానికైనా శాశ్వతంగా వర్తించే ప్రేమ, క్షమ అనే భావనలను ఆయన చాటి చెప్పాడు. క్రిస్మస్ అంటే కేవలం ఒక వేడుక మాత్రమే కాదు... క్రిస్మస్ అంటే స్వచ్ఛమైన, నిబంధనలేవీ లేని, అణచివేతకు తావులేని, అద్భుతమైన, నిస్వార్థమైన ప్రేమ! ఈ లోకానికి దేవుడు ఇచ్చిన అతి గొప్ప క్రిస్మస్ కానుక- ఏసుక్రీస్తు! దేవుడికి కృతజ్ఞతగా మానవాళి చెల్లించుకోవాల్సిన బహుమతి- ఆయన చూపిన మార్గంలో పయనించడం!

మెర్రీ క్రిస్మస్!!

"ముక్తి, రక్షణ అనేవి ప్రేమ, ఇతరులను ఆమోదించడం, గౌరవించడం ద్వారా లభిస్తాయి. వాటిని అన్ని జాతులకూ, భాషలకూ, సంస్కృతులకూ పంచాలి. అదే సమయంలో మానవులమైన మనమందరం సోదరులం, సోదరీమణులం అనేది గుర్తుంచుకోవాలి"

**- పోప్ ఫ్రాన్సిస్,** క్యాథలిక్ చర్చి అధిపతి

## కానుకల తాతయ్య!

'క్రిస్మస్' అనగానే 'శాంతాక్లాజ్'... అంటే క్రిస్మస్ తాత గుర్తుకొస్తాడు. ఎర్రటి, తెల్లటి రంగు దుస్తులూ, నెత్తిన టోపీ, తెల్లటి గుబురుగడ్డం కళ్ల ముందు మెదులుతాయి. ఇక భుజాన కానుకల మూట సరేసరి! ఈ శాంతాక్లాజ్ క్రీస్తుపూర్వం మూడో శతాబ్దంలో టర్కీలో నివసించిన సెయింట్ నికోలస్ అనే బిషప్ అని కథనాలు ఉన్నాయి. కాదనేవారూ ఉన్నారు. ఆ మాట ఏమైనా క్రిస్మస్ తాత ఇప్పుడు విశ్వవిఖ్యాతుడు. శాంతాక్లాజ్ వేషధారుల నుంచి బహుమతులు అందుకోవడం, వారితో గడపడం పిల్లలకు భలే సరదా! గ్రీటింగ్స్, చాక్లెట్లు, మిఠాయిలు, పుస్తకాలు, బొమ్మలు... ఇలా క్రిస్మస్ తాతయ్య అందించే బహుమతి ఏదైనా కావచ్చు! ఆయనను తమ కోసం దిగివచ్చిన దేవదూతగా పిల్లలు భావిస్తూ ఉంటారు. ఫిన్లాండ్ దేశంలోని రోవానిమీలో శాంతాక్లాజ్ గ్రామం ఉంది. అతను అక్కడే ఉంటాడనీ, ఎల్లప్పుడూ పిల్లల సంతోషంగా ఉండాలని కోరుకుంటూ ఉంటాడనీ చెబుతారు. అందరికీ ప్రేమను పంచడం, మంచి సంకల్పంతో మెలగడం ముఖ్యం అన్నదే క్రిస్మస్ కానుకల ద్వారా శాంతాక్లాజ్ ఇచ్చే సందేశం.




వేడుక

# ఇంటికి క్రిస్మస్ శోభ!

**క్రిస్మస్ రోజున ఇల్లంతా పండుగ సందడి కనిపించాలంటే అందుకు తగ్గట్టుగా అలంకరణ ఉండాల్సిందే. మెయిన్‌డోర్, కాఫీ టేబుల్ డెకరేషన్ ముఖ్యమే. గది మూలన విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆత్మీయుల పలకరింపులతో మీ లోగిలి క్రిస్మస్ శోభను సంతరించుకోవాలంటే...**



❄ **మెయిన్‌డోర్:** ఇంటికి వచ్చిన వారి దృష్టి మొదట మెయిన్ డోర్ మీదే ఉంటుంది. ఇంటి ముంగిట క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్ బొమ్మ ఏర్పాటు చేసి బంధువులకు స్వాగతం పలకండి. అంతేకాదు క్రిస్మస్ లైట్స్, దీపాలతో అలంకరించాలి. దాంతో రాత్రివేళ విద్యుత్ దీపాల వెలుగుల్లో ఇల్లు ప్రత్యేకంగా కనిపిస్తుంది.

❄ **ఫర్నీచర్:** తక్కువ ఖర్చులోనే లివింగ్ రూమ్‌కు మంచి లుక్ తేవచ్చు. అందుకు చేయాల్సిందల్లా చిందర వందరగా ఉన్న ఫర్నీచర్‌ను చక్కగా సర్దడమే. దాంతో ఒకవేళ అతిథుల సంఖ్య పెరిగినా ఇబ్బంది ఉండదు.

❄ **కుషన్స్, సోఫా కవర్స్ :** తక్కువ సమయంలో ఇంటి అలంకరణలో కొత్తదనం చూపాలంటే సోఫా కవర్లు, కుషన్స్, పిల్లో కవర్లు మారిస్తే సరి. ఎరుపు, ఆకుపచ్చ లేదా గోల్డ్ రంగు కవర్లు ఎంచుకుంటే గది వెలిగిపోతుంది.

❄ **కాఫీ టేబుల్:** క్రిస్మస్ అలంకరణ సామాగ్రి, ఒరిగామి ఆర్ట్ దాని పక్కన ఒక గిన్నెలో స్వీట్లు, చాక్లెట్లు ఉంచాలి. అక్కడే క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. సువాసన వెదజల్లే కొవ్వొత్తులు వెలిగిస్తే గదంతా పరిమళభరితంగా ఉంటుంది.

పురస్కారం



**కన్నడనాట తొలి తరం మహిళా జర్నలిస్టుల్లో విజయమ్మ ఒకరు. తెలుగు మూలాలున్న కుటుంబంలో జన్మించిన ఆమె కన్నడసీమలో విజయమ్మగా సుపరిచితులు. నాటక, సినిమా, సాహిత్యరంగాల్లో ఆమె ఎనలేని కృషి చేశారు. ఆమె ఆత్మకథ 'కుది ఎసరు' గ్రంథానికి ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఆమె విజయం గురించి...**

# కన్నడ నేలపై తెలుగు 'విజయ'ం!



ఇద్దరు పిల్లల తల్లి అయ్యేంతవరకూ విజయమ్మకు ఇల్లు తప్ప బయట ప్రపంచం తెలియదు. 16 ఏళ్లకే ఆమె ఒక పెద్ద ఉమ్మడి కుటుంబంలోకి కోడలుగా అడుగుపెట్టారు. "20 ఏళ్లకే నాకు ఇద్దరు పిల్లలు. పూర్తిగా సంసార బాధ్యతలతోనే సరిపోయేది. బయట ప్రపంచం గురించి పట్టింపే ఉండేది కాదు. ఎంతలా అంటే కన్నడ పత్రికలు ఉన్నాయనే విషయం కూడా తెలియనంతగా! మా మామగారు పత్రికలు చదివేవారు. కానీ ఇంట్లో ఆడవాళ్ల కంట పడకుండా తీసి దాచేవారు" అంటూ ఆ రోజుల్ని విజయమ్మ గుర్తు చేసుకున్నారు. అయితే మెట్టినింట తలెత్తిన ఇబ్బందులతో తన గౌరవాన్ని కాపాడుకోవడానికి విజయమ్మ గడప దాటక తప్పలేదు. "ఆ సమయంలో నా మనస్సాక్షి చెప్పినట్టు నడుచుకున్నా. తరువాత ఇందిరగారి దగ్గర సంగీతం నేర్చుకున్నా. ఆవిడ ప్రఖ్యాత రంగస్థల కళాకారులు ఎ.ఎస్.మూర్తి గారి భార్య. సంగీతం తరగతులు అయిపోయాక అక్కడే ఉన్న పుస్తకాలను గంటల తరబడి చదివేదాన్ని. నాకు రాయడం అంటే చాలా ఇష్టం. ఈ విషయాన్ని మూర్తిగారు గమనించి వేదిక మీద స్వాగతోపన్యాసాలు చేయమని ప్రోత్సహించారు" అంటారు విజయమ్మ. అలా ఆమెలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభ వెలికిరావడానికి ఓ మార్గం ఏర్పడింది.

**శిక్షణా శిబిరంతో కొత్త జీవితం...**

సరిగ్గా ఆ సమయంలోనే విజయమ్మ జీవితాన్ని మలుపు తిప్పే సంఘటన జరిగింది. 'కర్ణాటక రచయితల సంఘం' నిర్వహించిన నవలా రచన శిక్షణా శిబిరంలో ఆమె పాల్గొన్నారు. అప్పటికే ప్రజాదరణ ఉన్న 'ప్రజామత' పత్రిక ఎండీ సిద్ధరామయ్యకు ఆమె రచనాశైలి నచ్చి పత్రికలో ఒక కాలమ్ రాయమని కోరారు. 'ప్రజామత' కాలమ్‌తో ఆమెకు పేరుతో పాటు పరిచయాలు పెరిగాయి. తరువాత 'మల్లిగే' పత్రిక నుంచి పిలుపు వచ్చింది. కఠోర కృషితో ఆ పత్రికను కన్నడనాట టాప్ సర్క్యులేటెడ్ పత్రికగా తీర్చిదిద్దారు విజయమ్మ. ఇన్ని బాధ్యతల మధ్య కూడా విజయమ్మ చదువు కొనసాగించారు. డిగ్రీ తరువాత పీహెచ్‌డీ చేశారు. తర్వాత కొన్నాళ్లకు కన్నడ దినపత్రిక 'ఉదయవాణి' సినిమా పత్రిక 'రూపతార'ను ప్రారంభిస్తూ సినిమా రచనలు చేయడానికి విజయమ్మను తీసుకున్నారు. సినీ పరిశ్రమలో ఉన్న అణచివేత, వివక్షను చూసిన తరువాత విజయమ్మ ఉద్యమబాట పట్టారు. మహిళల హక్కుల కోసం పోరాడారు. ఇదంతా జరిగింది ఎమర్జెన్సీ రోజుల్లోనే! అయినా నేటికీ కూడా విజయమ్మ అనేకమంది స్త్రీవాద ఉద్యమకారిణులకు స్ఫూర్తి. "నా వయసు పెరిగింది. కానీ పరిస్థితిలో మార్పు రాలేదు. ఇప్పటికీ మహిళలు నా సాయం కోరి వస్తున్నారు. నేను చేయగల సాయం చేస్తున్నాను" అని ఆమె చెబుతారు.

**ఆత్మకథకు పురస్కారం!**

జర్నలిస్టుగా, రచయితగానే విజయమ్మ తన పరిధిని పరిమితం చేసుకోలేదు. విభిన్న కార్యక్షేత్రాల్లో పనిచేశారు. డాక్టర్ విజయ తన ఆత్మకథకు ఇచ్చిన అక్షర రూపం 'కుది ఎసరు'కు ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్‌ను ప్రకటించింది. "స్వతంత్రంగా ఏదైనా సాధించాలని ప్రయత్నించే మహిళలు గెలుపైనా, ఓటమైనా అంత సులువుగా మాత్రం రాదని గుర్తుంచుకోవాలి" అంటున్న ఆమె మాటలు ఈతరానికి కూడా మార్గదర్శకాలే!

## ముత్యాల ముగ్గు


**డి.శ్వేత సుబ్రమణ్యం**
భవానీపురం, విజయవాడ.


15 చుక్కలు
సందు చుక్కలు
8 వచ్చే వరకు


**వై. అమృత శ్రీవల్లి**
కడప


17 చుక్కలు
సందు
9 వరకు

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.

మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. Email: navya@andhrajyothy.com




ఆంధ్రజ్యోతి
జాబ్ కార్నర్
6 విజయవాడ ● బుధవారం 25 డిసెంబరు 2019



# 2020 దశాబ్ది సామర్థ్యాలు

*నిరంతరం మారుతోన్న టెక్నాలజీ వల్ల నూతన ప్రపంచం ఆవిష్కృతమవుతోంది. ఫలితంగా ఉద్యోగ సాధనలో చదువు కంటే నైపుణ్యాలు కీలకంగా మారుతున్నాయి. ఈ తరుణంలో 2020 దశాబ్దంలో జాబ్ రెడీగా ఉండాలంటే ఏయే స్కిల్స్ అవసరమనే అంశంపై వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) 15 దేశాల్లోని 350 కంపెనీల్లో అధ్యయనం చేసి 'ది ఫ్యూచర్ జాబ్స్' పేరుతో నివేదికను విడుదల చేసింది. రాబోయే కాలంలో మొత్తం వృత్తి నిపుణుల్లో మూడొంతుల మంది ఈ నివేదికలో పేర్కొన్న స్కిల్స్ ఆధారంగానే ఉద్యోగ అవకాశాలు దక్కించుకుంటారని ఆ నివేదిక పేర్కొంది.*

### తార్కిక ఆలోచన

ఒక విషయాన్ని తార్కికంగా, విమర్శనాత్మకంగా విశ్లేషించే సామర్థ్యం (క్రిటికల్ థింకింగ్) ఉన్న వారికి డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. రాబోయే కాలంలో వ్యాపార నిర్వహణ మరిన్ని సవాళ్లతో, సంక్లిష్టతలతో కూడుకున్న వ్యవహారంగా మారే అవకాశం ఉంది. కాబట్టి క్రిటికల్ థింకింగ్‌ను తప్పనిసరి నైపుణ్యంగా కంపెనీలు పరిగణిస్తున్నాయి.

### సృజనాత్మకత

నూతన, విభిన్న ఆలోచనలతో ఉండే వారిని నియమించుకోవడానికి కంపెనీలు సదా సిద్ధంగా ఉంటాయి. వీరిచ్చే సూచనలు, సలహాలు కంపెనీ పనితీరును గణనీయంగా మెరుగుపరుచుకోవడానికి దోహదం చేస్తాయి. కాబట్టి రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌లో క్రియేటివిటీకి ప్రత్యేక స్థానం ఉంటూ వస్తోంది. కొత్త ప్రొడక్ట్స్, సర్వీసుల రూపకల్పనలో అవుట్ ఆఫ్ ద బాక్స్ ఆలోచనలకు నూతన సాంకేతికతను అన్వయం చేస్తూ ముందుకుసాగే వారికి ఎక్కువగా డిమాండ్ ఉంటోంది.

### కమ్యూనికేషన్

ఒత్తిడిని తట్టుకోవడంతోపాటు మెరుగైన కమ్యూనికేషన్ ద్వారా చేస్తున్న పనిలో గరిష్ఠ ఫలితాలను సాధించడం ఎమోషనల్ ఇంటెలిజెన్స్ హై రేంజ్‌లో ఉన్న వారితోనే సాధ్యం. గతంలో జరిగిన కొన్ని అధ్యయనాలు కూడా ఇదే విషయాన్ని రుజువు చేశాయి కూడా. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎంప్లాయర్స్ ఎమోషనల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు.

### సమాంతర ఆలోచన

రాబోయే కాలంలో ఉద్యోగార్థుల నుంచి కంపెనీలు ఆశించే నైపుణ్యాల్లో అత్యంత కీలకమైంది కాగ్నిటివ్ ఫ్లెక్సిబిలిటీ. రెండు వేర్వేరు భావనల గురించి ఆలోచిస్తూ దానికి సమాంతరంగా మల్టిపుల్ కాన్సెప్ట్స్ గురించి కూడా యోచన చేసే సామర్థ్యాన్ని కాగ్నిటివ్ ఫ్లెక్సిబిలిటీగా వ్యవహరిస్తారు. కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించే క్రమంలో ఆలోచనలు, విధానాలు, వ్యవస్థ, మెటీరియల్స్, డేటా వంటి వాటిని సమ్మిళితం చేయడంలో కాగ్నిటివ్ ఫ్లెక్సిబిలిటీ కీలకంగా మారుతుంది.

### క్లిష్ట సమస్యల విశ్లేషణ

క్లిష్టమైన సమస్యను గుర్తించి దానికి సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించి, పరిష్కార మార్గాలను కనుక్కోవడం, వాటిని అమలు చేసే సామర్థ్యాన్ని కాంప్లెక్స్ ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్‌గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో వచ్చిన, రాబోయే సాంకేతిక ప్రగతికి కారణం ఈ నైపుణ్యమే. ఆటోమేషన్ కారణంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎనర్జీ రంగాల్లో పరిమితంగా, ప్రొఫెషనల్ సర్వీస్, ఐసీటీ రంగాల్లో ఈ స్కిల్‌కు విపరీతమైన డిమాండ్ ఉంటుంది.

### సమన్వయం, సర్దుబాటు

సహోద్యోగులతో సమన్వయంతో వ్యవహరిస్తూ వారి విధులకనుగుణంగా సర్దుబాటు చేసుకుంటూ ఫ్లెక్సిబుల్‌గా వ్యవహరించే గుణం ఉన్న వారికి ఎంప్లాయర్స్ ప్రాధాన్యం ఇస్తారు. ఈ లక్షణం వర్క్ ప్లేస్ వ్యవహారాలను సాఫీగా నిర్వహించడానికి దోహద పడుతుంది.

### అత్యుత్తమ పరిష్కారాలు

వేగంగా ఆలోచించడం, సత్వర నిర్ణయం తీసుకోవడం, జవాబుదారీగా ఉండటం, ఒక సమస్యకు అందుబాటులో ఉన్న వాటిల్లో అత్యుత్తమ పరిష్కార మార్గాన్ని ఎంచుకోవడం వంటివి ఈ స్కిల్ పరిధిలోకి వస్తాయి. రాబోయే కాలంలో వర్క్‌ప్లేస్‌లో వచ్చే మార్పులకు అనుగుణంగా సత్వర నిర్ణయాలతో దూసుకెళ్లే ప్రొఫెషనల్స్ అవసరం ఎంతో.

### పీపుల్ మేనేజ్‌మెంట్

మరో కీలక నైపుణ్యం పీపుల్ మేనేజ్‌మెంట్. ఇతరులను ఆకట్టుకోవడానికి కావల్సిన లక్షణాలు, చాతుర్యం, సామర్థ్యాలు వంటివి పీపుల్ మేనేజ్‌మెంట్ స్కిల్ కిందకు వస్తాయి. వీటిల్లో నిష్ణాతులు కావాలంటే చక్కని కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం. ఆఫీస్ వ్యవహారాలు, క్లయింట్స్, సహోద్యోగులు తదితరులతో వివిధ అంశాలపై చర్చించేందుకు ఈ స్కిల్స్ కీలకం.

### చర్చలు, రాజీలు కూడా

సంప్రదింపులు, చర్చలు, రాజీ కుదర్చడం ఇవన్నీ వినడానికి పాతకాలం మాటలుగా అనిపిస్తాయి. కానీ నేటి ఆధునిక యుగంలో కూడా వీటికి ఎనలేని ప్రాధాన్యం లభిస్తుంది. ప్రజలు, సంస్థల మధ్య ఏర్పడే విబేధాలను పరిష్కరించే క్రమంలో చర్చలు జరపటం, రాజీ కుదర్చడం వంటి నైపుణ్యాలు ఉన్న వారికి తగిన ప్రాధాన్యం లభిస్తుంది.



## అసిస్టెంట్

**ఖాళీలు 926**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- అర్హత: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ.
- ఎంపిక: ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా.
- ప్రిలిమినరీ పరీక్ష తేదీలు: 2020, ఫిబ్రవరి 14, 15.
- మెయిన్ పరీక్ష: మార్చి, 2020.
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 16, 2020.
- వెబ్‌సైట్: www.rbi.org.in/

## స్టయిపెండరీ ట్రెయినీ

**ఖాళీలు 273**

భారత అణుశక్తి విభాగానికి చెందిన న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ స్టయిపెండరీ ట్రెయినీ కేటగిరీ - 1, 2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- విభాగాలు: మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, హార్టికల్చరల్ తదితరాలు.
- భర్తీ చేసే పోస్టులు: అప్పర్ డివిజన్ క్లర్క్, వర్క్ అసిస్టెంట్, ఫిట్టర్, కెమికల్ ప్లాంట్ ఆపరేటర్.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, బీఎస్సీ, గ్రాడ్యుయేషన్, మెట్రిక్యులేషన్, ఇంటర్మీడియెట్ / తత్సమానం, అనుభవం.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 10, 2020.
- వెబ్‌సైట్: www.nfc.gov.in/

- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో ఎంబీబీఎస్, డిప్లొమా, బీఎస్సీ, గ్రాడ్యుయేషన్, మెట్రిక్యులేషన్ / తత్సమానం, అనుభవం.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 10, 2020.
- వెబ్‌సైట్: https://amd.gov.in/

## ఆఫీస్ అంటెండెంట్

**ఖాళీలు 73**

నాబార్డ్ (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్), ఆఫీస్ అంటెండెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- అర్హత: పదో తరగతి / తత్సమానం
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 12, 2020.
- వెబ్‌సైట్: www.nabard.org/

## ఎగ్జిక్యూటివ్

**ఖాళీలు 108**

ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) - ముంబై, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- పోస్టుల వారీగా ఖాళీలు: సీనియర్ ఎగ్జిక్యూటివ్ - 2, ఎగ్జిక్యూటివ్ - 62, జూనియర్ ఎగ్జిక్యూటివ్ - 18. అసిస్టెంట్ - 26.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, బీఈ / బీటెక్, మాస్టర్స్ డిగ్రీ, అనుభవం.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 19, 2020.
- వెబ్‌సైట్: www.kvic.org.in/

## టీచర్

**ఖాళీలు 46**

ఆర్మీ పబ్లిక్ స్కూల్ - ఆర్‌కే పురం (సికింద్రాబాద్), పలు టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల కోరుతోంది. వివరాలు...

- పోస్టుల వారీగా ఖాళీలు: పీజీటీ - 6, టీజీటీ - 13, పీఆర్‌టీ - 27.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, బీఈడీ, పోస్టుగ్రాడ్యుయేషన్, సీటెట్ / టెట్‌లో అర్హతతోపాటు నిర్దేశించిన విధంగా అనుభవం తప్పనిసరి
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 5, 2020
- వెబ్‌సైట్: apsrkpuram.edu.in/

## అంగన్వాడీ సహాయకులు

**ఖాళీలు 141**

అనంతపురం జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ వివాహితులైన మహిళా అభ్యర్థుల నుంచి పలు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- పోస్టులు: అంగన్వాడీ - 15, మినీ అంగన్వాడీ - 22, అంగన్వాడీ సహాయకులు - 104.
- అర్హత: పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు ఖాళీలు ఉన్న ప్రదేశంలో స్థానికులై ఉండాలి.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 27, 2019.
- వెబ్‌సైట్: ananthapuramu.ap.gov.in/

## నర్సింగ్ ఆఫీసర్

**ఖాళీలు 162**

జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జిప్మర్) - పుదుచ్చేరి, పలు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- భర్తీ చేసే పోస్టులు: నర్సింగ్ ఆఫీసర్, మెడికల్ సోషల్ వర్కర్, జూనియర్ ఇంజనీర్ (సివిల్, ఎలక్ట్రికల్), స్టెనోగ్రాఫర్.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 27, 2020.
- వెబ్‌సైట్: www.jipmer.edu.in/

## టీచింగ్

**ఖాళీలు 35**

శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం (ఎస్ఎల్‌బీఎస్ఆర్ఎస్‌వీ) - న్యూఢిల్లీ, పలు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- టీచింగ్ - 25, నాన్ టీచింగ్ - 10
- టీచింగ్ విభాగాలు: ఎడ్యుకేషన్, వ్యాకరణ్, జోతిష్య, అద్వైత వేదాంత, విశిష్ట అద్వైత, యోగ, సాహిత్య.
- నాన్ టీచింగ్ పోస్టులు: సెక్షన్ ఆఫీసర్, పర్సనల్ అసిస్టెంట్, ల్యాబొరేటరీ అసిస్టెంట్, అప్పర్ డివిజన్ క్లర్క్, స్టెనోగ్రాఫర్, తదితరాలు.
- అర్హత: పోస్టుని అనుసరించి పదో తరగతి, బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ డిగ్రీ, పీహెచ్‌డీ, అనుభవం.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 10, 2020.
- వెబ్‌సైట్: www.slbsrsv.ac.in/

## ట్రేడ్స్‌మెన్

**ఖాళీలు 108**

ఇండియన్ ఆర్మీకి చెందిన 17, 23 అమ్యూనిషన్ డిపోలు పలు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నాయి. వివరాలు..

- పోస్టుల వారీగా ఖాళీలు: ట్రేడ్స్‌మెన్ మేట్ - 62, ఫైర్‌మెన్ - 35, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ - 9, ఎంటీఎస్ - 2.
- అర్హత: పోస్టుని అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్‌తోపాటు సంబంధిత స్కిల్స్.
- ఎంపిక: రాతపరీక్ష, టైపింగ్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ (పీఈటీ) ఆధారంగా.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 12, 2020.
- వెబ్‌సైట్: www.indianarmy.nic.in

## హెడ్ కానిస్టేబుల్

**ఖాళీలు 585**

న్యూఢిల్లీ పోలీస్ విభాగం హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- అర్హత: సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్ / సంబంధిత సబ్జెక్టుల్లో నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ (ఎన్‌టీసీ), టైపింగ్, కంప్యూటర్ నాలెడ్జ్.
- ఎంపిక విధానం: రాతపరీక్ష ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ తేదీ: డిసెంబరు 28, 2019
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 27, 2020.
- వెబ్‌సైట్: www.delhipolice.nic.in/

## టెక్నీషియన్

**ఖాళీలు 78**

భారత అణుశక్తి విభాగానికి చెందిన అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎండీ) - హైదరాబాద్, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- భర్తీ చేసే పోస్టులు: సైంటిఫిక్ ఆఫీసర్, సైంటిఫిక్ అసిస్టెంట్-బి, టెక్నీషియన్-బి, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, అప్పర్ డివిజన్ క్లర్క్, డ్రైవర్.

---

విశేషం

# ఆనందాల క్రిస్మస్



- ఈ రోజు జీసస్ పుట్టిన రోజు. అందుకే ఏటా డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగ జరుపుకుంటాం.
- జీసస్ జన్మించక ముందు దేవుడు గాబ్రియెల్ అనే దూతను పంపించి జీసస్ తల్లి 'మేరీ'కి కారణజన్ముడైన కొడుకు జన్మిస్తాడని చెప్పమన్నారు. అలాగే జోసెఫ్‌కు కలలో కనిపించి మేరీని వివాహం చేసుకొమ్మని చెప్పారు.
- దైవ దూత చెప్పినట్టుగా జోసెఫ్ మేరీని వివాహం చేసుకుని బెత్లెహాంకు వచ్చాక జీసస్ జన్మించారు.
- క్రిస్మస్ రోజున అందరూ కలిసి సంతోషాలను పంచుకుంటారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.
- క్రిస్మస్ అనగానే శాంతాక్లాజ్ గుర్తొస్తాడు. నిజానికి శాంతాక్లాజ్‌ను ప్రపంచానికి పరిచయం చేసింది సెయింట్ నికోలస్ అనే వ్యక్తి. అతను టర్కీలో బిషప్‌గా ఉండేవాడు. ఆయనకు పిల్లలంటే ప్రాణం. రహస్యంగా పిల్లలకు బహుమతులు ఇవ్వడం ద్వారా ఆయన ఆనందించేవాడు. ఆయనతోనే క్రిస్మస్ రోజున పిల్లలకు బహుమతులు ఇవ్వడం ప్రారంభమయిందని ఓ కథనం.
- క్రిస్మస్ రోజున క్రిస్మస్ ట్రీలను అందంగా అలంకరిస్తారు. అలంకరించిన క్రిస్మస్ ట్రీలు మార్కెట్లో లభిస్తాయి. క్రిస్మస్ ట్రీని విద్యుద్దీపాలతో అలంకరిస్తే చూడముచ్చటగా ఉంటుంది.

### పదాలు సరిచేయండి!



gtfi

gink

lpma

### పదాలను పట్టికలో కనిపెట్టండి?

letter L

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| G | S | A | L | S | A | P | L | O | G | I |
| L | E | A | A | K | L | T | E | S | L | C |
| A | U | U | D | A | I | P | L | I | A | E |
| X | L | C | Y | J | M | J | L | C | D | C |
| S | E | S | B | B | O | T | O | E | L | R |
| E | M | E | U | N | U | E | B | T | E | E |
| S | O | B | G | K | S | R | S | B | E | A |
| P | N | M | K | I | I | R | L | A | M | P |
| G | I | N | G | I | N | L | E | O | A | D |
| J | I | S | I | S | E | A | R | D | O | I |
| L | E | A | F | O | G | P | A | M | S | P |




### చుక్కలు కలిపి రంగులు వేయండి!



### 12 తేడాలు కనిపెట్టండి?



### డైలీ సుడోకు-233

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | 3 | | | 2 |
| 8 | 2 | | | 6 | 4 | | | |
| | | | | | | | 7 | |
| | | 3 | | | 9 | 6 | 2 | |
| | 8 | 6 | | | | 9 | 4 | |
| | 9 | 5 | 6 | | | 8 | | |
| | 6 | | | | | | | |
| | | | 1 | 5 | | | 3 | 4 |
| 4 | | | 2 | | | | | |

**సుడోకు - 232 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 6 | 4 | 1 | 5 | 7 | 8 | 3 | 2 |
| 8 | 7 | 3 | 6 | 9 | 2 | 4 | 1 | 5 |
| 2 | 5 | 1 | 8 | 3 | 4 | 7 | 9 | 6 |
| 4 | 8 | 6 | 5 | 2 | 9 | 3 | 7 | 1 |
| 5 | 3 | 7 | 4 | 8 | 1 | 2 | 6 | 9 |
| 1 | 2 | 9 | 7 | 6 | 3 | 5 | 4 | 8 |
| 6 | 9 | 2 | 3 | 7 | 5 | 1 | 8 | 4 |
| 3 | 4 | 5 | 9 | 1 | 8 | 6 | 2 | 7 |
| 7 | 1 | 8 | 2 | 4 | 6 | 9 | 5 | 3 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.


MYTHRI MOVIE MAKERS
CLAP ENTERTAINMENT
మత్తు వదలరా
WRITTEN & DIRECTED BY RITESH RANA
PRODUCED BY CHIRANJEEVI (CHERRY), HEMALATHA
MUSIC KAALA BHAIRAVA
DOP SURESH SARANGAM
ART A.S. PRAKASH
EDITOR KARTHIKA SRINIVAS
RAGHUNATH.K
P.T.GIRIDHAR RAO
SHANKAR
THOMAS JAY
TEJA R
నేడే విడుదల


MSK
MALKAPURAM SHIVAKUMAR PRESENTS
SRI RAGHAVENDRA ART CREATIONS
Merry Christmas
హల్‌చల్
PRODUCED BY GANESH KOLLURI
WRITTEN & DIRECTED BY SRIPATHY KARRI
RELEASING ON
3RD JAN 2020
U


SUPERB RESPONSE FROM SPECIAL SHOWS
'DIL' RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
A 'DIL' RAJU PRODUCTION
నేడే విడుదల
U r my heart Beat
ఇద్దరి లోకం ఒకటే
SHIRISH MICKEY J MEYER G R KRISHNA
HARSHITH REDDY - BEKKEM VENUGOPAL (GOPI) SAMEER REDDY ABBURI RAVI
TAMMI RAJU BANDI RATNA KUMAR RAMANA VANKA STUNT SIVA
G ANUHYA REDDY BHANU VIJAY
ADITYA MUSIC
U/A


BEST FILM IN TOWN
SURESH PRODUCTIONS PVT. LTD.
people MEDIA FACTORY
VENKY మామ
K.S. RAVINDRA (BOBBY)
D.SURESH BABU T.G.VISHWA PRASAD
క్రిస్టమస్ శుభాకాంక్షలు
3RD WEEK
వెంకి మామ
THAMAN S VIVEK KUCHIBHOTLA PRASAD MURELLA
ADITYA U/A


Merry Christmas
UV creations
ALLU ARAVIND PRESENTS
GA2 PICTURES
ప్రతిరోజూ పండగే
A THAMAN MUSICAL
MARUTHI BUNNY VAS THAMAN S
JAIKUMAR SAMPATH SKN RAVEENDAR
U
పడి పడి నవ్వుతుండగా, ప్రతి థియేటర్ లో పండగే...
ఈరోజు సా॥ 5:00 గం॥లకు రాజమహేంద్రవరం
ఆనం కళా కేంద్రం లో విజయోత్సవం

# కీరవాణి కుమారుడు సంగీతం అందించిన చిత్రమనే చెబుతారు!

- కాలభైరవ



"నిజాయతీగా చెప్పాలంటే... ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా నా పేరు చెప్పడం కంటే కీరవాణి కుమారుడు సంగీతమందించిన చిత్రమనే అందరూ చెబుతారు. నేను ఎలా సంగీతమందిచానో చూద్దామని వస్తారు. అందువల్ల, అంచనాలతో పాటు ఒత్తిడి ఉంటుంది. నా నుంచి ఎక్కువ కోరుకుంటారు. కానీ, నేను ఒత్తిడికి లోను కాలేదు. చిత్రబృందమంతా కొత్తవాళ్లు కావడంతో స్నేహితుల్లా కలిసిపోయి పని చేశాం" అని కాలభైరవ అన్నారు. శ్రీసింహా హీరోగా రితేశ్ రానా దర్శకత్వం వహించిన చిత్రం 'మత్తు వదలరా'. చిరంజీవి (చెర్రీ), హేమలత నిర్మాతలు. బుధవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా కాలభైరవ మాట్లాడుతూ "తమ్ముడు హీరోగా ఈ సినిమా మొదలైంది. అప్పుడు నేను సంగీతం అందిస్తానని కలలో కూడా ఊహించలేదు. తర్వాత చెర్రీమామ నాకూ అవకాశం ఇచ్చారు. బలమైన కథ, కథనం ఉన్న సినిమా. అవకాశం రావడం గొప్పగా భావించి అంగీకరించా. కథ విన్నాక ఈ చిత్రంలో పాటలు అవసరం లేదనిపించింది. పాటలు పెడితే కథకు అన్యాయం చేసినట్టే. రీరికార్డింగ్ కోసం రఫ్ కట్ పంపారు. ప్రేక్షకుడిగా చూశా. థ్రిల్ ఫీలయ్యా. ఊహించినదానికంటే అద్భుతంగా ఉంది. నేనూ నేపథ్య సంగీతం బాగా చేయాలని కష్టపడ్డా. నాకు నాన్న సలహాలు ఇవ్వలేదు. నేనే కొన్ని సన్నివేశాలు చూపించి ఆయన అభిప్రాయాలు తీసుకున్నా" అన్నారు. చిత్రసీమలో ప్రయాణం గురించి కాలభైరవ మాట్లాడుతూ "నాలుగైదేళ్లుగా నాన్న దగ్గర పని చేస్తున్నా. ఆయనే నా గురువు. గాయకుడిగా 30కి పైగా పాటలు పాడా. 'బాహుబలి'లో 'దండాలయ్యా' పేరు తీసుకొస్తే... 'అరవింద సమేత వీరరాఘవ'లో 'పెనిమిటి' పాట ఆ పేరు రెండింతలు చేసింది. నాలుగైదేళ్ల తర్వాత కాలభైరవ అన్ని రకాల చిత్రాలకు సంగీతం అందించగలడనే పేరు తెచ్చుకోవాలని నా కోరిక. ప్రస్తుతం కార్తికేయ నిర్మిస్తున్న 'ఆకాశవాణి'కి పని చేస్తున్నా" అన్నారు.

# బ్యూటిఫుల్ పాటలు... వర్మ నృత్యాలు!



నైనా, వర్మ

"ఊర్మిళ లేకపోతే 'రంగీలా' తీసేవాణ్ణి కాదు. అలాగే, నైనా గంగూలీ లేకపోతే ఈ చిత్రం తీసేవాణ్ణి కాదు. కొంతమంది నటులు కొన్ని ప్రత్యేకమైన పాత్రల కోసమే పుట్టారనిపిస్తుంది. పదిహేనేళ్లుగా నాలో స్ఫూర్తి కలిగించిన కథ రాక, నటి దొరక్క ప్రేమకథ జోలికి వెళ్లలేదు. ఇప్పుడు నటి, కథ కుదరడంతో ఈ సినిమా చేశా. నేను జయాపజయాలను బ్యూటిఫుల్‌గా తీసుకుంటా. జీవితంలో నాకు కోపం రాదు. ఎవరి మీద ఫిర్యాదులు లేవు. నేను బ్యూటిఫుల్ కాకపోవచ్చు. కానీ, జీవితాన్ని బ్యూటిఫుల్‌గా గడిపా" అని రామ్‌గోపాల్ వర్మ అన్నారు. ఆయన టైగర్ కంపెనీ ప్రొడక్షన్ పతాకంపై టి. అంజయ్య సమర్పణలో టి. నరేశ్‌కుమార్, టి. శ్రీధర్ నిర్మించిన చిత్రం 'బ్యూటిఫుల్'. ట్రిబ్యూట్ టు రంగీలా అనేది ఉపశీర్షిక. సూరి, నైనా గంగూలీ జంటగా అగస్త్య మంజు దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక సోమవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. రవిశంకర్ సంగీతంలో సిరాశ్రీ సాహిత్యం అందించిన పాటల్ని విడుదల చేశారు. నైనా గంగూలీ సవాల్‌కు స్పందించి ఆమెతో కలిసి వర్మ నృత్యం చేయడం ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "జనవరి 1న విడుదల చేస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని టి. అంజయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు సి. కల్యాణ్, నట్టికుమార్, రామకృష్ణాగౌడ్, గురురాజ్, హీరో ఆకాశ్ పూరి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్ తరుణ్... షాలిని కెమిస్ట్రీ అద్భుతం!

- 'దిల్' రాజు



జీఆర్ కృష్ణ, 'దిల్'రాజు, రాజ్‌తరుణ్

"ఇటీవల కొందరు విద్యార్థులకు సినిమా చూపించాం. నేను ఎటువంటి అనుభూతికి లోనయ్యానో... వాళ్లూ అదే అనుభూతి చెందారు" అని 'దిల్' రాజు అన్నారు. ఆయన సమర్పణలో శిరీష్ నిర్మించిన చిత్రం 'ఇద్దరి లోకం ఒకటే'. రాజ్ తరుణ్ హీరో. షాలినీ పాండే హీరోయిన్. జీఆర్ కృష్ణ దర్శకుడు. బుధవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఫంక్షన్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ "మొదట ఇద్దరు ముగ్గురు హీరోలను అనుకున్నాం. కానీ, కుదరలేదు. ఒకరోజు దర్శకుడు ఫోన్ చేసి రాజ్‌తరుణ్‌కు కథ చెప్పాననీ, అతడు చేస్తానన్నాడనీ చెప్పాడు. హీరోయిన్‌గా మొదట ఇద్దరు ముగ్గుర్ని అనుకున్నాం. షాలిని పేరును శిరీష్ సూచించాడు. ఆమె వచ్చాక సినిమా లుక్ బావుంది. హీరో హీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా కుదరింది" అన్నారు. జీఆర్ కృష్ణ మాట్లాడుతూ "జననం నుండి మరణం వరకు ఇద్దరు వ్యక్తులు కలిసి చేసే ప్రయాణమే ఈ సినిమా" అన్నారు. "ఇదొక అందమైన ప్రేమకథ. ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది" అని రాజ్‌తరుణ్ అన్నారు.

# తెలుగు సినిమా ఉత్తమ దశలో ఉంది

- కె.సి.బొకాడియా



"నిర్మాతగా, దర్శకుడిగా, స్ర్కీన్‌ప్లే రచయితగా ఈ ప్రయాణం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. మధ్యలో కొంత గ్యాప్ ఇచ్చినా 'నమస్తే నేస్తమా'తో మళ్లీ ప్రయాణం మొదలుపెట్టా. ఇకపై ఏడాదికి రెండు, మూడు తెలుగు సినిమాలు చేస్తాం" అని దర్శకనిర్మాత కె.సి.బొకాడియా అన్నారు. గతంలో ఆయన హిందీలో నిర్మించిన 'తేరీ మెహర్బానియా' చిత్రానికి రెండో భాగంగా 'నమస్తే నేస్తమా' తెరకెక్కించారు. ఈషానియ మహేశ్వరి, నాజర్, బ్రహ్మానందం, శ్రీరామ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం జనవరి 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కె.సి.బొకాడియా హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు. "తెలుగు సినిమా ప్రస్తుతం గొప్ప దశలో ఉంది. దేశం మొత్తం ఈ పరిశ్రమ గురించే మాట్లాడుకుంటోంది. ఇక్కడ విజయవంతమైన చిత్రాలు ఇతర భాషల్లో రీమేక్ అవుతున్నాయి. తెలుగులో నేను తెరకెక్కించిన తొలి చిత్రమిది. చిన్నప్పుడే విడిపోయిన రెండు కుక్క పిల్లల కథతో ఈ సినిమా రూపొందించా. ఒక కుక్క పోలీసుల దగ్గర, మరొకటి దొంగల దగ్గర పెరుగుతుంది. ఇంతలో ఓ పోలీస్ అధికారి హత్యకి గురవుతాడు. ఆ పోలీస్‌ని చంపినవాళ్ల మీద రెండు కుక్కలు ఎలా పగతీర్చుకున్నాయి? మళ్లీ ఎలా కలుసుకున్నాయి? అన్నది ఇతివృత్తం. కుక్కలతో చిత్రీకరణ చేయడం చాలా కష్టం. వంద రోజులపాటు ఎన్నో కష్టాలు పడి షూటింగ్ పూర్తి చేశాం" అన్నారు.



















| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 41,461.26 | 12,212.00 | 38,445 | 45,630 | 71.27 | 67.12 |
| 181.40 | 50.75 | 164 (ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)) | 595 | 9 పైసలు | |

## దివాలా స్మృతి ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ : దివాలా స్మృతికి మరిన్ని సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జారీ చేసే ఆర్డినెన్స్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్టు కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ చెప్పారు. పాత మేనేజ్‌మెంట్ కింద ఉన్నపుడు కంపెనీపై నమోదైన కేసులు, కొత్త మేనేజ్‌మెంట్ కిందికి వచ్చాకా వర్తిస్తాయా, లేదా? అనే అంశంపై ప్రస్తుత చట్టంలో స్పష్టత లేదు. దీంతో దివాలా ప్రక్రియలో ఉన్న కంపెనీల కొనుగోలుకు, పారిశ్రామికవేత్తలు వెనకాడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాత క్రిమినల్ కేసులు కొత్త మేనేజ్‌మెంట్‌కు వర్తించకుండా ఆర్డినెన్స్ ద్వారా దివాలా చట్టాన్ని సవరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2016లో అమల్లోకి వచ్చిన ఈ చట్టాన్ని ఇప్పటికే మూడుసార్లు సవరించారు.

# సంపద సృష్టిలో రారాజు!

## అంబానీకి కలిసొచ్చిన 2019

- రూ.1.20 లక్షల కోట్లు పెరిగిన ఆస్తి
- మొత్తం రూ.4.27 లక్షల కోట్లకు చేరిక

న్యూఢిల్లీ: ఆసియాలో అత్యంత ధనవంతుడైన ముకేశ్ అంబానీకి ఈ ఏడాది బాగా కలిసొచ్చింది. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. ఈనెల 23 నాటికి ఆయన వ్యక్తిగత సంపద 1,700 కోట్ల డాలర్ల (దాదాపు రూ.1.20 లక్షల కోట్లు) మేర పెరిగింది. దాంతో మొత్తం సంపద 6,100 కోట్ల డాలర్లకు(రూ.4.27 లక్షల కోట్లు) చేరువైంది. ఈ ఏడాది రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు భారీగా పుంజుకోవడం ముకేశ్ ఆస్తి అనూహ్య వృద్ధికి దోహదపడింది. 2019లో సంపద పెరుగుదల విషయంలో ప్రపంచ కుబేరులైన జెఫ్ బెజోస్, జాక్ మా కూడా వెనకబడే ఉన్నారు. అలీబాబా వ్యవస్థాపకుడు జాక్ మా ఆస్తి 1,130 కోట్ల డాలర్లు ఎగబాకగా.. అమెజాన్ చీఫ్ జెఫ్ బెజోస్ ఐశ్వర్యం 1,320 కోట్ల డాలర్లు వృద్ధి చెందింది.

### దోహదపడిన అంశాలు

- మూడేళ్ల క్రితం రిలయన్స్ జియో సేవల ప్రారంభం
- రిలయన్స్ రిటైల్ విస్తరణపై ప్రత్యేక దృష్టిసారించడం
- 2021కల్లా రుణ రహిత కంపెనీగా మారాలన్న లక్ష్యం
- సౌదీ అరామ్కోకు ఇంధన వ్యాపారంలో వాటా విక్రయం
- ఈ-కామర్స్ వ్యాపారంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నాలు

**40%** ఈ ఏడాదిలో ఆర్ఐఎల్ షేర్ల పెరుగుదల

**మూడింతలు** 2016 నుంచి రిలయన్స్ షేర్ల వృద్ధి

**32%** రిలయన్స్ ఆదాయంలో టెలికాం, రిటైల్ వ్యాపారాల వాటా



# 'మొండి' పద్దులు 9.1%

## సెప్టెంబరు నాటికి మెరుగైన బ్యాంకుల ఆస్తుల నాణ్యత

## వార్షిక నివేదికలో వెల్లడించిన ఆర్‌బీఐ




ముంబై: దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఆస్తుల నాణ్యత కాస్త మెరుగైందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంటోంది. గత ఆర్థిక సంవత్సరం చివరినాటికి (2019 మార్చి 31) 9.1 శాతంగా ఉన్న స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ) లేదా మొండి బకాయిల వాటా నిలకడగా కొనసాగి సెప్టెంబరు చివరినాటికి అదే స్థాయిలో నమోదైంది. ఆర్‌బీఐ మంగళవారం విడుదల చేసిన వార్షిక నివేదిక ప్రకారం.. 2017-18 ఆర్థిక సంవత్సరాంతానికి 11.2 శాతంగా ఉన్న స్థూల ఎన్‌పీఏలు 2018-19 చివరినాటికి 9.1 శాతానికి మెరుగుపడ్డాయి. అంటే, సమస్య గణనీయంగా తగ్గుముఖం పట్టింది. నికర ఎన్‌పీఏలైతే దాదాపు సగానికి తగ్గాయి. 2017-18లో 6 శాతంగా ఉన్న నికర ఎన్‌పీఏల వాటా 2018-19 ముగిసేసరికి 3.7 శాతానికి తగ్గింది.

### మరిన్ని ముఖ్యాంశాలు

- బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు 2017-18 వరకు వరసగా ఏడేళ్లపాటు పెరుగుతూ వచ్చాయి.
- బ్యాంకుల్లో మొండి పద్దుల గుర్తింపు ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. తద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్థూల, నికర ఎన్‌పీఏలు తగ్గుముఖం పట్టాయి. ఈ పరిణామం బ్యాంకుల ఆస్తుల నాణ్యత మెరుగుదలకు దోహదపడింది.
- 2017-18లో 14.6 శాతంగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు 2018-19లో 11.6 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 8 శాతం నుంచి 4.8 శాతానికి జారుకున్నాయి. ప్రైవేట్ బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు మాత్రం 4.7 శాతం నుంచి 5.3 శాతానికి క్షీణించాయి. నికర ఎన్‌పీఏలు 2.4 శాతం నుంచి 2 శాతానికి తగ్గాయి.
- ప్రభుత్వ రంగ ఐడీబీఐ బ్యాంక్‌ను ఎల్ఐసీ కొనుగోలు చేయడంతో దాన్ని ప్రైవేట్ బ్యాంక్‌ల జాబితాలోకి మార్చారు. ప్రైవేట్ బ్యాంకింగ్ రంగ స్థూల ఎన్‌పీఏల పెరుగుదలకు ఇదే ప్రధాన కారణం. ఐడీబీఐని మినహాయిస్తే మాత్రం ఎన్‌పీఏల శాతం తగ్గింది.
- రంగాలవారీగా చూస్తే, వ్యవసాయ రంగానికిచ్చిన రుణాల్లో స్థూల ఎన్‌పీఏల వాటా 2018-19తోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2019-20) ప్రథమార్ధంలో మరింత పెరిగాయి. గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో పంట రుణాల మాఫీ ప్రకటించిన రాష్ట్రాల్లోనే మొండి పద్దులు ఎక్కువగా నమోదైనట్లు అంతర్గత బృందం అధ్యయనంలో తేలింది.
- పారిశ్రామిక రంగానికిచ్చిన రుణాల్లో 17.4 శాతం మొండి బాకీలుగా మారాయి. ఈ సెప్టెంబరు చివరినాటికి నమోదైన మొత్తం ఎన్‌పీఏల్లో మూడింట రెండొంతుల వాటా వీటిదే.
- 2017-18 నాటికి నమోదైన మొండి బాకీల్లో 91 శాతం రూ.5 కోట్లు అంతకు పైగా తీసుకున్న రుణాలకు సంబంధించినవే.
- 2019-20 ప్రథమార్ధంలో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో ఒత్తిడిలో రుణ ఖాతాల సంఖ్య పెరిగింది.

### సగానికి తగ్గిన సహకార బ్యాంకుల ఆస్తులు

గడిచిన 14 ఏళ్లలో సహకార బ్యాంకుల ఆస్తులు దాదాపు సగమయ్యాయని ఆర్‌బీఐ నివేదిక వెల్లడించింది. 2004-05 నాటికి వాణిజ్య బ్యాంకుల ఆస్తుల్లో సహకార బ్యాంకుల ఆస్తుల మొత్తం ఆస్తుల వాటా 19.4 శాతంగా నమోదైంది. కాగా, 2018-19 నాటికి 10.6 శాతానికి తగ్గింది. ఈ సెప్టెంబరులో పంజాబ్ మహారాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంక్‌తోపాటు అంతకు ముందు పలు సహకార బ్యాంకుల వెలుగు చూసిన మోసాలు వీటి ఆస్తులను హరించి వేశాయని ఆర్‌బీఐ పేర్కొంది.

### ఎన్‌బీఎఫ్‌సీల్లో ఎన్‌పీఏల హైజంప్

ద్రవ్య కొరత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోన్న నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల(ఎన్‌బీఎఫ్‌సీ) రంగంలో మొండి బాకీలు గణనీయంగా పెరిగాయి. ఆర్‌బీఐ రిపోర్టు ప్రకారం.. 2017-18లో 5.3 శాతంగా ఉన్న ఎన్‌బీఎఫ్‌సీల స్థూల ఎన్‌పీఏల వాటా 2018-19లో 6.1 శాతానికి ఎగబాకింది. నికర ఎన్‌పీఏలు మాత్రం 3.3 శాతం నుంచి 3.4 శాతానికి పెరిగాయి.

### విలీనాలతో ప్రపంచ స్థాయి బ్యాంకులు

ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుతం జరుగుతున్న విలీనాలతో ప్రపంచ స్థాయి బ్యాంకులు ఏర్పడనున్నాయని ఆర్‌బీఐ పేర్కొంది. ప్రస్తుతం ప్రపంచంలోని 50 అతిపెద్ద బ్యాంకుల జాబితాలో భారత్‌కు చెందినది ఒక్కటీ లేదు. ఎస్‌బీఐ తన ఐదు అనుబంధ విభాగాలను విలీనం చేసుకున్నాక 45,000 కోట్ల డాలర్ల ఆస్తులతో 'గ్లోబల్ టాప్-50 బ్యాంకుల' లిస్ట్‌లో చోటు సంపాదించింది. కానీ, మొండి బకాయిల సమస్య అధికమవడంతో కొద్ది కాలానికే ఈ జాబితాలో చోటు కోల్పోయింది. ఈ ఏడాది ఆగస్టులో మోదీ సర్కారు ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో మెగా విలీన ప్రణాళికను ప్రకటించింది. మొత్తం 10 బ్యాంకుల విలీనం ద్వారా 4 బడా బ్యాంకులు ఏర్పాటు కానున్నాయి. ఇందులో భాగంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో ఓరియంట్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, యునైటెడ్ బ్యాంక్ విలీనం కానున్నాయి. తద్వారా ఎస్‌బీఐ తర్వాత దేశంలో రెండో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనుంది. ఇక కెనరా బ్యాంక్‌లో సిండికేట్ బ్యాంక్.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆంధ్రా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్.. ఇండియన్ బ్యాంక్‌లో అలహాబాద్ బ్యాంక్ మెర్జ్ కానున్నాయి. ఈ నాలుగు విలీనాలు 2020 మార్చి చివరికల్లా పూర్తి కానున్నాయి. దాంతో ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్య 12కు తగ్గనుంది.

### రూ.71,543 కోట్ల బ్యాంక్ మోసాలు

గత ఆర్థిక సంవత్సరం(2018-19)లో రూ.71,543 కోట్ల విలువైన బ్యాంక్ మోసాలు జరిగాయి. 2017-18లో నమోదైన రూ.41,167 కోట్ల మోసాలతో పోలిస్తే 74 శాతం పెరిగాయని ఆర్‌బీఐ వెల్లడించింది. 2018-19లో బ్యాంకులు మోసాలకు సంబంధించి 6,801 ఫిర్యాదులు చేశాయి. 2017-18లో ఈ సంఖ్య 5,916గా ఉంది. బ్యాంకులో రుణ మోసాలే అధికమని ఆర్‌బీఐ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం బ్యాంకుల్లో రూ.64,548 కోట్ల విలువైన 3,606 రుణ మోసం కేసులు నమోదయ్యాయి. రూ.695 కోట్ల విలువైన 13 విదేశీ మారక లావాదేవీల మోసాలు, రూ.71 కోట్ల విలువైన 1,866 కార్డు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాలు వెలుగు చూశాయి.

## మారుతీ ఉద్యోగ్ మాజీ ఎండీపై రూ.110 కోట్ల రుణ మోసం కేసు

- జగదీష్ ఖట్టర్, కార్నేషన్ ఆటోపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ



న్యూఢిల్లీ: మారుతీ ఉద్యోగ్ మాజీ ఎండీ జగదీష్ ఖట్టర్‌పై రూ.110 కోట్ల బ్యాంక్ రుణ మోసం కేసులో సీబీఐ కేసు నమోదు చేసింది. ఖట్టర్‌తోపాటు ఆయన కంపెనీ కార్నేషన్ ఆటో ఇండియా లిమిటెడ్ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.110 కోట్ల నష్టం కలిగించినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. 77 ఏళ్ల ఖట్టర్‌కు చెందిన ప్రాంతాలతోపాటు కార్నేషన్ ఆటో కార్యాలయంలో సోమవారం సాయంత్రం సీబీఐ సోదాలు నిర్వహించింది. 1993 నుంచి 2007 వరకు మారుతీ ఉద్యోగ్ లిమిటెడ్‌లో పనిచేసి ఎండీ హోదాలో రిటైర్ అయిన ఖట్టర్.. ఆ తర్వాత కార్నేషన్ ఆటో ఇండియా లిమిటెడ్ పేరుతో సొంత కంపెనీని ప్రారంభించారు. ఈ కంపెనీ కోసం 2009లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రూ.170 కోట్ల రుణం పొందారు. బకాయిలు చెల్లించకపోవడంతో బ్యాంక్ 2015లో ఈ రుణాన్ని మొండి పద్దుల్లో చేర్చింది. బ్యాంక్ ఫిర్యాదు మేరకు నేరపూరిత కుట్ర, మోసం సెక్షన్ల కింద ఖట్టర్, కార్నేషన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది.

### ఏ తప్పూ చేయలేదు: ఖట్టర్

వ్యాపార వైఫల్యం కారణంగా బకాయిలు చెల్లించలేక పోయామే తప్ప ఎలాంటి తప్పూ చేయలేదని ఖట్టర్ అన్నారు. కార్నేషన్ పద్దులపై బ్యాంక్ జరిపించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లోనూ ఎలాంటి తప్పు బయటపడలేదన్నారు. బ్యాంక్ కూడా సాధారణ కార్యకలాపాల్లో భాగంగానే ఫిర్యాదు చేసిందని, సీబీఐ సోదాల్లోనూ నేరారోపణలకు సంబంధించిన ఆధారాలు లభించలేదన్నారు.

## మరో కేసులో మల్వీందర్‌సింగ్ అరెస్ట్

న్యూఢిల్లీ: ఫోర్టిస్ హెల్త్‌కేర్ మాజీ ప్రమోటర్ మల్వీందర్ సింగ్‌ను మరో కేసులో అరెస్ట్ చేశారు. రెలిగేర్ ఫిన్‌వెస్ట్ లిమిటెడ్(ఆర్ఎఫ్ఎల్)లో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలపై ఆయన్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మల్వీందర్ ఇప్పటికే ఓ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. లక్ష్మీ విలాస్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన రూ.400 కోట్లు, రూ.350 కోట్లు విలువైన రెండు ఎఫ్‌డీలను మల్వీందర్ సింగ్, ఆయన సోదరుడు శివిందర్ సింగ్ దుర్వినియోగపరిచినట్లు, ఇందుకు బ్యాంక్‌కు చెందిన కొందరు ఉద్యోగులు కూడా సహకరించారని ఆర్ఎఫ్ఎల్ ఆరోపించింది.

## గోఎయిర్ పీడబ్ల్యూ ఇంజన్లు తనిఖీ: డీజీసీఏ

న్యూఢిల్లీ : గోఎయిర్ విమానయాన సంస్థ నడిపే 'ఏ320 నియో' విమానాల ఇంజన్ల భద్రతపై పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విమానాల్ని గోఎయిర్ సంస్థ, ప్రాట్ అండ్ విట్నీ (పీడబ్ల్యు) కంపెనీ తయారు చేసిన ఇంజన్లతో నడుపుతోంది. సోమవారం ఈ ఇంజన్‌తో నడిచే ఒక గోఎయిర్ 'ఏ320 నియో' విమానం, సాంకేతిక సమస్యలతో గువాహతి విమానాశ్రయం నుంచి బయలు దేరిన 10 నిమిషాల్లోనే వెనక్కి తిరిగి వచ్చింది. దీంతో 3,000 గంటల కంటే ఎక్కువ కాలం పని చేసిన గోఎయిర్ ఎ320 నియో విమానాల్లోని అన్ని పీడబ్ల్యు ఇంజన్లను తనిఖీ చేయాలని డీజీసీఏ నిర్ణయించింది.

## ఐటీ నోటీసులపై స్పందించేందుకు జనవరి 10 వరకు గడువు

న్యూఢిల్లీ: ఈ-అసెస్‌మెంట్‌లో భాగంగా ఆదాయం పన్ను (ఐటీ) డిపార్ట్‌మెంట్ నుంచి అందుకున్న నోటీసులకు స్పందించేందుకు తుది గడువును జనవరి 10 వరకు పొడిగించారు. ఐటీ శాఖ సర్వోన్నత నిర్ణయాధికార మండలి 'ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు'(సీబీడీటీ) మంగళవారం ఇందుకు సంబంధించి ఆర్డరు కాపీ జారీ చేసింది. తొలుత ప్రకటించిన గడువు ఈనెల 24(మంగళవారం)తో ముగిసింది.

## అలెంబిక్ జనరిక్ గ్లకోమా ఔషధానికి యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం

న్యూఢిల్లీ: గ్లకోమా చికిత్సలో వినియోగించే ట్రావోప్రోస్ట్ ఆఫ్తాల్మిక్ సొల్యూషన్‌కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ నుంచి తుది ఆమోదం లభించిందని అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ ప్రకటించింది. ట్రావాటన్ ఆఫ్తాల్మిక్ సొల్యూషన్‌కు జనరిక్ సమానమైన తమ ఔషధాన్ని అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ(యూఎస్ఎఫ్‌డీఏ) ఆమోదించిందని రెగులేటరీ ఫైలింగ్‌లో అలెంబిక్ పేర్కొంది. ఓపెన్ యాంగిల్ గ్లకోమా లేదా ఆక్యులర్ హైపర్‌టెన్షన్ ఉన్నవారిలో ఇంట్రాక్యులర్ ఒత్తిడిని తగ్గించేందుకు తమ ఔషధం ఉపకరిస్తుందని వివరించింది.

## గ్రాన్యూల్స్ 'లోరాటాడైన్' ఏఎన్‌డీఏకు ఆమోదం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లోరాటాడైన్ జనరిక్ బిళ్లలను అమెరికా మార్కెట్‌లోకి విడుదల చేయడానికి గ్రాన్యూల్స్ చేసిన అబ్రివియేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్ (ఏఎన్‌డీఏ)కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) ఆమోదం తెలిపింది. 10 గ్రాముల మోతాదులో లోరాటాడైన్ బిళ్లలను కంపెనీ విడుదల చేస్తుంది. అమెరికా రిఫరెన్స్ లిస్టెడ్ ఔషధమైన 'క్లారిటిన్' బిళ్లలకు గ్రాన్యూల్స్ జనరిక్‌ను ప్రవేశపెడుతోంది. బేయర్ హెల్త్‌కేర్ ఎల్ఎల్‌సీ క్లారిటిన్ బిళ్లలను తయారు చేస్తోంది. లోరాటాడైన్ బిళ్లలను త్వరలోనే విడుదల చేయనున్నట్లు గ్రాన్యూల్స్ వెల్లడించింది. లోరాటాడైన్ యాంటీ హిస్టామైన్ ఔషధం. దురద, ముక్కు కారడం తదితరాలను తగ్గించడానికి దీన్ని వాడతారు.

## బులియన్ మార్కెట్ మరింత పైకి

- రూ.39,000 పైన పసిడి ధర

న్యూఢిల్లీ : బులియన్ మార్కెట్ మళ్లీ కళకళలాడుతోంది. 10 గ్రాముల మేలిమి (24 కేరట్లు) పసిడి ధర మళ్లీ రూ.39,000 దాటిపోయింది. క్రిస్మస్ కొనుగోళ్లతో మంగళవారం ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.191 పెరిగి రూ.39,239కు చేరింది. పసిడితో పోలిస్తే వెండి ధర పెరుగుదల మరింత ఎక్కువగా ఉంది. కిలో వెండి ధర రూ.943 పెరిగి రూ.47,146కు చేరింది. ఏపీ, తెలంగాణల్లోనూ మంగళవారం బంగారం, వెండి ధరల్లో పెరుగుదల కనిపించింది. 10 గ్రాముల మేలిమి బంగారం ధర హైదరాబాద్ మార్కెట్‌లో రూ.38,330 వద్ద స్థిరంగా ఉంది. కిలో వెండి ధర మాత్రం రూ.600 పెరిగి రూ.46,000 వద్ద ముగిసింది. వైజాగ్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర రూ.180, కిలో వెండి ధర రూ.500 పెరిగాయి. క్రిస్మస్ కొనుగోళ్లకు తోడు అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరగడమూ ఇందుకు కలిసొచ్చింది.

## యెస్ బ్యాంకుతో అశోక్ లేలాండ్ జట్టు

న్యూఢిల్లీ: హిందూజా గ్రూపునకు చెందిన అశోక్ లేలాండ్ తమ వాహనాలపై రెండేళ్ల పాటు రుణ సదుపాయం అందించేందుకు యెస్ బ్యాంకుతో జతకట్టినట్లు ప్రకటించింది. ఈ మేరకు అవగాహన పత్రాల్ని మార్చుకున్నట్లు వెల్లడించింది. ఈ ఒప్పందంతో ఇరు సంస్థల బలం మరింతగా పెరుగుతుందని అశోక్ లేలాండ్ ఆశాభావం వ్యక్తం చేసింది.

# త్రిశంకు స్వర్గంలో భారత ఆర్థిక వ్యవస్థ

## వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలి: ఐఎంఎఫ్

వాషింగ్టన్ : భారత జీడీపీ వృద్ధి రేటు పతనంపై అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. వెంటనే వ్యవస్థాగత సంస్కరణల ద్వారా దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే, వృద్ధి రేటు మరింత పడకేసే ప్రమాదం ఉందని హెచ్చరించింది. సెప్టెంబరు, 2019 సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్ఠ స్థాయి 4.5 శాతానికి పడిపోయింది. దేశీయ ప్రైవేటు డిమాండ్ వృద్ధి రేటూ ఒక శాతానికి క్షీణించింది. ఈ నేపథ్యంలో ఐఎంఎఫ్ ఈ హెచ్చరిక చేయడం విశేషం. ప్రస్తుత ఆర్థిక మందగమనం చాలా వరకు చక్రీయ సమస్యే తప్ప, వ్యవస్థాగతం కాదని స్పష్టం చేసింది. గతంలో అంచనా వేసిన విధంగా ఈ మందగమనం త్వరలో ముగిసే అవకాశం లేదని ఐఎంఎఫ్ తెలిపింది. వృద్ధి రేటు మళ్లీ గాడిలో పడేందుకు చాలా కాలమే పట్టేట్టుందని పేర్కొంది.

### వ్యవస్థాగత సంస్కరణలే మార్గం

వృద్ధి రేటును మళ్లీ పట్టాలెక్కించేందుకు భారత్ వెంటనే వ్యవస్థాగత సంస్కరణలకు పూనుకోక తప్పదని ఐఎంఎఫ్ స్పష్టం చేసింది. ముఖ్యంగా కార్మిక చట్టాలు, భూ చట్టాల వంటి కీలక విషయాల్లో సంస్కరణలు అవసరమని పేర్కొంది. బ్యాంకుల మొండి బకాయిలతో పాటు ద్రవ్య లోటునూ కట్టడి చేయక తప్పదని తెలిపింది. మిగతా ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే భారత ద్రవ్య లోటు, ప్రభుత్వ రుణ భారం ఇప్పటికీ ఎక్కువగానే ఉందని పేర్కొంది. ఆర్థిక మందగమనం నేపథ్యంలో బడ్జెట్‌లో పేర్కొన్న ద్రవ్య లోటు లక్ష్యాన్ని పక్కన పెట్టి, వృద్ధికి పెద్ద పీట వేయాలనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విత్త లోటు లక్ష్యం దాటకూడదని ఐఎంఎఫ్ పేర్కొనడం విశేషం.



ఢిల్లీలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన ఐఎంఎఫ్ చీఫ్ ఎకనామిస్ట్ గీతా గోపీనాథ్

# రాబోయేవన్నీ పెట్రోల్ వాహనాలే

- రెనో ఇండియా సీఈఓ వెంకట్రామ్ మామిళ్లపల్లి

చెన్నై : ఇక ముందు తమ కంపెనీ పెట్రోల్‌తో నడిచే బీఎస్ 6 ప్రమాణాలతో కూడిన వాహనాలు మాత్రమే తయారుచేస్తుందని రెనో ఇండియా కంట్రీ సీఈఓ వెంకట్రామ్ మామిళ్లపల్లి తెలిపారు. 2020 సంవత్సరంలో నాలుగు మీటర్ల లోపు నిడివి గల కొత్త ఎస్‌యూవీని ప్రవేశపెట్టడంతో పాటు ప్రస్తుత మోడళ్లలో కొత్త వేరియెంట్లు విడుదల చేస్తామని ఆయన అన్నారు. అలాగే డీజిల్ వాహనాలు నిలిపివేయాలన్న నిర్ణయం కారణంగా ఎంపీవి లాడ్జీని కూడా నిలిపివేస్తున్నామని, ప్రస్తుతం ఆ వాహనం స్టాక్ కూడా ఏమీ లేదని ప్రకటించారు. దాని బీఎస్ 6 విడుదల చేసే యోచన ఏదీ లేదని ఆయన చెప్పారు. ఇటీవల విడుదల చేసిన ట్రైబర్ కారు ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ వెర్షన్‌ను కూడా వచ్చే ఏడాది ప్రవేశపెట్టనున్నామన్నారు. కెజీకే డీజిల్ ఇంజన్ల తయారీని నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రీమియం ఎస్‌యూవీ కాప్చర్ కూడా పెట్రోల్ వెర్షన్‌లోనే తయారవుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రెనో నుంచి క్విడ్, ట్రైబర్, డస్టర్, కాప్చర్ మార్కెట్‌లో ఉన్నాయి.

## అగ్రస్థానంలో మారుతీ సుజుకీ డిజైర్

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి 8నెలల కారు అమ్మకాల్లో మారుతీ సుజుకీకి చెందిన డిజైర్ అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం 1.2లక్షల యూనిట్లు ఈ కాలపరిమితిలో విక్రయించినట్లు మారుతీ ప్రకటించింది. కాంపాక్ట్ సెడాన్ విభాగంలో డిజైర్‌కు 60శాతం వాటా ఉందని వెల్లడించింది.

## జోరుగా బీఎస్-6 యాక్టివా విక్రయాలు

ముంబై: ద్విచక్ర వాహనాల్లో దేశంలోనే రెండో అతి పెద్ద ఉత్పత్తిదారైన హోండా, 60 వేల బీఎస్-6 యాక్టివా, ఎస్‌పీ 125లను విక్రయించినట్లు తాజాగా ప్రకటించింది. బీఎస్-6 యాక్టివా మోడల్‌ను హోండా ఈ ఏడాది సెప్టెంబరులో లాంచ్ చేయగా.. ఎస్‌పీ 125ను నవంబరులో ప్రవేశపెట్టింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి భారత్‌లో కేవలం బీఎస్-6 మోడళ్లను మాత్రమే విక్రయించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. హోండా ముందుగానే బీఎస్-6 నిబంధనలకు ఉత్పత్తిని మొదలుపెట్టడం గమనార్హం. యాక్టివా ధర రూ. 67,490 గా ఉండగా.. ఎస్‌పీ 125 రూ. 72వేల ధరలో లభిస్తోంది.

# రెండో రోజూ నష్టాలే



### నేడు మార్కెట్లకు సెలవు

క్రిస్మస్ సందర్భంగా బుధవారం స్టాక్ మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. స్టాక్ మార్కెట్‌తో పాటు ఫారెక్స్, కమొడిటీస్ మార్కెట్లూ బుధవారం పని చేయవు.

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిసింది. అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ 181.40 పాయింట్ల నష్టంతో 41,461.26 వద్ద, నిఫ్టీ 48.20 పాయింట్ల నష్టంతో 12,214.55 వద్ద ముగిశాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 13 కంపెనీల షేర్లు మాత్రమే మంగళవారం లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్‌లోని ప్రధాన షేర్లయిన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ కౌంటర్లలో అమ్మకాలు సూచీల్ని బాగా కుంగదీశాయి. వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు మరింత కుంగిపోయే ప్రమాదం ఉందన్న ఐఎంఎఫ్ హెచ్చరిక మార్కెట్‌ను బెంబేలెత్తించింది. గురువారం ముగిసే డిసెంబరు నెల డెరివేటివ్స్ సెటిల్‌మెంట్‌తో ట్రేడర్లు ఆచితూచి వ్యవహరించడమూ, మార్కెట్‌ను నిరాశపరిచింది. సానుకూల వార్తలు ఏమీ లేకపోవడం, లాభాల స్వీకరణ అమ్మకాలు, పెరుగుతున్న ముడి చమురు ధరా మార్కెట్‌ను భయపెట్టాయి. సంవత్సరాంత సెలవులతో ఎఫ్‌పీఐలు, దేశీయ సంస్థాగత మదుపరులు ట్రేడింగ్‌కు దూరంగా ఉండడమూ, మార్కెట్‌ను నిరాశ పరిచింది. వచ్చే కేంద్ర బడ్జెట్ వరకూ మార్కెట్ ఇలానే ఎదుగూ బొదుగు లేకుండా ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా.

### రూ.337 కోట్లతో ఎన్ఐఐటీ షేర్ల బైబ్యాక్

న్యూఢిల్లీ : మరో ఐటీ సేవల కంపెనీ షేర్లను బైబ్యాక్ చేస్తోంది. ఈక్విటీలో దాదాపు 20 శాతానికి సమానమైన 19,56,290 షేర్లను రూ.337.46 కోట్లతో బైబ్యాక్ చేయాలని ఎన్ఐఐటీ టెక్నాలజీస్ కంపెనీ నిర్ణయించింది. డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపినట్టు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలియజేసింది. ఒక్కోటి రూ.10 ముఖ విలువ ఉన్న ఈ షేర్లకు బైబ్యాక్ కింద రూ.1,725 వరకు చెల్లించనున్నట్టు తెలిపింది. అయితే ఈ బైబ్యాక్ వాటాదారులు, నియంత్రణ సంస్థల తుది ఆమోదానికి లోబడి ఉంటుందని ప్రకటించింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 24వ తేదీకి.. హైదరాబాద్ | 435 | విజయవాడ | 458 |
| 25వ తేదీకి.. చిత్తూరు | 458 | విశాఖపట్నం | 475 |
| గోదావరి | 458 | వరంగల్ | 438 |
| | | డజను గుడ్లు రూ. | 69 |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 100 | విజయవాడ | 100 |
| వరంగల్ | 100 | గుంటూరు | 100 |
| మహబూబ్‌నగర్ | 100 | ఒంగోలు | 102 |
| కరీంనగర్ | 100 | చిత్తూరు | 93 |
| కర్నూలు | 100 | నెల్లూరు | 93 |
| విశాఖపట్నం | 105 | అనంతపురం | 89 |
| గోదావరి | 100 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 38,330 | 38,960 | 39,660 | 38,950 | --- |
| క్రితం ముగింపు | 38,300 | --- | 39,480 | 38,850 | 38,330 |
| 22 క్యారెట్లు | 36,500 | 36,100 | 36,480 | 36,160 | --- |
| క్రితం ముగింపు | 36,480 | --- | 36,320 | 35,980 | 36,510 |
| వెండి (కిలో) | 46,000 | 47,200 | 46,900 | 47,000 | --- |
| క్రితం ముగింపు | 45,400 | --- | 46,400 | 46,100 | 48,800 |

# రశీదును చూపించి రచ్చ!

- తనపై విచారణ వార్తలపై సుజనా ఆగ్రహం
- రాష్ట్రపతికి ఏ అర్జీ వచ్చినా కేంద్రానికి పంపిస్తారు
- విజయసాయి రెడ్డి నిర్ధారిత నేరస్తుడని ధ్వజం
- ఆరోపణలకు కట్టుబడి ఉన్నా: సాయిరెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎంపీ సుజనా చౌదరి ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని, ఆయనపై విచారణ జరిపించాలని వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదును రాష్ట్రపతి కేంద్ర హోంశాఖ పరిశీలనకు పంపినట్లు తెలిసింది. దీంతో... ఇక ఏ క్షణమైనా సుజనాపై కేంద్ర హోంశాఖ విచారణకు ఆదేశించవచ్చంటూ మంగళవారం ప్రచారం జరిగింది. దీనిని సుజనా చౌదరి ఖండించారు. దేశంలో ఏ వ్యక్తి రాష్ట్రపతికి అర్జీ పెట్టినా దానిని సంబంధిత శాఖకు పంపడం సహజమని తెలిపారు. "నాపై విజయసాయిరెడ్డి సెప్టెంబరు 26న లేఖరాయగా, దానిని దాదాపు నెలన్నర తర్వాత... నవంబరు 6న రాష్ట్రపతి కార్యాలయం కేంద్ర హోంశాఖకు పంపింది. ఫిర్యాదు అందినట్లుగా రాష్ట్రపతి భవన్ ఇచ్చిన రశీదును పట్టుకుని నా ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు చిల్లర ప్రయత్నాలు చేస్తున్నారు" అని విమర్శించారు. పీపీఏల రద్దు, పోలవరం రివర్స్ టెండరింగ్ వంటి అవకతవక నిర్ణయాలకు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) మద్దతుందని విజయసాయి రెడ్డి గతంలో చేసిన తప్పుడు ప్రచారాన్ని తిప్పిగొట్టానని... దీంతో పీఎంవో అధికారులు ఆయనకు క్లాస్ తీసుకున్నారని సుజనా పేర్కొన్నారు. ఈ కక్షతోనే అభూతకల్పనలు, అసత్య ఆరోపణలతో ఆయన రాష్ట్రపతికి లేఖ రాశారని చెప్పారు. తనపై ఎక్కడా, ఏ విధమైన కేసులూ లేవని స్పష్టం చేశారు. వారం వారం కోర్టు మెట్లెక్కుతూ, తుది తీర్పు కోసం, తీర్పుతో పడే శిక్ష కోసం బిక్కుబిక్కుమంటూ ఎదురుచూస్తున్న నిర్ధారిత నేరస్థుడని విజయసాయిరెడ్డిపై విరుచుకుపడ్డారు. "ఆయన 16 నెలలు జైలు ఊచలు లెక్కపెట్టి వచ్చారు. ఇకనైనా తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలు కట్టిపెట్టాలి" అని సూచించారు. అయితే, సుజనాపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని మంగళవారం రాత్రి పొద్దుపోయాక విజయసాయి రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రపతికి ఇచ్చిన ఫిర్యాదులో సుజనా అక్రమాలన్నీ వివరించానని తెలిపారు. "అది ఫిర్యాదుకు రశీదు మాత్రమే అని సుజనా అంటున్నారు. ఆ మాత్రానికి ఆయన ఎందుకు భయపడుతున్నారు? డిపాజిటర్ల సొమ్మును మింగేసిన వ్యక్తిని వదిలేస్తే దేశంలో న్యాయం, చట్టం అనే పదాలకు విలువ ఉండదు" అని అన్నారు.

## కోడిపందేలపై తీసుకున్న చర్యలేంటి?

- కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయండి: హైకోర్టు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగే కోడిపందేల నియంత్రణకు ఏం చర్యలు తీసుకున్నారో పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరికి వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.వెంకటరమణతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కోడిపందేల నియంత్రణపై 2016లో ఉమ్మడి హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులను అధికారులు సరిగ్గా అమలు చేయలేదని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం ముందు మంగళవారం మరోమారు విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది వాదిస్తూ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి కోడిపందేలు జరగకుండా పర్యవేక్షిస్తున్నామని కోర్టుకు వివరించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది.

## పందాలు కొనసాగుతాయి: రామకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'ఉభయ గోదావరి జిల్లాల్లో కోడి పందాలు సంప్రదాయం. సంక్రాంతి రోజుల్లో అవి కొనసాగుతాయి.' అని వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు స్పష్టం చేశారు. కాళ్లకు కత్తులు కట్టి, డబ్బులతో పోటీలు నిర్వహిస్తే ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కత్తులు కట్టి కోడి పందాలు ఆడినవారిపై గతంలో ప్రభుత్వం 2500 కేసులు నమోదు చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

## ఏపీపీఎస్సీ చైర్మన్ విధుల్ని అడ్డుకోవద్దు: హైకోర్టు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ చైర్మన్ పి.ఉదయ భాస్కర్ విధుల్ని అడ్డుకోరాదని హైకోర్టు ఆదేశించింది. ఒకవేళ ఎవరైనా అడ్డుకుంటే బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేసుకోవచ్చని ఆయనకు సూచిస్తూ జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి ఉత్తర్వులిచ్చారు. తనను బాధ్యతలు నిర్వర్తించకుండా ఇన్‌చార్జ్ చైర్మన్‌గా జింకా జనార్దన్‌ను నియమించారంటూ ఏపీపీఎస్సీ చైర్మన్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... చైర్మన్ విధులను అడ్డుకుంటున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కమిషన్ కార్యదర్శి తదితరులకు ఆదేశాలు జారీ చేశారు.

## 3నుంచి విజయవాడ పుస్తక మహోత్సవాలు

- ప్రధాన వేదికకు జర్నలిస్టు రాఘవాచారి పేరు

విజయవాడ (వన్‌టౌన్), డిసెంబరు 24: విజయవాడ స్వరాజ్యమైదానంలో జనవరి 3నుంచి 12వరకు పుస్తక మహోత్సవాలు నిర్వహించనున్నట్టు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షుడు బి.బాబ్జి, కార్యదర్శి ఎస్.వెంకట నారాయణ తెలిపారు. పుస్తక మహోత్సవాల ప్రాంగణానికి గుంటూరుకు చెందిన న్యూ స్టూడెంట్ బుక్ సెంటర్ అధినేత బెల్లపు రమేష్, ప్రధాన వేదికకు ప్రముఖ జర్నలిస్టు రాఘవాచారి పేర్లు పెట్టినట్లు చెప్పారు. విద్యార్థుల కార్యక్రమాలు నిర్వహించే ప్రతిభా వేదికకు డాక్టర్ హేమ పరిమిగా నామకరణం చేసినట్టు తెలిపారు. పది రోజు పాటు సాయంత్రం 5-6గంటల వరకు 'నన్ను ప్రభావితం చేసిన పుస్తకం' అంశంపై కార్యక్రమం ఉంటుందన్నారు. దీనిలో మాట్లాడదలచుకున్న వారు తమ పేరు, పుస్తకం, తేదీ వివరాలను 99895 95395కు ఫోన్‌చేసి తెలుసుకోవాలని కోరారు.

## 'నాడు-నేడు' టెండర్లకు ఉన్నత స్థాయి కమిటీ

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'నాడు-నేడు' కార్యక్రమం కింద చేపట్టే పనులకు సంబంధించిన టెండర్ డాక్యుమెంట్ల తయారీ, టెండర్ల మూల్యాంకనం, ప్రొక్యూర్‌మెంట్ టెండర్ల ఆమోదం కోసం ప్రభుత్వం 11 మందితో ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీకి చైర్మన్‌గా పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, మెంబర్ కన్వీనర్‌గా పాఠశాల విద్యా కమిషనర్ వ్యవహరిస్తారు. 'నాడు-నేడు'లో భాగంగా పాఠశాలల్లో ఫర్నిచర్, ఫ్యాన్లు, టాయిలెట్ పరికరాలు, గ్రీన్ చాక్ బోర్డుల కొనుగోలు కోసం టెండర్లు ఆహ్వానిస్తున్న విషయం తెలిసిందే.

## గ్రూప్-1కు ప్రిఫరెన్సుల గడువు 31 వరకు

వచ్చే ఏడాది ఫిబ్రవరి 4 నుంచి 16 వరకు జరగనున్న గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హులైన అభ్యర్థులు తమ ప్రిఫరెన్స్‌లు ఇచ్చుకునే గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.ఎస్.ఆర్.ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. 3 పరీక్షా కేంద్రాలు, 3 మాధ్యమాలు (తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ), పోస్టు, జోనల్/మల్టీ జోనల్‌కు సంబంధించి ప్రిఫరెన్సులు మార్చుకోవచ్చని, ఇకపై గడువు పొడిగించేది లేదని పేర్కొన్నారు. మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌లో కూడా ఎలాంటి మార్పూ లేదని తెలిపారు.

## లొంగిన మావోయిస్టు నేత శ్రీనివాస్

కామారెడ్డి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్‌లో డివిజన్‌స్థాయి మావోయిస్టు నేతగా పనిచేసిన క్యాతం శ్రీనివాస్ లొంగిపోయాడు. కామారెడ్డి ఎస్పీ శ్వేతారెడ్డి మంగళవారం మీడియాకు వివరాలు తెలిపారు. యూపీలోని బాల్ఘట్‌లో 1999లో జరిగిన గెరిల్లా ఎన్‌కౌంటర్లో ఆ రాష్ట్ర మంత్రి విక్రమ్ ఖరేను హతమార్చిన బృందంలో శ్రీనివాస్ ఉన్నాడు. ఇతనిపై పోలీసు శాఖ రూ.5 లక్షల రివార్డును ప్రకటించింది. మావోయిస్టు హైకమాండ్‌తో విభేదాలు, అనారోగ్య సమస్యలతో శ్రీనివాస్ లొంగిపోయినట్లు ఎస్పీ శ్వేతారెడ్డి తెలిపారు. ఇతని స్వస్థలం కామారెడ్డి జిల్లా దేవునిపల్లి గ్రామం. క్యాతం శ్రీనివాస్ అలియాస్ సమీర్, సూరజ్, సత్యదేవ్, రాహుల్, అరవిందల పేర్లపై తెలంగాణతోపాటు యూపీ, జార్ఖండ్‌లో మావోయిస్టు నేతగా పనిచేశాడు.

## మే 5 నుంచి టీ ఎంసెట్

హైదరాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మాతో పాటు పలు కోర్సుల్లో ప్రవేశానికి వచ్చే ఏడాది మే 5 నుంచి ఎంసెట్ నిర్వహించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) నిర్ణయించింది. ఈ మేరకు పలు ప్రవేశ పరీక్షల (సెట్స్) తేదీలను టీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ పాపిరెడ్డి మంగళవారం వెల్లడించారు. ఎంసెట్‌లో భాగంగా ఇంజనీరింగ్ విభాగానికి 5, 6, 7 తేదీల్లో, అగ్రికల్చర్ విభాగానికి 9, 11 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ రెండు సెషన్లు ఉంటాయి. ఈసారి కూడా పరీక్షలు ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తారు.


ఇడుపులపాయలో వైఎస్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సీఎం

## గణతంత్ర వేడుకలకు ఏపీ శకటం

న్యూఢిల్లీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో 2020 జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర శకటాన్ని ప్రదర్శించనున్నారు. సాంస్కృతిక వారసత్వ కళారూపాలతో ఆకర్షణీయంగా రూపొందించిన ప్రగతి రథాన్ని కేంద్ర రక్షణశాఖ ఎంపిక చేసింది. దీనిలో ఏపీ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల జీవనశైలితో పాటు తిరుమల శ్రీవారి ఆలయం, బ్రహ్మోత్సవాలు, కూచిపూడి నృత్యాలు, ప్రఖ్యాతిగాంచిన కొండపల్లి బొమ్మలు, సహజరంగులతో కలంకారీ అద్దకాలు తదితర కళారూపాలు అత్యంత ఆకర్షణీయంగా కొలువుదీరనున్నాయి.



# సీమకు గోదారి!

(మొదటి పేజీ తరువాయి)

సాగునీరు, పట్టణ ప్రగతి పనులకు శంకుస్థాపన చేశారు. జరిగిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు. 'రాయలసీమ జిల్లాల్లో నీళ్ల లేక కరువు తీవ్రతతో జనం అల్లాడుతున్న పరిస్థితి ఉంది. శ్రీశైలం జలాశయానికి వచ్చే కృష్ణా వరద తగ్గిపోతోంది. పదేళ్ల రికార్డులను పరిశీలిస్తే 600 టీఎంసీలు, ఐదేళ్ల రికార్డులను పరిశీలిస్తే 400 టీఎంసీలకు మించి రావడం లేదు. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో నీటి కరువు తీర్చేందుకు గోదావరి జలాలు తీసుకురావడానికి బృహత్తర కార్యక్రమం చేపట్టబోతున్నాం. గోదావరి నుంచి ఏటా 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయి. గోదావరి జలాలు బొల్లాపల్లి రిజర్వాయరుకు తీసుకొస్తాం. అక్కడి నుంచి కర్నూలు జిల్లాలో బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు ఎత్తిపోస్తే సీమ జిల్లాలు సస్యశ్యామలమవుతాయి. బొల్లాపల్లి రిజర్వాయరు వల్ల గుంటూరు, ప్రకాశం, నెల్లూరులకు సాగు, తాగునీటి సమస్య తీరనుంది. ఇందుకోసం రూ.60 వేల కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇది సాకారం కావాలంటే మీ బిడ్డకుమీఆశీర్వాదం కావాలి' అన్నారు.



### గత పాలకుల నిర్లక్ష్యం..

శ్రీశైలం జలాశయానికి ఈ ఏడాది భారీగా వరద వచ్చిందని.. ఎనిమిది సార్లు గేట్లు ఎత్తామని.. ప్రకాశం బ్యారేజీ నుంచి 800 టీఎంసీలు సముద్రం పాలయ్యాయని జగన్ చెప్పారు. 'గండికోట జలాశయ సామర్థ్యం 27 టీఎంసీలు.. నింపింది 12 టీఎంసీలు. చిత్రావతి కెపాసిటీ 10 టీఎంసీలైతే 6 టీఎంసీలు, బ్రహ్మంసాగర్ కెపాసిటీ 17.3 టీఎంసీలు కాగా 8 టీఎంసీలు మాత్రమే నింపుకోగలిగాం. శ్రీశైలంకు భారీగా వరద వచ్చినా రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రాజెక్టులు నింపుకోలేని పరిస్థితికి నాటి పాలకుల నిర్లక్ష్యమే కారణం' అని ఆరోపించారు. ఆ రోజుల్లోనే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేసి, కాల్వల సామర్థ్యం పెంచి ఉంటే ఇవాళ ఈ జిల్లాల డ్యాంలు నిండుకుండల్లా కళకళలాడేవని తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌తో పాటు తెలుగుగంగ సామర్థ్యాన్ని 11,500 నుంచి 18 వేల క్యూసెక్కుల వరకు, కేసీ కెనాల్ నిప్పులవాగు సామర్థ్యాన్ని 12,500 నుంచి 35 వేల క్యూసెక్కులకు, జీఎన్ఎస్ఎస్, ఎస్ఆర్‌బీసీ కాలువల సామర్థ్యాన్ని 21,500 క్యూసెక్కుల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెంచనున్నట్లు సీఎం చెప్పారు. త్వరలోనే ఈ పనులను చేపట్టబోతున్నామని తెలిపారు.

### వక్ఫ్ బోర్డుకు కళాశాల స్థలం

'ఎన్నికల సమయంలో రాయచోటికి వచ్చినప్పుడు ఇక్కడ ముస్లింలకు ఇచ్చిన మాట ప్రకారం వక్ఫ్‌బోర్డు, ఎడ్యుకేషన్ శాఖల మధ్య వివాదంగా ఉన్న 4 ఎకరాల స్థలం ముస్లిం అభ్యున్నతి కోసం వక్ఫ్‌బోర్డుకు ఇస్తాం. రేపటికల్లా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తానని ఇదే వేదిక మీద నుంచి మాట ఇస్తున్నా. గత ప్రభుత్వంలో రాయచోటి మున్సిపల్ చైర్మన్ భర్త, మాజీ కోఆప్షన్ సల్లావుద్దీన్ రాయచోటి అభివృద్ధికి నాటి సీఎం చంద్రబాబును నిధులు అడిగితే.. మా పార్టీలో చేరితే రూ.3 కోట్లు ఇస్తానని చెప్పాడని సల్లావుద్దీన్ అంటున్నారు. అలాంటి పరిస్థితి లేకుండానే ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.340 కోట్లతో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు ఇస్తున్నా. వాళ్లకు, మాకు ఉన్న చిత్తశుద్ధి ఇదే' అని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు పాల్గొన్నారు.

### వైఎస్ఆర్ ఘాట్‌లో సీఎం నివాళులు

మంగళవారం ఉదయం పులివెందుల నియోజకవర్గం ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్‌ను జగన్ సందర్శించారు. తల్లి విజయమ్మ, సోదరి షర్మిల, భార్య భారతి, కూతుర్లు హర్ష, వర్ష, మేనల్లుడు రాజారెడ్డితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి వైఎస్‌కు ఘనంగా నివాళులర్పించారు. కాగా.. బుధవారం ఆయన పులివెందుల సీఎస్ఐ చర్చిలో జరిగే క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొంటారు. అనంతరం జూనియర్ కళాశాలలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని రూ.347 కోట్లతో మెడికల్ కళాశాల, రూ.120 కోట్లతో లింకురోడ్డు పనులు, రూ.100 కోట్లతో పులివెందులలో అండర్ డ్రైనేజీ, రూ.20 కోట్లతో జేఎన్‌టీయూ కళాశాలలో మౌలిక వసతులు, రూ.65 కోట్లతో వేంపల్లె అండర్ గ్రౌండ్ డ్రైనేజీ.... ఇలా రూ.937 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు.

- తిరుపతి విమానాశ్రయం ఆనుకుని ఉన్న రూ.225 కోట్ల సర్కారు భూమిపై కన్ను
- ప్రైవేటుకు అప్పగిస్తూ రెవెన్యూ ఆదేశాలు.. తెరవెనుక రాజకీయ నాయకుల పాత్ర

# వద్దన్నా వినరే!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అది తిరుపతి విమానాశ్రయానికి(రేణిగుంట) ఆనుకుని ఉన్న భూమి. మొత్తం 22.50 ఎకరాలు. దాని విలువ రూ.225 కోట్లపైనే. ఇది అచ్చంగా సర్కారు వారిది. అందుకే... నిషేధిత భూముల జాబితా 22-ఏలో చేర్చారు. కానీ.. కొందరు పెద్దలు రంగంలోకి దిగారు. చిత్తూరు కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తిరుపతి సబ్‌కలెక్టర్, ఇంకా ఇతర అధికారులు వ్యతిరేకించినా, అది ప్రభుత్వ భూమి అని అన్ని ఆధారాలు చూపించినా ఫలితంలేకపోయింది. ఆ భూమిని ప్రైవేటుకే కట్టబెట్టాలంటూ సచివాలయ స్థాయిలో ఉత్తర్వులు వెలువడ్డాయి. చిత్తూరు జిల్లా యేర్పేడు మండలం వికృతమాల గ్రామంలో 22.57 ఎకరాలు ప్రభుత్వ అధీనంలో ఉంది. ఈ భూమి రేణిగుంట విమానాశ్రయానికి సమీపంలో ఉంది. ఇక్కడ ఎకరా రూ.10 కోట్లపై మాటే. ఈ భూమిని మాజీ గవర్నర్ అనంత శయనం అయ్యంగార్ నుంచి కొనుగోలు చేశామని, దీనిపై సెటిల్‌మెంట్ పట్టా ఉన్నందున, నిషేధ భూముల జాబితా నుంచి తొలగించాలని రెవెన్యూ శాఖను కొందరు ఆశ్రయించారు. నాలుగేళ్లుగా ఈ విషయం నానుతోంది. కొత్త ప్రభుత్వం వచ్చాక, ఈ పిటిషన్‌పై రెవెన్యూశాఖ శరవేగంగా స్పందించేలా, ఫైళ్లు చకచకా పరిగెత్తేలా సర్వే శాఖకు చెందిన ఇద్దరు అధికారులు కృషి చేశారు. దీనికోసం ఒక అధికారి పట్టుబట్టి రాయలసీమలో పోస్టింగ్ తెచ్చుకున్నారు. అయితే.. ఈ భూమి పక్కాగా ప్రభుత్వానిదేనని చిత్తూరు కలెక్టర్ నివేదిక ఇచ్చారు. సహజంగా భూమి వివాదాల్లో కలెక్టర్ నివేదికే ఫైనల్. కానీ, సీమకు చెందిన కీలక సర్వే అధికారి, రెవెన్యూ శాఖలోనే భూమి వ్యవహారాలు పర్యవేక్షిస్తోన్న మరో అధికారి పెద్ద మంత్రాంగమే నడిపారు. కలెక్టర్ నివేదికను తోసిరాజంటూ పిటిషనర్ పేర్కొన్న అంశాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ ఓ కమిటీని నియమించారు. ఈ కమిటీలో సీసీఎల్ఏ కార్యదర్శి చక్రవర్తి, డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రారెడ్డి, సర్వే సెటిల్‌మెంట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్(ఆర్‌డీడీ) వెంకటేశ్వరరావు, తిరుపతి సబ్ కలెక్టర్ మహేశ్ కుమార్ సభ్యులు. అది ప్రభుత్వ భూమే అని సబ్ కలెక్టర్ స్పష్టమైన ఆధారాలు ఇచ్చినా ఫలితం లేకపోయింది. దీనిని ప్రైవేటు భూమిగా తేల్చేసి... 22-ఏ నుంచి తొలగించాలంటూ కలెక్టర్‌కు ఆదేశాలు ఇస్తూ ఈ ఏడాది అక్టోబరు 10న రెవెన్యూ శాఖ మెమో జారీ చేసింది. ఇటీవలి కాలంలో చిత్తూరు కలెక్టర్‌గా భరత్ గుప్తాను నియమించారు. భూమి విషయంలో ఆయన కూడా పాతకలెక్టర్ ప్రద్యుమ్న నిర్ణయాన్నే సమర్థించారు. దీనిని 22-ఏ జాబితా నుంచి తొలగించాలని రెవెన్యూ శాఖ ఇచ్చిన ఆదేశాన్ని పక్కన పెట్టారు. ఒత్తిడి తేవడానికి సచివాలయం స్థాయిలో కొందరు చేసిన యత్నాలు ఫలించలేదు.

### సీన్ రివర్స్...

వికృతమాలలో 22.50 ఎకరాల భూమిని 22-ఏ నుంచి తొలగించాలంటూ జారీ చేసిన ఆదేశాలను పునఃసమీక్షించాలని చిత్తూరు కలెక్టర్ ఈనెల 9న రెవెన్యూశాఖకు లేఖ రాశారు. అయితే, సరిగ్గా వారం రోజుల తర్వాత ఇదే విషయమై రెవెన్యూ శాఖకు మరో ప్రైవేటు వినతిపత్రం వెళ్లింది. దాదాపు 12 పేజీలున్న వినతిపత్రంలో వాడిన భాష, రెవెన్యూ పదజాలం చూసి ఉన్నతాధికారులే విస్తుపోయారు. ఈ పిటిషన్‌ను స్వయంగా సీమలో పనిచేస్తోన్న సర్వే అధికారే లిఖించినట్లు నిర్ధారణకు వచ్చారు. అనుమానాస్పదంగా జారీ అయిన ఉత్తర్వులను నిలిపివేస్తూ మంగళవారం ఉషారాణి ఉత్తర్వులు(జీఓ 1469) ఇచ్చారు. అంతేకాదు. ఈ మొత్తం వ్యవహారంపై అత్యున్నతస్థాయి కమిటీతో విచారణకు ఆదేశించారు. ఈ కమిటీలో రెవెన్యూ శాఖ బాస్ సీసీఎల్ఏ నీరబ్‌కుమార్ ప్రసాద్, రెవెన్యూ కార్యదర్శి ఉషారాణి కూడా సభ్యులుగా ఉన్నారు.

# అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలి

- అప్పుడే వలసలు తగ్గుతాయి
- అందుకోసమే గూడెంలో 'నిట్'
- మాతృభాషను మరవొద్దు
- నిట్ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి
- కాలుష్యాన్ని అడ్డుకోండి: గవర్నర్


కాలేజ్ టాపర్ శ్రియాకు పట్టా అందిస్తున్న ఉపరాష్ట్రపతి

ఏలూరు డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'అభివృద్ధి అన్ని ప్రాంతాలకు విస్తరించి తీరాలనేదే నా అభిమతం. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగితే నగరాలకు వలస వచ్చే వారి సంఖ్య తగ్గుతుంది' అని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. తాత్కాలిక జనాకర్షణ పథకాలతో ప్రజలకు ఎలాంటి మేలు జరగదన్నారు. రాజకీయాల్లో అన్నీ ఉచితంగా ఇస్తామనడం పరిపాటిగా మారిందని ఆక్షేపించారు. ఉచిత కరెంటు వల్ల ఎలాంటి మేలూ జరగలేదని.. ఇంధన శక్తి వృధా అయిందని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్ తొలి స్నాతకోత్సవంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. వివాదాస్పదమైన రాజధాని వ్యవహారం గురించి తాను మాట్లాడడం లేదని.. కేవలం అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలనే కోరుకుంటున్నానన్నారు. 'పట్టణ ప్రాంతాల్లో ఉన్న సదుపాయాలకు ఆకర్షితులై భారీగా వలస వస్తున్నారు. సౌకర్యాలన్నీ ఒకేచోట కేంద్రీకృతం కావడమే దీనికి కారణం. ఇప్పటికైనా పరిస్థితులు మారాలి. వికేంద్రీకరణ జరగాలి. అందుకే అప్పట్లో జిల్లా కేంద్రమైన ఏలూరును కాదని తాడేపల్లిగూడెంలోనే నిట్ ఏర్పాటుకు అంగీకరించాం. మిగతావారికి కూడా అవకాశం ఇచ్చేదే వికేంద్రీకరణ. అదే జరగాలని కోరుకుంటున్నాను. అభివృద్ధి అన్ని ప్రాంతాల్లో జరగాలి. అన్ని సౌకర్యాలు రాజధానిలో, ఢిల్లీలో ఉంటే సరిపోదు' అని పేర్కొన్నారు. 'గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఆవిష్కరణలు అవసరం. వీటి కోసం అందరూ ప్రయత్నించాలి.. శ్రమించాలి' అని వెంకయ్య సూచించారు. ఈ మధ్యకాలంలో నీటి వనరులు ఆవిరైపోతున్నాయని.. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం భారత్‌లోని 21 నగరాల్లో నీరు పూర్తిగా అడుగంటిందని చెప్పారు. 'పరిస్థితి సంక్లిష్టంగా మారింది. ఇదే కొనసాగితే జలం కోసమే జగడాలు తప్పవు. అందుకే కేంద్ర ప్రభుత్వం జలశక్తి శాఖను ఏర్పాటు చేసి, నీటి పరిరక్షణకు నడుంబిగించింది' అని గుర్తు చేశారు.

### హింసను ప్రోత్సహించకూడదు..

'భారతదేశంలో మహిళలకు అత్యంత గౌరవమిస్తాం. నదులకు కూడా వారి పేర్లే పెట్టుకున్నాం. అలాంటి ఈ దేశంలో వారి పట్ల హింస, అత్యాచారాలు పెరిగిపోయాయి. కేవలం చట్టాల ద్వారానే మనస్తత్వం మార్చలేం' అని ఉపరాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. 'విద్యార్థుల్లో నైతిక విలువలు ఉండాలని.. హింసను ప్రోత్సహించకుండా చూడాలని సూచించారు. నిరసన తెలియజేయాల్సి వచ్చినప్పుడు శాంతియుతంగానే ఉండాలని చెప్పారు.

### ఆంగ్లంపై వ్యామోహం పెరిగింది..

'ఈ మధ్యకాలంలో ఆంగ్లంపై వ్యామోహం పెరిగింది. కానీ మాతృభాషను ఎవరూ మరిచిపోకూడదు. అది తల్లి గర్భం నుంచే వచ్చింది. అందరితోనూ మాతృభాషలోనే మాట్లాడాలి' అని వెంకయ్య అన్నారు. ఇంగ్లీషు, హిందీ భాషలు నేర్చుకోవడం అవసరమేనని.. కానీ మాతృభాషను మరిచిపోకూడదని చెప్పారు. ఈ దేశంలో అత్యధికులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి అన్నివిధాలా సహకరించాలని కోరారు. టెక్నాలజీ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా, సంతోషంగా ఉండేలా ఉపయోగపడాలని.. అలా లేకుంటే దానికి అర్థమే లేదని అన్నారు. 20 శాతం మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువనే ఉన్నారని, ఇది బాధాకరమని చెప్పారు.

### కాలుష్యాన్ని నియంత్రించాలి: గవర్నర్

గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ మాట్లాడుతూ.. ఇప్పటికే కాలుష్యం పెరుగుతూ పోతోందని.. దీనిని తగ్గించడానికి విద్యార్థులు ముందుకు కదలాలని పిలుపిచ్చారు. జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని.. మానసిక, శారీరక, నైతిక, ఆత్మబలం పెంచుకోవాలని హితవు పలికారు. 'ఎప్పుడూ కలలు, ఆశలను వదలొద్దు. వాటిని సాధించడానికి పట్టుదలతో ప్రయత్నించాలి. సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలి. కీలక అంశాల్లో చురుగ్గా కదలాలి' అని సూచించారు. స్నాతకోత్సవంలో మంత్రులు తానేటి వనిత, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎంపీ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ, నిట్ డైరెక్టర్ సూర్యప్రకాశ్ రావు, రిజిస్ట్రార్ అంబా ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ పంపిణీ

# 'ప్రైవేట్'కు!

- ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ రంగాల్లోకి అనుమతి
- పీపీపీ విధానంలో పెట్టుబడులు ఆహ్వానించే చాన్స్
- కేంద్రం నుంచి రాష్ట్రాలకు 2 టాస్క్‌ఫోర్స్ నివేదికలు

**వ్యవసాయ పంపుసెట్లకూ మీటర్లు వచ్చే అవకాశం**

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ వ్యవస్థ ప్రైవేట్ పరం కానుంది. ఈ రంగంలోకి ప్రైవేట్ పెట్టుబడులు ఆహ్వానించాలని కేంద్రం సంకల్పించింది. ఈ దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ రూపొందించిన టాస్క్‌ఫోర్స్ నివేదికలు రాష్ట్రాలకు చేరాయి. వాటిని రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి విద్యుత్ సంస్థలకు పంపారు. ఈ నివేదికలను అధ్యయనం చేసి అవసరమైన చర్యలకు రంగం సిద్ధం చేసుకోవాలని సూచించారు. విద్యుదుత్పత్తిలో ప్రైవేటు రంగానికి చోటు కల్పించినా ఇప్పటివరకూ పంపిణీ రంగం పూర్తిగా ప్రభుత్వ సంస్థల పరిధిలోనే ఉంది. ఉత్పత్తి కేంద్రాల నుంచి సబ్‌స్టేషన్లకు విద్యుత్‌ను తీసుకువెళ్లే టవర్ లైన్లు, సబ్‌స్టేషన్ల నుంచి వినియోగదారుల ఇళ్లు, పరిశ్రమలకు సరఫరా చేసే పంపిణీ లైన్లు ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయి. ఇప్పుడు ఇందులో కూడా ప్రైవేటు సంస్థలకు చోటు కల్పించాలని కేంద్రం నిర్ణయం తీసుకొంది. దానికి కొనసాగింపుగా రెండు టాస్క్‌ఫోర్స్ నివేదికలను తాజాగా రాష్ట్రాలకు పంపింది. ట్రాన్స్‌మిషన్ లైన్లు, దిగువ స్థాయిలో పంపిణీ వ్యవస్థలోకి ప్రైవేటు పెట్టుబడులకు ఎలా చోటు కల్పించాలన్న దానిపై ఇవి రూపొందాయి. ట్రాన్స్‌మిషన్ కన్సల్టెంట్ల నియామకం, నమూనా ట్రాన్స్‌మిషన్ ఒప్పందాలు కుదుర్చుకోవడంపై జాతీయ ప్లానింగ్ కమిషన్ కొన్ని పత్రాలు ప్రచురించింది. పీపీపీ(పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం) విధానంలో పెట్టుబడులు స్వీకరించాలని, దీనికి అవసరమైన విధానాలు రూపొందించుకోవాలని సూచించింది. కిందిస్థాయిలో ప్రాంతాల వారీగా విద్యుత్ పంపిణీకి ఏజెన్సీల నియామకానికి సంబంధించిన నమూనా విధానాలను పేర్కొన్నారు. కేంద్రం పంపిన నివేదికలను రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి రావత్ కొద్దిరోజుల క్రితం ఇంధనశాఖ కార్యదర్శి, ట్రాన్స్‌కో సీఎండీ నాగులపల్లి శ్రీకాంత్‌కు పంపారు.

### ఇకపై అందరికీ మీటర్లు: కేంద్రం

పంపిణీ రంగంలో ప్రైవేటు సంస్థల ప్రవేశంతో విద్యుత్ రంగంలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. వినియోగదారులకు చేరే ప్రతి యూనిట్ లెక్కకు రావాల్సిందేనని, దీనికోసం ఏ మినహాయింపులు లేకుండా అందరికీ మీటర్లు పెట్టాల్సిందేనని కేంద్రం సూచించింది. ప్రస్తుతం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు లేవు. కొత్త విధానాల్లో భాగంగా వీటికి కూడా మీటర్లు పెట్టాల్సి వస్తుంది. విద్యుత్ పంపిణీని కూడా దశలవారీగా ప్రైవేటీకరించే అవకాశం ఉంది.

### నివేదికల్లోని మరికొన్ని ప్రతిపాదనలు

● పాత ఏసీలు, వాటర్ హీటర్ల స్థానంలో ఎల్ఈడీ బల్బులు, ఫ్యాన్ల మాదిరిగా విద్యుత్ ఆదాచేసే వాటిని సరఫరా చేయడం. ● వ్యవసాయ పంపుసెట్లు అన్నింటినీ సౌర పంపుసెట్లతో మార్చడి. ● ప్రభుత్వ సంస్థలు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని అవి ముందుగా డబ్బు చెల్లిస్తేనే విద్యుత్‌ను ఇచ్చే విధానం.

● కొత్త టవర్ లైన్ల నిర్మాణాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించడం.

# జనాభా పట్టికా.. పౌర పట్టికా?

- ఎన్పీఆర్ గెజిట్ నోటిఫికేషన్‌పై గందరగోళం
- ఎన్‌సీఆర్‌తో ముడిపెట్టొచ్చని అనుమానం
- ఏప్రిల్ 1 నుంచి జనగణన

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ జనాభా పట్టిక(నేషనల్ పాపులేషన్ రిజిస్టర్-ఎన్‌పీఆర్)కు సంబంధించి గత ఆగస్టులో సాధారణ పరిపాలన శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌పై గందరగోళం నెలకొంది. ఓవైపు జాతీయ పౌరపట్టిక(నేషనల్ సిటిజన్ రిజిస్టర్-ఎన్‌సీఆర్)ను రాష్ట్రంలో అనుమతించబోమని సీఎం జగన్ ప్రకటించారు. మరోవైపు ఎన్‌పీఆర్‌ను ఆమోదిస్తూ విడుదల చేసిన నోటిఫికేషన్ అకస్మాత్తుగా మంగళవారం తెరపైకి రావడంతో అయోమయం నెలకొంది. ఎన్‌పీఆర్ పేరుతో తొలుత పౌరుల వివరాలు సేకరించి ఆ తర్వాత దాన్ని ఎన్‌సీఆర్‌కు అనుసంధానించి కొంతమంది పౌరులను పట్టిక నుంచి తొలగిస్తారన్న అనుమానాలతో తమ రాష్ట్రంలో ఎన్‌పీఆర్ అవసరం లేదని, అలాంటి కార్యకలాపాలు నిలిపివేయాలని కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలోనూ పలు అనుమానాలు మొదలయ్యాయి. గతంలో ఆర్పీ సిసోడియా జీఏడీ ముఖ్య కార్యదర్శిగా ఉన్న సమయంలో ఈ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. దీనిపై ఆయన్ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. 'ఎన్‌పీఆర్‌కు, ఎన్‌సీఆర్‌కు సంబంధం లేదు. కేవలం జనాభా లెక్కల నమోదు కోసం మాత్రమే ఎన్‌పీఆర్ నోటిఫికేషన్ జారీ చేశాం. జన గణనలో భాగంగా పౌరుల వివరాలు సేకరించడమే ఎన్‌పీఆర్ ఉద్దేశం' అని చెప్పారు. కాగా, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా(ఆర్‌జీఐ) జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం.. అసోం మినహా మొత్తం దేశమంతటా జనాభా పట్టికను రూపొందిస్తారు. 2020 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. గతంలో మాదిరే జనాభా లెక్కలను గ్రామ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సేకరిస్తారు. 6 నెలలుగా ఒక ప్రాంతంలో నివసిస్తున్న వారిని, లేదంటే రాబోయే 6 నెలల పాటు అదే చోట ఉంటామని చెప్పిన వారిని స్థానికులుగా పరిగణిస్తారు.

### గెజిట్ ఉపసంహరించుకోండి: సీపీఐ

రాష్ట్రంలో ఎన్ఆర్సీ అమలుకు పూర్తి వ్యతిరేకమని సీఎం జగన్ ప్రకటన చేసినా జనగణన రిజిస్టర్ అమలు కోసం ఈ ఏడాది ఆగస్టు 16నే రాష్ట్రప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్(557)ను ప్రభుత్వం విడుదల చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఆ గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీఎంకు లేఖ రాశారు.

### జగనన్నా నువ్వు సూపర్ అన్నా: కేశినేనినాని

'జగనన్నా.. నువ్వు సూపర్ అన్నా! కేసుల మాఫీ కోసం ఎంపీలతో సీఏబీకి అనుకూలంగా ఓటేయిస్తావు.. ముస్లింల ఓట్ల కోసం ఎన్ఆర్సీకి వ్యతిరేక మంటావు.. ఏదయినా నీకే చెల్లిందన్న. హ్యాట్సాఫ్ అన్నా' అని ట్విట్టర్‌లో విజయవాడ ఎంపీ నాని ఎద్దేవా చేశారు. కాగా, 'మాట తప్పను.. మడమ తిప్పను' అని పదే పదే మాట్లాడే జగన్ అధికారంలోకి వచ్చాక ప్రతి విషయంలోనూ మాట తప్పి ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మంగళగిరిలో విమర్శించారు.

# సీఏఏ నిరసనల్లో జర్మన్ విద్యార్థి

**వీసా నిబంధనలు ఉల్లంఘించాడని స్వదేశానికి తరలింపు**




చెన్నై, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఏఏకు వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొన్న జర్మన్ విద్యార్థిని అధికారులు స్వదేశానికి పంపించేశారు. చెన్నైలోని వళ్లువర్‌కోట్టమ్ వద్ద ఐఐటీ మద్రాసు విద్యార్థులు ధర్నా నిర్వహించారు.జర్మనీకి చెందిన భౌతికశాస్త్రం పీజీ విద్యార్థి జాకబ్ కూడా పాల్గొన్నాడు. 1933 నుంచి 1945 వరకు జర్మనీలో చూసిన హిట్లర్ అకృత్యాలు ఇప్పుడు భారత్‌లోనూ జరుగుతున్నాయంటూ ప్లకార్డు ప్రదర్శించాడు. ఆ దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జాకబ్ వీసా నిబంధనలు ఉల్లంఘించాడని నిర్ధారించిన అధికారులు తక్షణం స్వదేశానికి వెళ్లిపోవాలని సోమవారం రాత్రి ఆదేశించారు. దీంతో జాకబ్ మూటాముల్లె సర్దుకొని విమానంలో జర్మనీకి వెళ్లిపోయాడు. దేశఅంతర్గత వ్యవహారాల్లో విదేశీయుల జోక్యాన్ని ఎలా అనుమతిస్తామని బీజేపీ ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డే ప్రశ్నించారు.

## సౌదీలో ఐదుగురు భారతీయుల అరెస్ట్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సీఏఏపై సదస్సు నిర్వహించిన ఐదుగురు భారతీయులను సౌదీఅరేబియా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రాత్రి రియాద్ నగరం మలాజ్‌లోని ఓ హోటల్‌లో భారతీయ పౌరసత్వ సవరణచట్టం- మిధ్య- అన్వేషణ అంశంపై సంఘ్ పరివార్ సంబంధిత ప్రవాసీ సంఘం సదస్సు ఏర్పాటు చేసింది. ఇందులో పాల్గొన్న వక్తలు, సభికులంతా మలయాళీలు. కార్యక్రమం తర్వాత కొందరు ఉద్రిక్తత సృష్టించారు. వారిని కలిసేందుకు భారత ఎంబసీ అధికారులు రెండు రోజులుగా ప్రయత్నిస్తున్నా సౌదీ అధికారులు అనుమతించడం లేదని తెలుస్తోంది.

## మహా దళపతికి కేబినెట్ ఓకే!

**తొలి సీడీఎస్‌గా రావత్‌కు చాన్స్?**



న్యూఢిల్లీ, డిసెంబరు 24: రక్షణ దళాలకు సంయుక్త అధిపతి(చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్- సీడీఎస్) నియామకానికి భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. త్రివిధ దళాల మధ్య సమన్వయం- సీడీఎస్ ముఖ్య కర్తవ్యం. రక్షణ, వ్యూహాత్మక అంశాల్లో ప్రధానికి, రక్షణ శాఖకు ముఖ్య సలహాదారుగా వ్యవహరిస్తారు. సీడీఎస్ సారథ్యంలో మిలిటరీ వ్యవహారాల విభాగాన్ని నెలకొల్పనున్నట్లు సమాచార, ప్రసార మంత్రి ప్రకాశ్ జావడేకర్ వెల్లడించారు. ఇది రక్షణ శాఖ కింద పనిచేస్తుందని చెప్పారు. నాలుగు నక్షత్రాల అధికారి అయిన సీడీఎస్ వేతనం త్రివిధ దళాధిపతులతో సమానంగా ఉంటుందన్నారు. సీడీఎస్ బాధ్యతలు, అధికారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సమర్పించిన నివేదికను కేబినెట్ కమిటీ ఆమోదించింది. మిలిటరీలో మైలురాయి వంటి సంస్కరణ అయిన సీడీఎస్ పోస్టును సృష్టిస్తున్నట్లు ఆగస్టు 15న ప్రధాని మోదీ ప్రకటించారు. రక్షణ శాఖకు సీడీఎస్ కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ పేరు తొలి సీడీఎస్‌కు ప్రముఖంగా వినిపిస్తోంది.

### ఎప్పటి నుంచో సీడీఎస్ ప్రతిపాదన

చైనా చేతిలో భంగపాటుకు త్రివిధ దళాల మధ్య సమన్వయ లేమి కారణమన్న అభిప్రాయం వ్యక్తమవడంతో సీడీఎస్ ఆలోచన 1962లోనే వచ్చింది. అదే 1971 బంగ్లాదేశ్ యుద్ధ సమయంలో త్రివిధ దళాలు ఒక్కటై విరుచుపడటంతో అపూర్వ విజయం సాధ్యమైంది. కార్గిల్ యుద్ధ సమయంలో మళ్లీ తెరపైకి వచ్చింది. ఆడ్వాణీ నేతృత్వంలోని మంత్రుల బృందం యుద్ధ సమయంలో లోపాలను చర్చించి, వ్యూహాత్మక వ్యవహారాల నిపుణుడు కె.సుబ్రమణ్యం నేతృత్వంలో కమిటీని నియమించింది. సీడీఎస్ ఉండాలని సుబ్రమణ్యం సూచించారు. ఇటలీ, ఫ్రాన్స్, చైనా, యూకే సహా పలు దేశాల్లో సీడీఎస్ తరహా పోస్టు ఇప్పటికే ఉంది.

## రైల్వే బోర్డు సభ్యుల సంఖ్య 5కు కుదింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 24: రైల్వే పునర్‌వ్యవస్థీకరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని ప్రకారం.. రైల్వే బోర్డు సభ్యుల సంఖ్యను (ఛైర్మన్ సహా) 8 నుంచి 5కు కుదించనున్నారు. వివిధ విభాగాలను, కేడర్లను కూడా విలీనం చేయనున్నారు. ఇప్పటిదాకా వివిధ విభాగాల్లో 8 సర్వీసులు ఉండగా ఇకపై ఇండియన్ రైల్వే సర్వీస్ అనే ఒకే కేడర్ ఉంటుంది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్- మెడికల్ సర్వీస్ డిపార్ట్‌మెంట్, రైల్వే మేనేజ్‌మెంట్ సిస్టమ్‌గా రెండే విభాగాలుంటాయి. దీంతో వేర్వేరు విభాగాలు, కేడర్లతో వస్తున్న సమస్యలు పరిష్కారమవుతాయని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

### పర్యాటక ప్రాజెక్టులకు రూ.2,482 కోట్లు

'స్వదేశ్ దర్శన్'లో పాత 10 ప్రాజెక్టులకు రూ.627.40 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్త ప్రాజెక్టులకు రూ.1,854.67 కోట్ల విడుదలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

## ఇక రైల్వేలోనూ యూజర్ చార్జీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 24: విమానాశ్రయాల ఆధునికీకరణ కోసం ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న తరహాలోనే ఇకపై రైల్వేస్టేషన్లనూ యూజర్ చార్జీలు వసూలు చేయనున్నారు. ఈ విషయాన్ని ఐఆర్ఎస్‌డీసీ(భారతీయ రైల్వే స్టేషన్ల అభివృద్ధి కార్పొరేషన్) ఎండీ ఎస్‌కే లోహియా సోమవారం ఇక్కడ విలేకరులకు చెప్పారు. ఎంత వసూలు చేయాలనేది రైల్వేశాఖ నిర్ణయిస్తుందన్నారు. టికెట్ బుకింగ్‌లోనే ఈ చార్జీ వసూలు చేస్తారన్నారు.

## టికెట్లు బుక్ చేసుకుంటే 50 లక్షల బీమా

**విమాన ప్రయాణికులకు ఐఆర్‌సీటీసీ ఆఫర్**

న్యూఢిల్లీ, డిసెంబరు 24: నూతన సంవత్సర కానుకగా తమ అధికారిక వెబ్‌సైట్, లేదా మొబైల్ యాప్ ద్వారా విమాన టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులకు రూ.50 లక్షల వరకూ ప్రయాణ బీమా ఉచితంగా కల్పిస్తామని ఐఆర్‌సీటీసీ (భారత రైల్వే కేటరింగ్ టూరిజం కార్పొరేషన్) తెలిపింది. దీని కోసం భారతీ ఏఎక్స్‌ఏ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఐఆర్‌సీటీసీ ఒప్పందం చేసుకుంది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణానికీ ఈ బీమా వర్తిస్తుంది. దేశీయ విమానాల్లో లగేజీ గల్లంతైతే రూ.3 వేలు, అంతర్జాతీయ విమానాల్లో లగేజీ గల్లంతైతే రూ.17 వేలు బీమా లభిస్తుంది.

## సీబీఎస్ఈ పరీక్ష విధానంలో మార్పులు

ఇండోర్, డిసెంబరు 24: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) 12వ తరగతి పరీక్ష విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రైవేటు విద్యార్థులకు సంబంధించి ఆరు సబ్జెక్టుల్లో పాత(2019) విధానంలోనే పరీక్షలు నిర్వహిస్తారు. తొమ్మిది సబ్జెక్టుల్లో మాత్రం 2020 సంవత్సరానికి నిర్దేశించిన నమూనా పత్రాల విధానాన్నే అనుసరిస్తారు. మాస్ మీడియా స్టడీస్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, టైపోగ్రఫీ అండ్ సీఏ ఇంగ్లిష్, షార్ట్ హ్యాండ్ ఇంగ్లిష్, టైపోగ్రఫీ అండ్ సీఏ హిందీ, వెబ్ అప్లికేషన్ సబ్జెక్టుల్లో పాత పరీక్ష విధానాన్నే కొనసాగిస్తామని సీబీఎస్ఈ హెల్ప్‌లైన్ కౌన్సెలర్ జయదేవ్ కర్ తెలిపారు. ఇక ప్రైవేటుగా హాజరయ్యే విద్యార్థులకు 9 సబ్జెక్టుల్లో 2020 విధానాన్ని అనుసరిస్తామన్నారు. దీనికి సంబంధించి నమూనా ప్రశ్నపత్రాలను బోర్డు వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు.

## 'రోహతంగ్ పాస్' సొరంగానికి వాజ్‌పేయి పేరు

న్యూఢిల్లీ, డిసెంబరు 24: హిమాచల్ ప్రదేశ్‌లోని రోహతంగ్ పాస్ కింద నిర్మిస్తోన్న 8.8 కిలోమీటర్ల వ్యూహాత్మక సొరంగానికి మాజీ ప్రధాని వాజ్‌పేయి పేరు పెట్టాలని మంగళవారం ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా 2000 సంవత్సరంలో ఈ సొరంగ నిర్మాణానికి నిర్ణయించారు.

## చరిత్ర పుటల్లోకి మిగ్-27!.. ఎల్లుండి వీడ్కోలు

జోధ్‌పూర్, డిసెంబరు 24: వైమానిక దళంలో ఎందరో పైలట్ల మరణాలకు కారణమైన యుద్ధ విమానం 'మిగ్ 27' ఇక జ్ఞాపకంగా మిగిలిపోనుంది. ఏడు మిగ్ 27లతో కూడిన చివరి స్క్వాడ్రన్ శుక్రవారం జోధ్‌పూర్ ఎయిర్‌బేస్ నుంచి పూర్తిగా నిష్క్రమించనుంది. ఇకపై వీటిని దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా వినియోగించరు. రష్యా తయారుచేసిన మిగ్ 27 పైలట్ల ప్రాణాలు తీస్తున్నా భారత వాయుసేనలో మాత్రమే కొనసాగాయి. 1999 కార్గిల్ యుద్ధంలో కీలక పాత్ర పోషించి, పైలట్లతో బహదూర్ అనిపించుకున్నాయి. శుక్రవారం మిగ్ 27 పైలట్లంతా జోధ్‌పూర్ చేరుకోనున్నారు.

### ఎన్‌పీఆర్ అంటే..!

దేశంలో గ్రామస్థాయి నుంచి నగర స్థాయి దాకా నివసించేవారందరి జాబితాయే ఎన్‌పీఆర్ ! 1955 నాటి పౌరసత్వ చట్టం ఆధారంగా దీనిని చేపడతున్నారు. స్థానికంగా నివసించే వారి డేటా బేస్ తయారు దీని లక్ష్యం. అంటే ఒక ఊళ్లో ఆరునెలలుగా గానీ అంతకుమించి గానీ ఉంటున్న, ఉండాలనుకుంటున్న వ్యక్తుల డేటా. దీనికి జన సంఖ్యాది వివరాలు ఇవ్వాలి. ఎన్యూమరేటరు వచ్చి మీ పేరు, తలిదండ్రుల పేర్లు, కుటుంబ సభ్యులు (భార్యా బిడ్డల పేర్లు), పుట్టిన తేదీలు, అందరి వయసులు, జాతీయత, స్త్రీ-పురుష వివరాలు, విద్యా, ఉద్యోగ సంబంధ వివరాలు, అడ్రసులు తదితర సాధారణ వివరాలు తీసుకుంటారు. ట్యాబ్‌లోనే వీటిని స్వీకరిస్తారు.

### జనాభా లెక్కలంటే ఏంటి..?

1948లో భారత ప్రభుత్వం జనాభా చట్టాన్ని చేసింది. పదేళ్లకోసారి ఈ జనాభా లెక్కల సేకరణ జరుపుతారు. చివరిసారి 2011లో చేశారు. మళ్లీ 2021లో చేయాలి. గ్రామ, తాలూకా, జిల్లా, నగర, రాష్ట్ర స్థాయిల్లో సేకర్తలు ఇల్లిల్లూ తిరిగి 29 అంశాల్లో సమగ్రంగా వివరాలన్నీ తీసుకుంటారు. వివిధ రంగాల్లో దేశ ప్రగతిని అంచనా వేయడానికి జనాభా లెక్కల డేటానే ఉపయోగిస్తారు. ఈ డేటా దేశ ప్రజల అభివృద్ధికి కొలమానం. ఎన్‌పీఆర్ అనేది ప్రభుత్వాల అభివృద్ధి సంక్షేమ పథకాల ఫలాలు చేరుతున్నాయా లేదా, వివిధ వర్గాల సంఖ్యల్లో మార్పులేంటి, ఏఏ వర్గాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటున్నాయి.. మొదలైన వాటికి ఉపయోగిస్తారు.

### ఎన్ఆర్‌సీ అంటే..?

చట్టబద్ధమైన దేశ ప్రజల జాబితాయే జాతీయ పౌరుల జాబితా (ఎన్ఆర్‌సీ). ఇది కూడా 1955 నాటి పౌరసత్వ చట్టం ఆధారంగా రూపొందినదే. దీనిప్రకారం దేశ పౌరులంటే.. (1) 1950 జనవరి 26 తరువాత- 1987 జూలై 1కి ముందు ఇక్కడ జన్మించినవారు (2) 1987 జూలై 1- 2003 పౌరసత్వ సవరణ నిబంధనలకు పూర్వం పుట్టినవారు- వారి తలిదండ్రుల్లో ఒకరు తప్పనిసరిగా భారత పౌరులై ఉండాలి. (3) 2003 నాటి నిబంధనలు అమల్లోకి వచ్చాక పుట్టినవారు- వీరి తలిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండాలి. రెండోవారు చట్ట విరుద్ధంగా వలస వచ్చి ఉండరాదు. ఎన్ఆర్‌సీలో.. ప్రభుత్వాలు జారీచేసిన పత్రాలు చూపాలి. చట్టవిరుద్ధంగా దేశంలోకి రాలేదని నిరూపించుకోవాలి.

# జనగణ మనం!

**జనాభా లెక్కలకు లైన్‌క్లియర్**

న్యూఢిల్లీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) అప్‌డేషన్ ప్రక్రియకు కేంద్ర మంత్రివర్గం లాంఛనంగా ఆమోదముద్ర వేసింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 మధ్య కాలంలో దీనిని నిర్వహిస్తారు. ఈ ప్రక్రియకు రూ 3,941.35 కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయించారు. ఎన్‌పీఆర్‌తో పాటు పదహారో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియకూ కేంద్రం గ్రీన్ సిగ్నలిచ్చింది. ఇందుకోసం మరో రూ. 8754.23 కోట్లు కేటాయించారు. జనాభా సేకరణ రెండు దశల్లో జరుగుతుంది. ఒకటి: ఇంటింటి సర్వే (హౌస్-లిస్టింగ్). ఇది వచ్చే ఏడాది ఏప్రిల్-సెప్టెంబరు మధ్యే ఉంటుంది. రెండోది: వివరాల సంకలన. ఇది 2021 ఫిబ్రవరి 9 నుంచి 28 దాకా చేపడతారు. ఈ ప్రక్రియ దేశమంతా జరుగుతుంది. ఎన్‌పీఆర్ మాత్రం అసోం మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో జరుగుతుంది. జనాభా లెక్కల నిమిత్తం 30 లక్షల మంది సేకర్తలు ప్రతి గ్రామం, పట్టణం, నగరాల్లో తిరిగి అనేక వివరాలను తీసుకుంటారు. ఆ ప్రక్రియలో జన సంఖ్యాది వివరాలతో పాటు బయోమెట్రిక్ వివరాలనూ స్వీకరిస్తారు. జనాభా లెక్కల సేకరణలో భాగంగా జరిపే ఇంటింటి సర్వేతో పాటే ఎన్‌పీఆర్ కూడా చేపడతారు. ఎన్‌పీఆర్‌ను ఆ సేకర్తలకూ వ్యక్తిగతంగానైనా ఇవ్వొచ్చు లేదా కేంద్రం రూపొందించబోయే ప్రత్యేక యాప్‌లో స్వయంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. 2011 జనాభా గణనలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేతో పాటు దీనినీ నమోదు చేశారు. ఈ ఎన్‌పీఆర్‌ను 2015లో అప్‌డేట్ చేసి డిజిటైజ్ చేశారు. తాజాగా -ఏప్రిల్ 1 నుంచి ఎన్‌పీఆర్ అప్‌డేషన్‌కు వివరాలు తీసుకుంటారు. 'ఎన్‌పీఆర్ ఓ సుదీర్ఘ పత్రం కాదు. యాప్‌లో మీ వివరాలు అప్‌లోడ్ చేసెయొచ్చు. సాధారణ వివరాలే ఉంటాయి. డాక్యుమెంట్లు, బయోమెట్రిక్ వివ రాలు జతచేయాల్సిన పనిలేదు. మేం ప్రజల్ని నమ్ముతాం. ప్రజలు ఏం చెబితే అదే తీసుకుంటాం' అని కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ వివరించారు. పాస్‌పోర్ట్ నెంబరు, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు ఇవ్వడం తప్పనిసరికాదన్నారు.

### జనాభా గడియారం ప్రకారం..

అత్యధిక జనాభా కలిగిన దేశంగా చైనా అగ్రస్థానంలో నిలిచింది. ఆ తరువాత స్థానం మనదే. జనాభా గడియారం ప్రకారం లెక్కలివీ..

| దేశం | విస్తీర్ణం (చ.కి.మీ-లక్షల్లో) | జనాభా |
|---|---|---|
| 1. చైనా | 95.67 | 143,64,60,273 |
| 2. భారత్ | 32.87 | 137,29,71,555 |
| 3. అమెరికా | 98.34 | 33,00,00,610 |
| 4. ఇండొనేషియా | 19.05 | 27,20,23,248 |
| 5. పాకిస్థాన్ | 8.82 | 21,86,47,238 |
| 6. బ్రెజిల్ | 8.51 | 21,17,78,388 |

### ఎన్‌పీఆర్ ఎలా..?

నివాసితుల నుంచి తీసుకునే వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలు నియమించే రిజిస్ట్రార్లు సరిచూస్తారు. 1987కు ముందు పుట్టినవారు, 1987-2004 మధ్య పుట్టి-వారిలో ఒకరి తల్లి లేదా తండ్రి తప్పనిసరిగా భారతీయులై ఉన్నవారు, 2004 తరువాత పుట్టి వారిలో ఒక పేరెంట్ భారతీయులై రెండోవారు చట్టవిరుద్ధంగా వలస వచ్చినవారు కాకుండా ఉన్నవారి జాబితాలను తయారు చేస్తారు. ఈ ముసాయిదాను అభ్యంతరాల నిమిత్తం ప్రచురిస్తారు. సందేహాస్పద పౌరసత్వం గురించిన వ్యాఖ్యలను రిజిస్ట్రార్ రాసి విడిగా ఓ జాబితా చేస్తారు. అభ్యంతరాలన్నింటినీ స్థానిక రిజిస్ట్రార్‌లే ఆలకించి, తుది జాబితాలను జిల్లా రిజిస్ట్రార్‌కు సమర్పిస్తారు. జిల్లాల రిజిస్ట్రార్‌లు తమ జాబితాలను రాష్ట్ర స్థాయికి పంపితే వాటితో ఎన్‌పీఆర్ రూపకల్పన చేస్తారు.



### ఎందుకు భయాలు..?

ఎన్ఆర్‌సీకి ఎన్‌పీఆర్‌కీ ఎలాంటి సంబంధమూ లేదు అని ప్రకాశ్ జావడేకర్ తేల్చిచెప్పారు. ప్రజల్లో అపోహలు, భయాలు పెరగడానికి కారణం మూడు అంశాలు. (1) 'ఎన్‌పీఆర్ ప్రాతిపదికనే ఎన్ఆర్‌సీ తయారుచేస్తాం. ఎన్‌పీఆర్‌లో ఇచ్చిన డేటాను సరిచూసి దాని ఆధారంగా చేస్తాం' అని 2014లోనే నాటి హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో చెప్పారు. (2) 2003 నాటి నిబంధనల్లో ఉన్న రూల్ 3- సబ్‌రూల్ 4 కింద ఎన్‌పీఆర్ తయారు చేస్తాం అంటూ కేంద్రం ఈ ఏడాది జూలై 31న గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. భారత జాతీయ పౌరుల జాబితా (ఎన్ఆర్ఐసీ లేదా ఎన్ఆర్‌సీ) అసలెందుకు అని చెప్పేదే రూల్ 3.. ఎన్ఆర్‌సీ తయారీకి సంబంధించినది ఆ సబ్‌రూల్ 4. (3) ఇటీవల తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం. మత ప్రాతిపదికన శరణార్థులకు పౌరసత్వమిచ్చే ఈ చట్టం వివక్షాపూరితమని ముస్లింలలో ఓ గట్టి అభిప్రాయం నెలకొందని విశ్లేషకులంటున్నారు.

# దేశవ్యాప్త ఎన్ఆర్సీ లేదు!

**ప్రధాని చెప్పిందే రైట్.. ఎన్‌పీఆర్, ఎన్ఆర్సీ వేర్వేరు: షా**



న్యూఢిల్లీ, డిసెంబరు 23: 'దేశమంతటా ఎన్ఆర్సీ అమలు'పై ఇప్పటిదాకా ప్రభుత్వంలో ఎలాంటి చర్చా జరగలేదని కేంద్ర హోంమంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా స్పష్టం చేశారు. 'దేశవ్యాప్తంగా ఎన్ఆర్సీ అమలు చేస్తాం' అని గతంలో పలుమార్లు ప్రకటించిన ఆయన... ఇప్పుడు దానికి భిన్నంగా స్పందించారు. "ఈ దేశ రాజధాని 130 కోట్ల మంది భారతీయులకు స్పష్టంగా చెబుతున్నాను. దేశవ్యాప్త ఎన్ఆర్సీపై కనీస చర్చ కూడా జరగలేదు" అని రెండు రోజుల క్రితం ప్రధాని మోదీ చేసిన ప్రకటనే కరెక్ట్ అని అమిత్‌షా చెప్పారు. "ఎన్ఆర్సీపై ఇప్పుడు చర్చ అక్కర్లేదు. ఎందుకంటే... కేబినెట్‌లోకానీ, పార్లమెంటులోకానీ దీనిపై ఎలాంటి ప్రస్తావన రాలేదు" అని తెలిపారు. ఎన్‌పీఆర్ అమలుకు కేరళ, బెంగాల్ నిరాకరించడం... దీనిని ఎన్ఆర్సీతో ముడిపెట్టడంతో వివరణ ఇచ్చారు. మంగళవారం ఆయన పలు వార్తాసంస్థలతో మాట్లాడిన వివరాలివీ..

### ఎన్ఆర్సీ సంగతేమిటి?

జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్సీ), జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పీఆర్)కూ మధ్య ఎలాంటి సంబంధమూ లేదు. అవి రెండూ వేర్వేరు. ఎన్‌పీఆర్ దేశ జనాభా రిజిస్టర్. ఎన్ఆర్‌సీ దేశ పౌరుల రిజిస్టర్. దేశవ్యాప్తంగా ఎన్ఆర్సీ అమలు చేయడంపై ఇప్పటిదాకా పార్లమెంటులోకానీ, కేబినెట్‌లోకానీ చర్చ జరగలేదు. ఇక... సీఏఏపై సమాచార లోపం తలెత్తిందనే విషయాన్ని నేను అంగీకరిస్తున్నాను.

### వ్యతిరేకతే ఒవైసీ నైజం

సూర్యుడు తూర్పున ఉదయిస్తాడని మనమంటే... కాదు, పడమర ఉదయిస్తాడని అసదుద్దీన్ ఒవైసీ అంటారు. ఏ అంశంపైనైనా మా వైఖరిని వ్యతిరేకించడమే ఆయన నైజం. ఎన్ఆర్‌సీ దిశగా వేస్తున్న తొలి అడుగే ఎన్‌పీఆర్ అని ఒవైసీ చేస్తున్న వాదన సరికాదు. సీఏఏకి, ఎన్ఆర్‌సీకి సంబంధం లేదు.

### ఎన్‌పీఆర్ ఎందుకంటే

ఎన్‌పీఆర్, ఎన్ఆర్సీ వేర్వేరు. లబ్ధిదారులను ఎంపిక చేసి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడమే దీని ఏకైక అజెండా. దేశంలో నివసిస్తున్న వారందరి వివరాలు ఎన్‌పీఆర్‌లో ఉంటాయి. ఎన్‌పీఆర్‌లో సేకరించిన సమాచారాన్ని ఎన్ఆర్సీలో వాడుకునే ప్రసక్తే లేదు. జనాభా గణన ప్రతి పదేళ్లకొకసారి జరిగే ప్రక్రియే. 2021 జనాభా గణన కసరత్తు యూపీఏ హయాంలోనే మొదలైంది. ఎన్‌పీఆర్‌పై బెంగాల్, కేరళ ప్రభుత్వాలతో మాట్లాడతాను. రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని రాజకీయం చేయొద్దు. ఎన్‌పీఆర్ ప్రభావం ఏ ఒక్కరిపైనా ఉండదు.

## తుక్కు షాపులు.. టీ స్టాళ్లు..!

**ముస్లిలకు కాంగ్రెస్ ఇచ్చింది ఇవేగా..?: గడ్కరీ**



నాగ్‌పూర్, డిసెంబరు 24: కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు తుక్కు షాపులు, టీ స్టాళ్లు తప్ప ఇంకేం ఇవ్వలేదని కేంద్ర మంత్రి గడ్కరీ అన్నారు. సీఏఏకు మద్దతుగా నాగ్‌పూర్‌లో ఆరెస్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. "ముస్లింలను పంపేస్తామని మేమెప్పుడూ చెప్పలేదు. జన్‌ధన్ ఖాతాలు, తెరిపించినప్పుడు ముస్లింలకు లబ్ధి చేకూర్చబోమని అన్నామా? ముస్లింలకు గ్యాస్ సిలిండర్లు ఇవ్వలేదా?"అని ప్రశ్నించారు.

## హింసను ప్రేరేపిస్తున్న పార్టీలపై చర్యకు పిల్

న్యూఢిల్లీ, డిసెంబరు 24: సీఏఏకు వ్యతిరేకంగా వదంతులు వ్యాపింపజేస్తూ, దేశంలో హింసకు కారణమవుతున్న రాజకీయ పార్టీలపై కఠిన చర్యలు తీసుకొనేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఆందోళనకారుల దాడుల్లో జరిగిన ఆస్తినష్టాలకు పరిహారం రాబట్టాలని కోరుతూ మరో పిల్ దాఖలైంది. సీఏఏపై ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్న రాహుల్ గాంధీ, ఒవైసీలపై చర్యలు తీసుకోవాలంటూ అలీగఢ్ సీజేఎం కోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది.

# రాహుల్, ప్రియాంకను అడ్డుకున్న పోలీసులు

సీఏఏకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కొనసాగిన నిరసనలు

**ఆందోళనలకు విద్యార్థి సంఘాల మద్దతు**

**మోదీ, షా ప్రకటనల్లో ఏది నిజం?: మమత**



న్యూఢిల్లీ, డిసెంబరు 24: పౌరసత్వ చట్టం, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఢిల్లీలో మంగళవారం వివిధ వర్సిటీల విద్యార్థులు కలిసి మండీ హౌస్ నుంచి జంతర్ మంతర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. దేశవ్యాప్తంగా 70కిపైగా విద్యార్థి, యువజన సంఘాలు ఒకే గొడుగు కిందకు వచ్చి సీఏఏ, ఎన్నార్సీపై పోరాడాలని నిర్ణయించాయి. అలాగే జాతీయ జనాభా రిజిస్టర్(ఎన్‌పీఆర్) పైనా నిరసనలు తెలపాలని తీర్మానించాయి. యూపీలోని మీరట్‌లో జరిగిన అల్లర్లలో మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వచ్చిన కాంగ్రెస్ నేతలు రాహుల్, ప్రియాంకలను పోలీసులు అడ్డుకున్నారు. తమను అడ్డుకునేందుకు ఆదేశాలు చూపమని అడిగితే, అలాంటివేమీ లేవని.. వెనక్కి వెళ్లిపోవాలని పోలీసులు ఆదేశించినట్లు రాహుల్, ప్రియాంక తెలిపారు. 144 సెక్షన్ అమల్లో ఉందని, శాంతి భద్రతల పరిస్థితి దృష్ట్యా వెనక్కి వెళ్లిపోవాలని రాహుల్‌కు నోటీసులు ఇచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు ఎన్నార్సీపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఇద్దరిలో ఎవరు నిజం చెబుతున్నారో అర్థం కావడం లేదన్నారు. మంగళవారం ఆమె కోల్‌కతాలో సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. యూపీలోని బిజ్నోర్‌లో పోలీసులు తమను తాము రక్షించుకునేందుకు జరిపిన కాల్పుల్లోనే ఓ యువకుడు మరణించినట్లు ప్రకటించారు.



ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరుతున్న హేమంత్ సోరెన్

## 29న జార్ఖండ్ సీఎంగా సోరెన్ ప్రమాణం

**కాంగ్రెస్‌కు ఉపముఖ్యమంత్రి పదవి?.. బీజేపీకి పెరిగిన ఓట్ల శాతం**

రాంచీ, డిసెంబరు 24: జార్ఖండ్ కొత్త ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ఈనెల 29న మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. జేఎంఎం శాసనసభా పక్ష నేత గా మంగళవారం ఎన్నికైన ఆయన గవర్నర్ ద్రౌపదీ ముర్మును కలిసి 50 మంది ఎమ్మెల్యేల బలం ఉందంటూ వివరాలు అందజేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాల్సిందిగా కోరారు. 16 సీట్లు సాధించిన కాంగ్రెస్‌కు ఉపముఖ్యమంత్రి పదవి లభించే సూచనలున్నా యి. సీఎల్పీ నేతగా ఎన్నికైన అలంగీర్ ఆలమ్‌కు ఈ పదవి దక్కవచ్చంటున్నారు. మూడుసీట్లు సాధించిన జార్ఖండ్ విముక్తి మోర్చా(జేవీఎం) కూడా అధికార కూటమికి మద్దతు పలికింది. 81 సీట్లున్న అసెంబ్లీలో 30 స్థానాలు సాధించి జేఎంఎం అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌కు 16, ఆర్జేడీకి ఒక సీటు దక్కాయి. బీజేపీ 25 స్థానాలతో సరిపెట్టుకుంది. బీజేపీకి సీట్లు తగ్గినా ఓట్లు పెరగడం విశేషం.

## జార్ఖండ్‌లో 'జెయింట్ కిల్లర్'!

**లాలూ నుంచి రఘుబర్ దాకా సీఎంలకు సరయూ షాక్**



కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలని పెద్దలు అంటుంటారు. బీజేపీ నేత సరయూ రాయ్ అక్షరాలా దీన్నే పాటిస్తారు. ఇద్దరు బిహార్, జార్ఖండ్ సీఎంలను జైలుకు పంపిన ఘనత సాధించిన ఆయన తన పార్టీకే చెందిన సీఎం రఘుబర్ దాస్‌నే ఓడించి మరోసారి పతాక శీర్షికలకెక్కారు. ఆర్ఎస్ఎస్‌లో పనిచేసిన రాయ్ ఎమర్జెన్సీ తర్వాత బీజేపీలో చేరారు. అవినీతిపై అలుపెరగని పోరాటం చేస్తారు. అవిభక్త బిహార్, జార్ఖండ్ రాజకీయాల్లో 'జెయింట్ కిల్లర్'గా పేరొందారు. బడానేతల గతాన్ని తవ్వితీసి జైలుకు పంపడం ఆయన ప్రవృత్తి. లాలూప్రసాద్ యాదవ్ బిహార్ సీఎంగా ఉన్నప్పుడు జరిగిన దాణా కుంభకోణాన్ని వెలికి తీశారు. దీంతో లాలూ జైలుపాలైన సంగతి తెలిసిందే. బొగ్గు గనుల స్కాంలో నాటి జార్ఖండ్ సీఎం మధు కోడాను కూడా జైలుకు పంపించడంలో కీలక పాత్ర పోషించారు. మూడుసార్లు బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన రాయ్.. జార్ఖండ్‌ను ఐదేళ్లపాటు పాలించిన మాజీ సీఎం రఘుబర్ దాస్ కేబినెట్‌లో మంత్రిగా కొనసాగుతూనే.. ఆయనపైనా, మంత్రివర్గ సహచరులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించారు. జంషెడ్‌పూర్ పశ్చిమ టికెట్‌ను పార్టీ నిరాకరించడంతో ఆగ్రహించిన ఆయన బీజేపీకి రాజీనామా చేసి జంషెడ్‌పూర్ తూర్పు నుంచి బరిలోకి దిగిన సీఎంపై 15 వేల ఓట్లకుపైగా ఆధిక్యంతో గెలిచారు. 'జెయింట్ కిల్లర్'నని మరోసారి నిరూపించుకున్నారు. - సెంట్రల్ డెస్క్

## కార్బన్ డయాక్సైడ్‌కు సంకెళ్లు!!

**పొగ గొట్టంలోనే బంధించి ద్రవరూపంలోకి మార్పు**



జెనీవా, డిసెంబరు 24 : కాలుష్యం.. ఈ పదం వినగానే గుర్తొచ్చేది కార్బన్ డయాక్సైడ్ (సీవో2)! దీన్ని వాహనాల పొగ గొట్టంలోనే బంధించి.. ద్రవంగా మార్చేసే పరిజ్ఞానాన్ని స్విస్ ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లాజెన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. కార్లు, బస్సులు, ట్రక్కులు, బోట్లలోనూ దీన్ని వినియోగించవచ్చని తెలిపారు. తద్వారా వాతావరణంలోకి సీవో2 విడుదలకు 90 శాతం మేర అడ్డుకట్ట వేయవచ్చని ప్రకటించారు.

### కట్టడి ఇలా..

- భారీ వాహనాలకు ఇంజన్ బరువులో 7 శాతం ఉండే సీవో 2 వడపోత కిట్ అమర్చుతారు.
- వాహనం పొగ గొట్టం నుంచి వెలువడే వాయువులు నేరుగా సీవో2 వడపోత కిట్ లోకి చేరుతాయి. అందులోని మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ (ఎంవోఎఫ్) అనే అబ్జార్బెంట్ నైట్రోజన్, ఆక్సిజన్‌లను వదిలేసి, సీవో2ను తనలోనే బంధిస్తుంది.
- పరిమితి మేర ఎంవోఎఫ్‌లో సీవో2 పేరుకున్నాక పక్కనే ఉండే హై స్పీడ్ టర్బో కంప్రెషర్‌లు వేడెక్కుతాయి. ఆ ఉష్ణానికి ఎంవోఎఫ్‌లోని సీవో2 ద్రవ రూపంలోకి మారి.. వడపోత కిట్ లోని పెట్టెలోకి చేరుతుంది.
- 1 కిలో పెట్రోలు/డీజిల్ నుంచి 3 కిలోల ద్రవరూప సీవో2 వెలువడుతుంది.
- వాహనాన్ని సమీప సర్వీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి.. ద్రవ రూపంలోని సీవో2ను ఇవ్వాలి. జీవ ఇంధనాల సాయంతో దాన్ని రీసైక్లింగ్ చేసి పునర్వినియోగ ఇంధనంగా మారుస్తారు.



## 'సర్వత్ర'.. దుర్భేద్య బుల్లెట్ ప్రూఫ్ జాకెట్

న్యూ ఢిల్లీ, డిసెంబరు 24: సరిహద్దుల్లో గస్తీ కాసే జవాన్లకు శరీరం ఆసాంతం రక్షణ కల్పించే బుల్లెట్ ప్రూఫ్ జాకెట్.. 'సర్వత్ర' అందుబాటులోకి రానుంది. శత్రువు 10 మీటర్ల దూరం నుంచి కాల్చినా ప్రాణాలు కాపాడే ఈ జాకెట్‌ను పుణెలోని మిలటరీ ఇంజనీరింగ్ కళాశాల తోడ్పాటుతో ఆర్మీ మేజర్ అనూప్ సింగ్ రూపొందించారు. దీనికిగాను ఆర్మీ డిజైన్ బ్యూరో (ఏడీబీ) ఎక్సలెన్స్ అవార్డును సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ నుంచి అందుకున్నారు. అనూప్ 2014లో తూటా ధాటికి కోమాలోకి వెళ్లారు.



## సమయాన్ని కచ్చితంగా చెప్పే ట్వీజర్ గడియారం

ఆటమిక్ గడియారాల కంటే అత్యంత కచ్చితత్వంతో సమయాన్ని చెప్పగల 'ట్వీజర్ గడియారం' ఆవిష్కృతమైంది. నాసా భాగస్వామ్యంతో అమెరికాలోని కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ శాస్త్రవేత్తలు దీన్ని అభివృద్ధిచేశారు. ఈ గడియారం లేజర్ కిరణాలతో తన పరిధిలోని 40 అణువుల తరంగ దైర్ఘ్యాల ఆధారంగా సమయాన్ని లెక్కిస్తుంది. లేజర్ కిరణాలను చిమట(ట్వీజర్)లా వాడుకుంటున్నందున దీనికి 'ట్వీజర్ గడియారం' అని పేరు పెట్టారు. ధర రూ.లక్ష పైమాటే!!

## హిందూత్వం మాకొద్దు!

**5న ఇస్లాంలోకి 3 వేల మంది దళితులు**

కోయంబత్తూరు, డిసెంబరు 24: తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయంలో 3 వేల మంది దళితులు జనవరి 5న హిందూమతం వదిలి ఇస్లాం స్వీకరించనున్నారు. తమిళ్ పులిగళ్ సంస్థ ఈ మేరకు ప్రకటించింది. ఈ నెల 2న భారీ వర్షాలకు మేట్టుపాళయం ఏటీ కాలనీలో గోడ కూలి 17 మంది దళితులు ప్రాణాలు కోల్పోయారు. దళిత కాలనీ నుంచి తన ఇంటి స్థలాన్ని వేరుచేస్తూ వస్త్ర వ్యాపారి ఈ గోడ నిర్మించాడు. అతడిని అరెస్టు చేసినా.. బెయిల్‌పై వచ్చాడు. తమిళ్ పులగళ్ నాయకుడిని మాత్రం జైల్లో పెట్టారు. దీంతో భగ్గుమన్న దళితులంతా మతం మారాలని నిర్ణయించారు.

# ఒక రాష్ట్రం.. 3 రాజధానులు

## బెజవాడ కదిలింది..

రాజధానిగా అమరావతినే కొనసాగించాలని బెజవాడ వాసులు కదం తొక్కారు. బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ వద్ద పటమటలంక వాసులు పెద్దఎత్తున చేరుకొని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా తన నిర్ణయాన్ని పునరాలోచించాలని, లేని పక్షంలో నిరసన తీవ్రరూపం చేస్తామని వారంతా హెచ్చరించారు.




తుళ్లూరులో మహిళల నినాదాలు


మందడంలో ఆందోళన చేస్తున్న రైతులు, మహిళలు

# న్యాయం కావాలి!

(మొదటి పేజీ తరువాయి)

తేల్చిచెప్పారు. 'మా ఎమ్మెల్యే కనిపించడం లేదు' అంటూ తాడికొండ శాసనసభ్యురాలు శ్రీదేవిపై పోలీస్‌స్టేషన్‌లో రైతులు ఫిర్యాదుచేశారు. ఆపద్కాలంలో తమ తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రజాప్రతినిధులు ఆచూకీ లేకపోవడంపై ఆగ్రహించారు. ఇలా ఒక కంట ఆక్రోశం, మరో కంట ఆగ్రహాన్ని రాజధాని రైతులు కురిపించారు. 'రాజధాని' పోరును వరుసగా ఏడో రోజూ రగిలించారు. వారికి మద్దతుగా బెజవాడ వాసులు, గుంటూరు-విజయవాడ లాయర్లు, తెలుగుదేశం నేతలూ కదలడంతో నిరసనలు మరింతగా ఉధృతరూపు తీసుకొన్నాయి. చిన్నా, పెద్ద, ఆడ, మగ అనే తేడా లేకుండా అందరూ నలుపు రంగు దుస్తులు ధరించి అమరావతి ప్రాంతంలో రైతులు నిరసన తెలిపారు. 29 గ్రామాల్లో ఎక్కడికక్కడ ప్రజలు ఆందోనలు నిర్వహించారు. మందడంలో చేపట్టిన మహాధర్నాకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భారీగా తరలివచ్చారు. రైతులు, రైతుకూలీలు, మహిళలతో ధర్నా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పలువురు రైతులు పురుగుమందు డబ్బాలతో ఈ ధర్నాలో కూర్చున్నారు. ఈ ప్రభుత్వానికి ఓటువేసినందుకు మా చెప్పుతో మేం కొట్టుకుంటున్నామంటూ కొందరు రైతులు ఆగ్రహంతో ఊగిపోయారు. వెలగపూడిలో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఏడో రోజుకు చేరాయి. ఇళ్లలో పండిన కూరగాయలను దీక్షా శిబిరం వద్ద తోరణంగా కట్టారు. తమ ప్రాంతం ఎడారి కాదు' అంటూ రైతులు.. స్పీకర్ తమ్మినేని సీతారాం వ్యాఖ్యలకు నిరసన తెలిపారు. అభివృద్ధి చెందుతున్న అమరావతిని ఏడు నెలల్లోనే శ్మశానంగా మార్చేశారని కన్నీరుమున్నీరయ్యారు. రాజధాని పోరు దృష్ట్యా మందడం, మల్కాపురం జంక్షన్ వద్ద మంగళవారం పోలీసులను భారీగా మోహరించారు. సచివాలయం వైపు వెళ్లే ప్రతివాహనాన్ని తనిఖీ చేశారు. గుర్తింపు కార్డు ఉన్న వారినే అటువైపు వెళ్లేందుకు అనుమతించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే.. పోలీసులు నిర్బంధాలేమిటని స్థానికులు మండిపడ్డారు. అలానే రోడ్డుకు అడ్డంగా టెంటు వేసుకున్నారంటూ తుళ్లూరు, మందడం రైతులపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

### అమరావతా.. ఆత్మహత్యలా?

'మా అమరావతిని కాపాడండి. ఆ పని చేయలేకపోతే ఆత్మహత్యలకు మమ్మల్ని అనుమతించండి' అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణకు రైతులు వినతిపత్రం అందించారు. "మా గ్రామాల్లో మేం నిరసనలు తెలుపుకొనే హక్కు కూడా లేకుండా పోయింది. పెయిడ్ ఆర్టిస్టులంటూ మమ్మల్ని ఎగతాళి చేస్తున్నారు. దానివల్ల ఆధార్ కార్డులను చేతపట్టుకొని ధర్నాలు చేస్తున్నాం. బీజేపీ తరపున మాకు న్యాయం చేయండి. లేదంటారా.. కనీసం సామూహిక ఆత్మహత్యలకు అయినా అనుమతులు ఇవ్వండి" అని వారు కోరారు. రాజధాని తాము కోరుకొన్నది కాదని, బలవంతంగా రుద్దారని, ఇప్పుడు కాదు అంటే తమ పిల్లల భవిష్యత్తు ఏమైపోతుందని వాపోయారు.

## అమరావతి కోసం రాజీనామా చేయండి

- గుంటూరు, కృష్ణా వైసీపీ ఎమ్మెల్యేలు కలిసిరావాలి
- వారిపై పోటీ పెట్టం: ప్రత్తిపాటి, ఆనందబాబు

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యేలు త్యాగాలకు సిద్ధమైతే రాజధాని ఇక్కడే ఉంటుంది... వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే చరిత్రలో నిలిచిపోతారు.. వారు రాజీనామా చేస్తే అక్కడ టీడీపీ పోటీ కూడా పెట్టదు' అని మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు అన్నారు. మంగళవారం వారు గుంటూరులో మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్యేలంతా రాజీనామాకు సిద్ధం కావాలని పిలుపిచ్చారు.

### విచారణకు మేం సిద్ధం... మీరు సిద్ధమా!

పాలనతో ప్రజల్ని సంతృప్తిపర్చలేని సీఎం జగన్ ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి దృష్టి మరల్చాలని మూడు రాజధానులు, ముప్పై రాజధానులు అంటున్నారు. భారీ వరదకు కూడా అమరావతి మునగలేదు. జగన్ దొంగ దెబ్బకు అమరావతి మునిగిపోయింది. దీంతో రాజధానులతో అభివృద్ధి అంటూ కొత్త డ్రామా మొదలుపెట్టారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలపై హైకోర్టు న్యాయమూర్తితో విచారణకు మేం సిద్ధం. వైకాపా అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో విశాఖ, విజయనగరం జిల్లాల్లో 40వేల ఎకరాల ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై హైకోర్టు జడ్జితో విచారణకు సిద్ధమా? సవాల్ స్వీకరిస్తారా?

**- నారా లోకేశ్, జాతీయ ప్రధాన కార్యదర్శి, టీడీపీ**

### రాజధాని మార్పు స్కాం... త్వరలో విడుదల

రాజధానిని విశాఖకు మార్చడం వెనుక ఉన్న స్కాం త్వరలో బయటకు రాబోతోంది. సూట్‌కేసు కంపెనీల సలహాలతో జగన్‌ను జైలుకు పంపి, 16నెలలు దగ్గరుండి విజయసాయిరెడ్డి ఊచలు లెక్కపెట్టించారు. ఇప్పుడు విశాఖ, విజయనగరం జిల్లాల్లో 40వేల ఎకరాల ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కి పాల్పడి, జగన్‌ని జీవితకాలం జైలుకు పంపాలని స్కెచ్ వేసినట్లు కన్పిస్తోంది. రాజధాని మార్పుకుట్రకు ఆద్యుడు విజయసాయిరెడ్డి.

**- బుద్దా వెంకన్న, ఎమ్మెల్సీ, టీడీపీ**

### సీమకు ఎలాంటి ప్రయోజనం ఉండదు

ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో చంద్రబాబు అమెరికా, సింగపూర్ సరసన నిలబెడితే జగన్ సోమాలియా, ఆఫ్ఘనిస్థాన్, దక్షిణాఫ్రికా పక్కకు తీసుకువచ్చారు. కర్నూలులో హైకోర్టును పెట్టే అధికారం రాష్ట్రప్రభుత్వానికి ఉందో లేదో తేల్చాలి. అమరావతి, విశాఖలో బెంచ్‌లను ఏర్పాటు చేస్తే కర్నూలులో కూడా హైకోర్టు బెంచ్ మాదిరే పరిమితమవ్వాల్సి వస్తుంది. రాయలసీమకు ఎలాంటి అదనపు లాభాలు సమకూరవు.

**- నిమ్మల రామానాయుడు, టీడీపీ శాసనసభా పక్ష ఉపనేత**

### సీఎం హోదాలో ఆకతాయి మాటలా?

సీఎం జగన్ తన పాలనతో అన్ని వర్గాల ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. అమరావతిలో రైతు కుటుంబాలు ఆత్మహత్యలే శరణ్యమంటున్నాయి. ప్రతిపక్ష నేతగా చట్టసభలో అమరావతిని సమర్థించి, నేడు మాట తప్పడం జగన్‌కు సరికాదు. మూడు రాజధానులంటూ సీఎం హోదాలో జగన్ ఆకతాయిగా మాట్లాడడం... జీఎన్ రావు కమిటీ కూడా అదే నివేదికను ఇవ్వడం... హాస్యాస్పదం. అమరావతి రైతులు ఉద్యమాల బాట పడితే మంత్రులు, తాబేదారులు అవహేళన చేయడం భావ్యం కాదు.

**- పితాని సత్యనారాయణ, మాజీమంత్రి**

### జగన్.. బరబ్బా

ప్రజలు కూడా ఒక్కోసారి పొరబడుతుంటారని బైబిల్ ప్రవచనాల ద్వారానే తెలుస్తోంది. పూర్వం పస్కా పండుగ సందర్భంగా శిక్ష అనుభవించేవారిని విడుదల చేసే సంప్రదాయం ఇజ్రాయెల్‌లో ఉండేది. శిలువ శిక్ష అనుభవించాల్సిన ఏసుక్రీస్తు, జైలుశిక్ష అనుభవిస్తున్న గజదొంగ బరబ్బాలలో ఎవరిని విడుదల చేయాలని తిలాతు ప్రజలను అడుగగా... వారు పొరబడి గజదొంగ బరబ్బాను విడుదల చేయించారు. మొన్నటి ఎన్నికల్లో కూడా ప్రజలు పొరబడి మేలు చేసిన చంద్రబాబును ఓడించి నియంత జగన్‌ను గద్దెనెక్కించారు.

**- కొలకపూడి శ్రీనివాసరావు, ఆచార్యులు, గీతం వర్సిటీ**

### ఆధారాలిస్తాం... జ్యుడీషియరీ కమిటీ వేయండి

వైసీపీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతోంది. అమరావతిలో అక్రమాలు జరిగితే ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారు? మంత్రులతో ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి.. నిపుణులతో కమిటీలను వేసినా టీడీపీ హయాంలో అక్రమాలు జరిగినట్లు నిరూపించలేకపోయారు. రాజధానిని విశాఖకు తరలించాలనే ప్రతిపాదన వెనక స్వప్రయోజనాలున్నాయి. విశాఖ చుట్టుపక్కల 6వేల ఎకరాల భూముల్ని వైసీపీ నాయకులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. దీనిపై ఆధారాలు సమర్పిస్తాం. ప్రభుత్వానికి దమ్ముంటే జ్యుడీషియరీ కమిటీని నియమించి బహిరంగం విచారణ జరిపించాలి.

**- బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే**

### ఎమ్మెల్యే చంద్రబాబు కనిపించడంలేదు!

కుప్పం, డిసెంబరు 24: కుప్పం ఎమ్మెల్యే, మాజీ సీఎం చంద్రబాబు కనిపించడంలేదంటూ స్థానిక వైసీపీ శ్రేణులు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ఏడుసార్లు కుప్పం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయనకు సొంత నియోజకవర్గంలో ఎమ్మెల్యే కార్యాలయం కానీ, సొంత నివాసం కానీ లేదని, కనీసం ఓటు కూడా ఇక్కడ లేదని పేర్కొన్నాయి. 2019 ఎన్నికల తర్వాత ఒక పర్యాయం నియోజకవర్గంలో పర్యటించిన చంద్రబాబు.. తర్వాత ఇటువైపు చూడలేదని, ఆయన ప్రజల కు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరాయి.



### ఆదుకోండి..ఢిల్లీకి లేఖలు

మూడు రాజధానుల అంశంపై అమరావతి ప్రాంత రైతులు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలకు లేఖలు రాశారు. రాజధాని విషయంలో తమకు ఆన్యాయం జరిగిందని మూడు పేజీల ఆ లేఖలో వాపోయారు. ప్రతి లేఖకు రైతులు తమ ఆధార్ జిరాక్స్‌లను జోడించి పీఎంవోకు స్పీడ్ పోస్ట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయంపై ప్రధాని జోక్యం చేసుకోవాలని కోరారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన తీరు, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను అందులో పేర్కొన్నారు. గతంలో రాజధాని అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన విషయాన్ని ఆ లేఖలో గుర్తుచేశారు.



### 'దేశం' ఆందోళనలు

రాజధానిగా అమరావతినే కొనసాగించాలంటూ రైతులు, రైతు కూలీలు, ప్రజలు గుంటూరు జిల్లా మంగళగిరిలో కాగడాలతో ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ముందుండి నడిపించారు. టీడీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన కాగడాల ర్యాలీ కొత్త బస్టాండు, పాత బస్టాండు, చినపంజా వీధి మీదుగా మెయిన్ బజారు, దేవస్థానం రోడ్డు, అంబేడ్కర్ సెంటరు వరకు సాగింది. రాజధానుల ప్రకటనను వ్యతిరేకిస్తూ కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని కోనేరుసెంటర్‌లో టీడీపీ మాజీ మంత్రి కొల్లు రవీంద్ర చేసిన ధర్నాను పోలీసులు భగ్నంచేసి ఆర్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాజధానిని అమరావతిలోనే కొనసాగించాలంటూ టీడీపీ నాయకులు విజయవాడలో విడివిడిగా కాగడాల ప్రదర్శనలు నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కార్యాలయం వద్ద, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఈ ప్రదర్శనలు సాగాయి. పెనమలూరులో మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తదితరులు కాగడాలు చేబూని నిరసన తెలిపారు.


హైకోర్టు మార్గంలో మోకాళ్లపై నిలబడి ప్లకార్డుల ప్రదర్శన

### హైకోర్టును తాకిన నిరసనలు

మూడు రాజధానుల సెగ రాష్ట్ర హైకోర్టుకు పాకింది. రాజధాని ప్రాంతంలోని పలు గ్రామాల ప్రజలు మంగళవారం హైకోర్టు వద్దకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. న్యాయమూర్తులు ప్రయాణించే రోడ్డుకిరువైపులా మోకాళ్లపై నిలబడి న్యాయమూర్తులకు చేతులెత్తి మొక్కారు. అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. న్యాయమూర్తులే తమపై దయతలచి న్యాయం చేయాలని, రాజకీయ క్రీడలో భాగంగా జరుగుతున్న రాజధాని తరలింపు ప్రయత్నాన్ని అడ్డుకోవాలని న్యాయమూర్తులను.. దూరం నుంచే వేడుకున్నారు.



### కదంతొక్కిన లాయర్లు

అమరావతి నుంచి హైకోర్టును కర్నూలుకు తరలించే యత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు రోడ్డెక్కారు. విజయవాడలోని బీసెంట్ రోడ్డు సెంటరు వద్ద మానవహారం కట్టి సర్కారు తీరును నిరసించారు. అనంతరం బెజవాడ, గుంటూరు బార్ అసోసియేషన్ల నేతల నేతృత్వంలో న్యాయవాదులు హైకోర్టు వరకు 'చలో' ర్యాలీ నిర్వహించారు. అక్కడ రాజధానిపై జీఎన్‌రావు కమిటీ నివేదిక ప్రతుల్ని దహనం చేశారు. కాగా, గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు విధులు బహిష్కరించాలని హైకోర్టు న్యాయవాదుల సంఘం నిర్ణయించింది. సంఘం అధ్యక్షుడు వైవీ రవిప్రసాద్ నేతృత్వంలో మంగళవారం జరిగిన సమావేశం ఈ నిర్ణయం తీసుకొంది. కాగా, న్యాయవాదుల ఆందోళన నేపథ్యంలో పోలీసులు హైకోర్టు చుట్టూ భారీగా మోహరించారు. న్యాయవాదుల దీక్షకు మద్దతు పలికేందుకు బయలుదేరిన చుట్టుపక్కల గ్రామాలు ప్రజలను.. ఆమడ దూరంలోనే అడ్డుకున్నారు. కాగా, లాయర్ల నిరసనకు టీడీపీ మద్దతు పలికింది. ఆ పార్టీ నేతలు దేవినేని ఉమా, బచ్చుల అర్జునుడు, బొండా ఉమా, బోడే ప్రసాద్ తదితర నాయకులు లాయర్ల నిరసనల్లో పాల్గొన్నారు.


విజయవాడలో ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన


విజయవాడలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టీడీపీ కార్యకర్తల ఆందోళన


యర్రబాలెంలో ఆందోళన చేస్తున్న రైతులు, మహిళలు

## రాజధాని మార్పు.. రాజకీయ రాక్షస క్రీడ!



- పాలన వికేంద్రీకరణతో అభివృద్ధి ఎలా సాధ్యం?
- ఇప్పటికే విశాఖలో ఎంతో అభివృద్ధి
- భీమిలిలో వేల ఎకరాల దోపిడీకే ఈ నిర్ణయం
- మాజీ ఎంపీ సబ్బం హరి ఫైర్

విశాఖపట్నం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'పాలన వికేంద్రీకరణతో అభివృద్ధి జరగదు. పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉద్యోగాలు కల్పిస్తేనే అభివృద్ధి. ఆరు నెలల పాలనలో ప్రజావ్యతిరేకత నుంచి దృష్టిని మరల్చడానికే 3 రాజధానుల ప్రకటన. రాజకీయ రాక్షస క్రీడ కోసం రాజధాని రైతులను నాశనం చేయొద్దు. పాలనా కేంద్రంగా విశాఖను చేయడం వల్ల ఉపయోగం ఉండదు' అని మాజీ ఎంపీ సబ్బం హరి స్పష్టంచేశారు. రాష్ట్రానికి మూడు రాజధానుల నిర్ణయంపై మంగళవారం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' నిర్వహించిన చర్చలో సబ్బం మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్, డాక్‌యార్డు, కోస్టల్ కారిడార్‌ల ఏర్పాటుతో ఏనాడో విశాఖ అభివృద్ధి చెందిందని, భీమిలిలోని వేల ఎకరాలను దోచుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ ప్రకటన చేశారని దుయ్యబట్టారు. అందులో భాగంగానే జేసీ-1, జేసీ-2లను నియమించారని, 22ఏ నుంచి వేల ఎకరాలను తప్పించారని, వాటిని స్వాహా చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారన్నారు. దక్షిణాఫ్రికాలో 3 రాజధానుల వల్ల ఆర్థిక ఇబ్బందులు తప్ప పెద్దగా ఉపయోగమేమీ లేదని స్వయంగా ఆ దేశాధ్యక్షుడే ఆ పార్లమెంటులో చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాజధానికి అమరావతిలో 35 వేల ఎకరాలు కావాలని నాడు ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో చెప్పిన వ్యక్తి ఈరోజు దానిని ఎందుకు మారుస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. "రాజధానిపై జీఎన్ రావు కమిటీ నివేదికను అడ్డుపెట్టుకుని వీళ్ల నాటకమాడుతున్నారు" అన్నారు.

### కోర్టులకు వెళ్లి అడ్డుకున్నది వీళ్లే..

"అమరావతిలో నిర్మాణాలు జరగకుండా కోర్టులకు వెళ్లి అడ్డుకున్నది ఈ దుర్మార్గులే. లేకపోతే ఈ పాటికి అమరావతిలో నిర్మాణాలు పూర్తయ్యేవి. విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించాక డబ్బున్నవాళ్లు నగరం చుట్టుపక్కల భూములు కొనుగోలు చేస్తారు. దానిని ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటారా? అమరావతిలో రాజధాని వస్తుందని తెలిసి కొంతమంది టీడీపీ నాయకులు భూములు కొనుగోలు చేసి ఉంటారు. డబ్బులిచ్చి కొంటే ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఎలా అవుతుంది? ప్రస్తుత రాజధానిలో భూములు కబ్జా చేయడం సాధ్యం కాదన్న ఉద్దేశంతోనే కొత్త ప్రాంతాన్ని ఎంచుకున్నారు. విశాఖలో గుర్తించిన భూములను ఎవరెవరికి ఇవ్వనున్నారో త్వరలోనే వెల్లడిస్తా. ముడసర్లోవ ప్రాంతంలో 3-4 వేల ఎకరాల భూములున్నాయి. వాటిపై కొంతమంది కర్చీఫ్ వేసుకుని కూర్చున్నారు. సీఎం జగన్ నిర్ణయాలను చూస్తే మాటపై నిలబడని తత్వమని అందరికీ అర్థమవుతోంది. ఎన్ఆర్‌సీ బిల్లుకు పార్లమెంటులో మద్దతిచ్చి, నేడు దానికి వ్యతిరేకమని ప్రకటనలు చేస్తున్నాడు. 25 మంది ఎంపీలను గెలిపిస్తే ప్రత్యేక హోదా తెస్తామని చెప్పిన వ్యక్తి ఈ రోజు దాని గురించి మాట్లాడడమే మానేశాడు. విభజన సమస్యలను కేసీఆర్‌తో కలిసి కూర్చుని పరిష్కరిస్తానని చెప్పి ఆ విషయాన్ని మర్చిపోయాడు. చంద్రబాబు అవినీతి చేస్తే నిరూపించి జైలులో పెట్టాలి తప్ప రాజధానిని మార్చాల్సిన అవసరమేముంది? విశాఖను ప్రకటించడం వల్ల ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని చెబుతున్న మంత్రి బొత్సతో ఈ విషయంపై చర్చించేందుకు నేను సిద్ధం. వేల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తున్నారు. రాజధానికి డబ్బులు లేవంటున్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేసే కుట్ర జరుగుతోంది. రాష్ట్ర ముఖ్య నేతల జాతకాలు మోదీ, షా చేతుల్లో ఉన్నందున వారు కావాలనుకుంటే ఏమైనా చేయగలరు. వారు రాజధాని అమరావతిలోనే ఉండాలనుకుంటే కాదనే శక్తి జగన్‌కు లేదు. వైసీపీని విచ్ఛిన్నం చేయాలనుకుంటే చేయగలరు" అని అన్నారు.

## అన్నం సహించడంలేదు సార్

### ఉపరాష్ట్రపతి వద్ద కన్నీరు

అమరావతి రాజధానికి భూములిచ్చిన రైతులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తానని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు భరోసా ఇచ్చారు. రాజధాని రైతులు, మహిళలు చేతుల్లో మోదీ ఫొటో పట్టుకొని కృష్ణాజిల్లా ఆత్కూరులోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌కు తరలివచ్చారు. ట్రస్ట్‌లో బసచేసిన ఉపరాష్ట్రపతి వెంకయ్యను కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. రాజధానిని అమరావతిలో అభివృద్ధి చేయకపోతే భూములిచ్చిన తమ పరిస్థితి ఏంటని మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. మోదీ భూమిపూజ చేసి వెళ్లిన చోట రాజధాని నిర్మాణాన్ని నిలిపివేస్తుంటే నిద్రపట్టడంలేదని, అన్నం కూడా సహించడం లేదని తెలిపారు. "న్యాయం చేయండి సార్" అని కోరారు. దీనిపై స్పందించిన వెంకయ్యనాయుడు 'నేను రాజకీయాల్లో లేను. రాజ్యాంగ బాధ్యతలో ఉన్న వ్యక్తిగా వ్యాఖ్యానం చేయకూడదు. పైగా స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో రాజకీయాలు మాట్లాడకూడదని నియమం ఉంది. నా పరిస్థితి అర్థం చేసుకోండి. మీ బాధలు అర్థం చేసుకోగలను. ఏం చేస్తే న్యాయం జరుగుతుందో అది చేస్తాను' అని వారికి భరోసా ఇచ్చారు.




ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో సమావేశమైన అమరావతి ప్రాంత రైతులు

# 3 ఒక రాష్ట్రం.. రాజధానులు



# విశాఖ ఏమంటోంది!?

## రాజధాని ప్రకటనపై గుంభనంగా నగరం

'మీ నగరంలో రాజధాని పెడుతున్నాం!'... అని ప్రభుత్వ పెద్దలు ప్రకటిస్తే!?

అక్కడ సంబరాలు చేసుకోవాలి. మిఠాయిలు పంచుకోవాలి. బాణసంచా పేల్చాలి. కనీసం... నలుగురు రోడ్ల మీదికి రావాలి!

'విశాఖ పరిపాలనా రాజధాని కావొచ్చు' అని అసెంబ్లీలో ముఖ్యమంత్రి జగన్ ప్రకటించినప్పుడు కానీ... విశాఖలో సచివాలయం, సీఎం క్యాంప్ కార్యాలయం ఉండాలని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని జీఎన్ రావు కమిటీ సిఫారసు చేసినప్పుడు కానీ... విశాఖపట్నంలో బహిరంగంగా ఎలాంటి ఆనందం కనిపించలేదు. ఏ సంఘాల వారూ సంబరాలు చేసుకోలేదు. చివరికి... అధికార పార్టీ కార్యకర్తలు కూడా బాణసంచా పేల్చలేదు. మంత్రి అవంతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండు ప్రదర్శనలు మాత్రం జరిగాయి.

### ప్రజల్లో కనిపించని సందడి, సంబరాలు

- రియల్, ఆతిథ్యరంగానికి కొత్త ఉత్సాహం
- మహా నగరానికి రాజధానితో కొత్త హంగు
- స్వాగతిస్తున్న వ్యాపారులు, మేధావులు
- సామాన్యుల్లో మాత్రం భిన్నాభిప్రాయాలు
- అద్దెలు, జీవన వ్యయం పెరుగుతాయి
- కాలుష్యం, నీటి కొరత, ట్రాఫిక్ సమస్యలు
- ఇతరుల ఆధిపత్యం పెరుగుతుందనే ఆందోళన

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

రాజధాని రావడం ఏ ప్రాంతానికైనా ఒక వరమే! ఈ వరం విశాఖకు అడగకుండానే లభించినట్లయింది. ఇదో అనూహ్య పరిణామం. ఎందుకంటే... తమ నగరాన్ని రాజధానిగా మార్చాలని ఈ ప్రాంత వాసులు ఎప్పుడూ కోరుకోలేదు. విభజన సమయంలోనూ ఉత్తరాంధ్ర జనం నుంచి ఈ డిమాండ్ వినిపించలేదు. తమ ప్రాంతానికి వివిధ రకాల విద్యా సంస్థలు, జాతీయ ప్రాధాన్యమున్న ఇతర సంస్థలు ఏర్పాటు చేయాలని మాత్రమే కోరుకున్నారు. దశాబ్దాల కల, ఈ ప్రాంత ఆకాంక్ష అయిన ప్రత్యేక రైల్వే జోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖలో రాజధాని పెట్టి ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తామన్న ప్రకటనను ఈ ప్రాంత మేధావులు సాదరంగా ఆహ్వానిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ పంట పండిందని ఆనందంగా ఉన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు వంటి ఆతిథ్య రంగంలో ఉన్న వారికీ ఆనందాన్నిస్తోంది. ఇప్పటికే విశాఖ నగరం పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందింది. తూర్పు నౌకాదళ ప్రధాన స్థావరం, విశాఖ ఉక్కు, బ్రాండిక్స్‌తో పాటు అనేక పరిశ్రమలు, సంస్థలు ఇక్కడ ఉన్నాయి. నవ్యాంధ్రలో ఇదే ఏకైక మహానగరం ఇది. 'డెస్టినేషన్ సిటీ'గా ఇతర రాష్ట్రాల వారిలోనూ విశాఖ అంటే ప్రత్యేకమైన 'క్రేజ్' ఉంది. జీఎన్ రావు కమిటీ సిఫారసుల ప్రకారం... కొత్తగా సచివాలయం, హైకోర్టు ధర్మాసనం, అసెంబ్లీ, ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు ఇక్కడ ఏర్పాటయ్యే అవకాశముంది. అంటే... ఆ మేరకు ఉద్యోగులు, వారి కుటుంబాలు ఇక్కడికి రావాల్సి ఉంటుంది. సచివాలయానికి, కార్యాలయాలకు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి సందర్శకులూ పెరుగుతారు. సహజంగానే నగరంలో సందడి పెరుగుతుంది. స్థిరాస్తి ధరలు పెరుగుతాయి. ఈ నేపథ్యంలో... రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు, హోటళ్ల యజమానులు, సొంతంగా ఆస్తులున్న వారంతా రాజధాని ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఇది మరో కోణం...

'రాజధాని' ప్రకటనపై పేదలు, సాధారణ ప్రజలు, సగటు ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు కనిపించడంలేదు. అలాగని... బహిరంగంగా వ్యతిరేకించడమూ లేదు. అయితే... ఇప్పటికే తాము ఉన్న ఇళ్ల అద్దెలు పెరుగుతాయని కొందరు, సొంత ఇంటి కల మరింత వెనక్కి పోతుందని ఇంకొందరు ఆందోళన చెందుతున్నారు. "ఇప్పుడు రూ.6 వేల నుంచి రూ.10 వేల మధ్య అద్దెకు ఇళ్లు దొరుకుతున్నాయి. రాజధాని పేరిట అద్దెలు పెంచేస్తారు. జీవన వ్యయం అధికమవుతుంది. రాజధాని వచ్చిందని యజమానులు జీతాలు పెంచరు కదా?" అని చిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

### ఇతర సమస్యలూ ఉన్నాయి...

రాష్ట్రంలోని అత్యంత కాలుష్య నగరాల్లో విశాఖ ఒకటి. రాజధాని రాకతో అది మరింత పెరుగుతుంది. ఇక... ట్రాఫిక్ సమస్య కూడా అధికమే. ఇప్పటికే విశాఖ నగరంలో తాగునీటి ఎద్దడి ఉంది. రాజధాని వస్తే ఈ సమస్య మరింత పెరిగే అవకాశముంది. పోలవరం ప్రాజెక్టు పూర్తయి నీళ్లు తరలిస్తేనే విశాఖ దాహం పూర్తిగా తీరేది. అన్నింటికన్నా మించి... ఉత్తరాంధ్ర సొంత ఉనికి, సంస్కృతికి సంబంధించిన అంశం. రాజధాని రాకతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారు ఇక్కడ స్థిరపడతారని, అందులోనూ ఇతర ప్రాంతాలకు చెందిన వారి ఆధిపత్యం పెరుగుతుందని, భూదందాలు, దౌర్జన్యాలు పెరుగుతాయనే ఆందోళన కనిపిస్తోంది. అయితే అంతర్గత చర్చ జరుగుతోంది తప్ప, బహిరంగంగా అభిప్రాయాలు చెప్పేదుకు వెనుకంజ వేస్తున్నారు.

### వలసలు ఆగుతాయి

రాజకీయంగా వెనుకబడిన ప్రాంతం ఉత్తరాంధ్ర. రాజధాని ఏర్పాటు వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే విశ్వాసం ఉంది. రాజధాని వస్తే ఇక్కడి ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. కొత్త పరిశ్రమలు వస్తాయి. ఈ ప్రాంతం నుంచి 15 లక్షల మంది ప్రజలు ఉపాధికి వలస వెళుతున్నారు. వారంతా వెనక్కి రాకపోయినా.. కొత్తగా ఎవరూ వలస వెళ్లాల్సిన అవసరం ఉండదు.

**- ఎన్.నాగేశ్వరరావు, ఉత్తరాంధ్ర ఉద్యమకారుడు**

### అన్నీ అభూత కల్పనలే

ఈ ప్రభుత్వం ఐదుగురు ఉప ముఖ్యమంత్రులను నియమించింది. వారికి ఏమైనా అధికారాలు ఇచ్చారా? ఇప్పుడు మూడు రాజధానులు అంటున్నారు. అవి కూడా అలాగే ఉంటాయి. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలంటే... రాజధాని స్థలాన్ని మార్చడం కాదు...అభివృద్ధి వికేంద్రీకరణ చేయాలి. ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఇబ్బందులో ఉన్న సమయంలో కర్నూలులో హైకోర్టు, విశాఖలో పాలనా రాజధాని అంటున్నారు. వీటికి నిధులు ఎక్కడి నుంచి వస్తాయి. ఇవన్నీ ప్రజలను మభ్యపెట్టేందుకే. ఇలాంటి నిర్ణయాల వల్ల రాష్ట్రాభివృద్ధి మరింత వెనుకబడుతుంది.

**- లక్ష్మణరావు, ప్రైవేటు ఉద్యోగి**

### అన్ని చోట్లా... అన్నీ!

విశాఖలో రాజధాని పెట్టడాన్ని ఆహ్వానిస్తున్నాం. హైదరాబాద్‌ను 1956 నుంచి 2014 వరకు అభివృద్ధి చేశాం. అన్నీ ఒకే దగ్గర కేంద్రీకరించడం వల్ల తీవ్ర నష్టం జరిగింది. ఆ పొరపాటు పునరావృతం కాకుండా అభివృద్ధిని ఇలా వికేంద్రీకరించడం మంచిదే. అమరావతి రైతులకు న్యాయం చేయాలి. ఈ ప్రాంతాన్ని అగ్రిహబ్‌గా అభివృద్ధి చేసి కూరగాయలు పెద్దఎత్తున పండించి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయొచ్చు. విశాఖలో భారీ అభివృద్ధి అవసరం లేదు. ఇప్పటికే మౌలిక వసతులు ఉన్నాయి. రాజధాని వల్ల అద్భుతాలు జరిగిపోయి ఉత్తరాంధ్ర అభివృద్ధి పథాన దూసుకుపోతుందనే అపోహలు పెట్టుకోకూడదు. హైకోర్టు బెంచీలు విశాఖపట్నం, అమరావతిల్లో పెడుతున్నట్టుగా సచివాలయం సబ్‌సెంటర్లు అమరావతిలో, కర్నూలులో పెట్టాలి. అంత దూరం నుంచి అంతా విశాఖ రాలేరు కాబట్టి వారికి అందుబాటులో కొంతమంది అధికారులను ఉంచాలి.

**- బాల మోహన్‌దాస్, పూర్వ ఉపకులపతి, విశాఖపట్నం**

### విశాఖకు మాత్రమే అర్హత ఉంది

శివరామకృష్ణ కమిటీ పర్యటనకు వచ్చినప్పుడే విశాఖపట్నంలో రాజధాని ఏర్పాటు చేయాలని సూచించాం. రాజధాని ఎప్పుడూ కాస్మోపాలిటన్ కల్చర్‌తో ఉండాలి. రాష్ట్రంలో ఆ వాతావరణం వున్న నగరం ఒక్క విశాఖపట్నమే. నిర్మాణాలకు అవసరమైన భూములు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. అవన్నీ పంట భూములు కావు. రాజధానితోనే అభివృద్ధి ముడిపడి ఉంటుంది. కొత్త పరిశ్రమలు వస్తాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

**- రామ్మోహన్ రావు, వైస్ చైర్మన్, ఉన్నత విద్యా మండలి**



మద్దతు కోరుతూ కన్నాను కలిసిన రాజధాని రైతులు

## సీఎం మారితే రాజధాని మారడమా!

### చరిత్రలో ఇంత వరకూ ఎక్కడా లేదు

- మా డిమాండు అభివృద్ధి వికేంద్రీకరణ
- పాలనా వికేంద్రీకరణ కాదు: కన్నా

గుంటూరు, విజయవాడ, డిసెంబరు 24: "అమరావతి రైతుల సమస్య కాదు, రాజధాని సమస్య. ప్రభుత్వం మారినప్పుడల్లా రాజధాని మారిస్తే రాష్ట్రం మీద నమ్మకాలు పోతాయి. రాష్ట్ర ప్రభుత్వాన్ని నమ్మి రైతులు భూములు ఇస్తే కేంద్రం నిధులు ఇచ్చింది. చంద్రబాబు, జగన్‌ను చూసి ఇవ్వలేదు. సీఎం మారితే రాజధాని మారడం ఇంత వరకూ చరిత్రలో ఎక్కడా లేదు. ముఖ్యమంత్రి తన అపరిపక్వతతో అటువంటి పిచ్చిపనికి పూనుకుంటున్నారు" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. తమకు న్యాయం చేయాలని, తమ బాధ ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలతో చెప్పుకునే అవకాశం కల్పించాలని రాజధాని గ్రామాల రైతులు మంగళవారం గుంటూరులో కన్నాను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బీజేపీ అభివృద్ధి వికేంద్రీకరణను కోరుకుంది కాని, పరిపాలన వికేంద్రీకరణ కాదని ఆయన స్పష్టం చేశారు. ఆరు నెలల నుంచి రాష్ట్రంలో శాంతి భద్రతల మాట ఏమో కాని ఎవ్వరికీ నిద్ర లేకుండా చేసిన ఘనత ఈ ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. లక్షల ఉద్యోగాలు అని చెబుతూ రెట్టింపు మందిని రోడ్డున వేశారన్నారు. కక్ష సాధింపు, అనుభవ రాహిత్యం, అపరిపక్వత కలిసిన ముఖ్యమంత్రి పాలనలో ఈ రాష్ట్రం దశ, దిశ లేని విధంగా మారిందన్నారు. అధికారంలో ఉన్న మంత్రులు బాధ్యతతో వ్యాఖ్యలు చేయాలన్నారు. శ్మశానమని, ఎడారి అని, వరదలు వస్తే మునిగిపోతాయని... ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు మాట్లాడితే మనోభావాలు దెబ్బతింటాయన్న కనీస ఇంగితం కూడా లేకపోవడం దురదృష్టకరం అన్నారు. తమ పార్టీ తరపున రాజధాని రైతులకు పూర్తి మద్దతు తెలియజేస్తున్నామన్నారు. 'రాజధాని నిర్మాణం కోసం రూ.10 వేల కోట్ల ప్రజాధనం ఖర్చు పెట్టారు. ఇప్పుడు మీ ఇష్టం వచ్చినట్లుగా చేసుకుంటామంటే ఇక్కడ ఎవరూ చూస్తూ కూర్చోరు. ఇదేమి సొంత కంపెనీ కాదు" అంటూ కన్నా స్పష్టం చేశారు. అమరావతి నుంచి రాజధానిని మారిస్తే అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ కక్షపూరిత ధోరణితో వ్యవహరించటం సరికాదని ఆయన హితవు పలికారు.

### రాజధాని ప్రాంతంలో కన్నా పర్యటన

కన్నా లక్ష్మీనారాయణ బుధవారం రాజధాని ప్రాంతంలో పర్యటించనున్నారు. రాజధాని మార్పును వ్యతిరేకించి, రైతులకు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటించిన నేపథ్యంలో కన్నా పర్యటన ఆసక్తి రేపుతోంది.

## ఇన్‌సైడర్ ట్రేడింగ్ కోసమే విశాఖకు

- హైకోర్టున్న చోట ఎక్కడా అభివృద్ధి జరగలేదు: బీజేవైఎం



అనంతపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): "ఇన్‌సైడర్ ట్రేడింగ్ కోసమే విశాఖను పరిపాలనా రాజధానిగా ఏర్పాటు చేయాలని సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. నవ యువకుడు, ఏపీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాడని ఆశిస్తే పోలవరాన్ని అయోమయానికి గురిచేసి, అమరావతిని అంధకారంలోకి ముంచుతున్నాడు. ప్రధాని మోదీ అంగీకరించి, శంకుస్థాపన చేసిన రాజధానిని మార్చడం అంటే ప్రధానిని వ్యతిరేకించినట్లే. ఎన్ఆర్‌సీకి సీఎం అనుమతి అవసరం లేదు. వైసీపీ ఎంపీలంతా సీఏఏకి పార్లమెంటులో ఆమోదం తెలిపారు. ఇక్కడేమో జగన్ వ్యతిరేకిస్తున్నారు. ఇదేమి దేశభక్తి?" అని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు నాగోతు రమేశ్ నాయుడు మండిపడ్డారు. మంగళవారం అనంతపురంలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు అమరావతిని రాజధానికిగా అంగీకరించారని, 30 వేల ఎకరాలు ఒకచోట ఉంటే రాజధానికి బాగుంటుందని అప్పట్లో అభిప్రాయపడ్డారని గుర్తు చేశారు. ఇప్పుడేమో తమకు సంబంధించిన వ్యక్తులు విశాఖలో భూములు కొన్నందున, అక్కడ విలువైన ఖనిజ నిక్షేపాలున్నందున విశాఖను పరిపాలనా రాజధానిగా చేయాలని ఆలోచిస్తున్నారని ఆరోపించారు. విశాఖలో రాజధాని ఏర్పాటు చేయాలని ఎవరడిగారని ప్రశ్నించారు. వారు హైకోర్టు బెంచ్ ఇస్తే చాలనే భావనలో ఉన్నారని వివరించారు. అమరావతి ప్రాంత రైతులు భూములు త్యాగం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని తన వాటాగా వచ్చిన మూడెకరాల్లో ఒక ఎకరాను రాజధానికి ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. జగన్ ఏపని చేసినా మూడుసార్లు ఉంటుందంటూ ఎద్దేవా చేశారు. అందుకు తాజా ఉదాహరణ మూడు రాజధానుల నిర్ణయమని చెప్పారు. అనంతపురంలో కియా కార్ల పరిశ్రమకు మూడోసారి ఆయన వచ్చి ప్రారంభించారన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమకు మూడోసారి మళ్లీ శంకుస్థాపన చేశారన్నారు. హైకోర్టు బెంచిని ముచ్చటగా మూడు ముక్కలు చేసే ఆలోచనలో ఉన్నారన్నారు. రాయలసీమను ఉద్ధరించడానికి కర్నూలుకు హైకోర్టును ఇస్తున్నామని చెప్పుకుంటున్నారనీ, ఆ ముక్క రాయలసీమ నాలుక గీచుకోడానికి కూడా పనికిరాదని విమర్శించారు. హైకోర్టులున్న ప్రాంతాలేవీ అభివృద్ధి చెందిన దాఖలాలు లేవన్నారు. రాయలసీమ అభివృద్ధి చెందడానికి నికర జలాలు, పరిశ్రమలు తెచ్చి వలసలు నివారించాలన్నారు. ఎన్ఆర్‌సీకి సీఎం జగన్ అనుమతి అక్కర్లేదని రమేశ్ నాయుడు అన్నారు. ఎంపీ ఒవైసీ మాయలోపడిన జగన్ ఎన్ఆర్‌సీని వ్యతిరేకిస్తున్నారని రమేశ్ ఆరోపించారు.



## రాజధాని రైతుకు పాదపూజ

మందడం గ్రామానికి చెందిన రైతు విష్ణుమొలకల సుబ్బారావు దంపతులకు బీజేపీ అధికార ప్రతినిధి గోపాల కృష్ణప్రసాద్ పాదపూజ చేశారు. ఆయన కాళ్లు కడిగి నీళ్లు నెత్తిన చల్లుకున్నారు. రాజధాని తరలింపును నిరసిస్తూ మంగళవారం మందడంలో జరిగిన ధర్నా శిబిరంలో రైతు సుబ్బారావు దంపతులు కూర్చున్నారు. సంఘీబావం తెలపడానికి అక్కడకు వచ్చిన గోపాల కృష్ణప్రసాద్ ఆ దంపతులకు నమస్కరించారు. "రాజధానికి 110 ఎకరాలు ఇచ్చిన మీ త్యాగాన్ని ఈ జాతి మరవదు' అంటూ కొనియాడారు. అనంతరం వారికి పాదపూజ చేశారు.

# మీకు నచ్చలేదని మార్చేయడం దుర్మార్గం

- నాకే స్వార్థముంటే తిరుపతిలో పెట్టేవాడిని
- అన్యాయంపై ప్రతి ఒక్కరూ ఉద్యమించాలి
- పోరాడేవాళ్లకు కులం అంటగడుతున్నారు
- ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలు చేస్తున్నారు
- నిరూపించాలంటే పారిపోతున్నారు
- చంద్రబాబు ఆగ్రహం. జేఏసీ నేతలతో భేటీ

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వాలు మారితే రాజధానులు మారతాయా? ఇలా ఏ రాష్ట్రంలోనైనా జరిగిందా? అమరావతి ఐదేళ్లుగా రాజధానిగా పనిస్తోంది. అన్ని వ్యవస్థలూ ఇక్కడి నుంచే పనిచేస్తున్నాయి. ఇప్పుడు మాకు నచ్చలేదు కాబట్టి మారుస్తామనడం దుర్మార్గం కాదా' అని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. వివిధ సంఘాలు కలిసి ఏర్పాటు చేసుకున్న అమరావతి జేఏసీ ప్రతినిధులు మంగళవారం మధ్యాహ్నం ఆయనను మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు. అన్ని ప్రాంతాలకు సమాన దూరంలో అందరికీ అందుబాటులో అన్ని వర్గాల ఆమోదంతో ఆ రోజు అమరావతిని రాజధానిగా ఎంపిక చేశామని, తాను స్వార్థంతో ఆలోచిస్తే తన ఊరికి దగ్గరలో ఉన్న తిరుపతిలో రాజధానిని పెట్టేవాడినని చెప్పారు. 'రాజధానితోపాటు అన్ని ప్రాంతాలూ అభివృద్ధి కావాలని నేను ఆరాటపడ్డాను. తిరుపతికి సెల్‌ఫోన్ తయారీ కంపెనీలు తెచ్చాం. శ్రీసిటీని అభివృద్ధి చేశాం. విశాఖను సాఫ్ట్‌వేర్ హబ్‌గా... డేటా సెంటర్ హబ్‌గా తయారు చేయాలని ప్రయత్నించాం. ఫిన్‌టెక్ వ్యాలీని ప్రతిపాదించాం. హైటెక్స్‌లో కూడా లేని షాపింగ్ మాల్స్ వచ్చేలా లులూ కన్వెన్షన్ సెంటర్ నిర్మించేలా వారిని ఒప్పిస్తే ఈ ప్రభుత్వం రాగానే వారిని వెళ్లగొట్టారు. విశాఖలో మూడుసార్లు పెట్టుబడుల సదస్సులు పెట్టి ఆ నగరానికి విశ్వఖ్యాతి తెచ్చాం. ఇప్పుడు వీళ్లంతా అక్కడ చేరి ఆ నగరాన్ని నాశనం చేయాలని చూస్తున్నారు' అని దుయ్యబట్టారు. తప్పుడు నిర్ణయాలపై పోరాటానికి ప్రతి ఒక్కరూ ఉద్యమకారుడు కావాలని పిలుపిచ్చారు. పోరాడేవారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారని, దానికి భయపడకుండా ముందడుగు వేయాలని ఆయన కోరారు. పోరాడేవాళ్లకు కులం అంటగడుతున్నారని.. ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలు చేస్తున్నారని, నిరూపించమంటే పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల పోరాటానికి టీడీపీ అండగా ఉంటుందని, అందరికీ తాను వెన్నంటి ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రజా సంఘాలు ముందుకొచ్చి పోరాడుతున్నందుకు ఆయన అభినందించారు.



అమరావతి పరిరక్షణ సమితి నేతలతో మాట్లాడుతున్న చంద్రబాబు

## స్లో పాయిజన్‌తో చంపాలని..

### సీఎం కాకముందే జగన్ యత్నం

**దళిత నియోజకవర్గంపై కమ్మ ముద్ర.. దళిత స్కాలర్ శ్రీనివాసరావు ధ్వజం**

విశాఖలో పెట్టేది రాజధాని కాదని, జగన్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్) అని విద్యావంతుల వేదిక అధ్యక్షుడు, దళిత స్కాలర్ డాక్టర్ శ్రీనివాసరావు ఈ సందర్భంగా విమర్శించారు. 'ముఖ్యమంత్రి కావడానికి ముందు నుంచే స్లో పాయిజన్ మాదిరిగా వ్యతిరేకతను ఎక్కించి అమరావతిని చంపేయాలని జగన్ ప్రయత్నించారు. ప్రతిపక్ష నేత ఇంటిని ముంచి అమరావతిని ముంపు ప్రాంతంగా చిత్రీకరించాలని చూశారు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచే విశాఖలో వేల ఎకరాల భూమిని తన వాళ్లతో ఆక్రమింపజేశారు. సింగపూర్, అమెరికా, జపాన్‌ల సరసన అమరావతిని నిలపాలని చంద్రబాబు ప్రయత్నిస్తే ఈ ముఖ్యమంత్రి ఆఫ్రికాలో ఇథియోపియా, సోమాలియా సరసన నిలబెట్టాలని చూస్తున్నారు' అని దుయ్యబట్టారు. 40 శాతం దళితులు ఉన్న దళిత నియోజకవర్గంపై కమ్మ ముద్ర వేసి దుష్ప్రచారం చేశారని, కానీ గత ఆరు నెలల్లో మాల, మాదిగ, రెల్లి తప్ప మిగిలిన అన్ని కార్పొరేషన్లకు తన కులం వారిని చైర్మన్లుగా వేసుకున్న ఘనత జగన్‌కే దక్కిందని చెప్పారు. క్రెడాయ్ నేత శివారెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతిని రాజధానిగా స్వాగతించి అధికారంలోకి రాగానే వ్యతిరేకించడం సరికాదన్నారు. 'పాతిక సీట్లు ఇస్తే ప్రత్యేక హోదా తెస్తానని చెప్పి ఇప్పుడు అది వదిలివేసి మూడు రాజధానుల పల్లవి ఎత్తుకున్నారు. మేం మంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తే మమ్మల్ని అనేక పోలీసుస్టేషన్లు తిప్పారు. విద్యార్థులపై గంజాయి కేసులు పెడుతున్నారు' అని విమర్శించారు. ఎటువంటి హింసా లేకుండా 34 వేల ఎకరాల భూమి ఇవ్వడం దేశంలో చరిత్రని, దానిని గౌరవించాల్సిందిపోయి గందరగోళం సృష్టించడం సరికాదని ఐఎంఏ నేత డాక్టర్ నందకిశోర్ అన్నారు. మనిషికి మూడు తలలు ఉండవని, అలాగే ఒక రాష్ట్రానికి మూడు రాజధానులు సరికాదని డాక్టర్ కార్తీక్ వ్యాఖ్యానించారు. సమావేశంలో 26 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజధాని భీమిలిలో కాదు

**భీమిలి నియోజకవర్గంలో 27న కేబినెట్ తరువాత స్పష్టత: మంత్రి బొత్స**



విశాఖపట్నం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): "కార్యనిర్వాహక రాజధాని భీమిలిలో కాదు. భీమిలి నియోజకవర్గంలో ఉంటుంది. 27న మంత్రివర్గం సమావేశం ఉంది. అది అయిన తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయి" అని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఆయన మంగళవారం ఉదయం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'భీమిలి మహాపట్టణంగా అభివృద్ధి చెందుతుందని విజయసాయిరెడ్డి చెప్పారు. రాజధాని అక్కడే ఏర్పాటు చేస్తారా?' అన్న ఓ ప్రశ్నకు మంత్రి స్పందించారు. భీమిలిలో రాజధాని వస్తుందని తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. అటు అనకాపల్లి వెళ్లాలన్నా, ఇటు విజయనగరం, ఎస్.కోట, భోగాపురం తదితర ప్రాంతాలకు వెళ్లాలన్నా... భీమిలి నియోజకవర్గం అంచుల నుంచే వెళ్లాలనీ, ఆ విధంగా విజయసాయిరెడ్డి మాట్లాడారని వివరించారు. అమరావతిలో రైతులు ధర్నా చేస్తున్నారు కదా? మరి వారికి ఎలా న్యాయం చేస్తారంటూ వచ్చిన ప్రశ్నకు... చంద్రబాబు అక్కడి వారిని రెచ్చగొడుతూ మరోసారి మోసం చేస్తున్నారని ఆరోపించారు.

### రైతులూ.. చంద్రబాబు ట్రాప్‌లో పడొద్దు: అవంతి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 24: "అమరావతి రైతులను చంద్రబాబు రెచ్చగొడుతున్నారు. రైతులు ఆయన ట్రాప్‌లో పడొద్దు. ఎలాంటి ఆవేశాలకు లోనుకావద్దు. ప్రజా రాజధాని కావాలని ముఖ్యమంత్రి జగన్ కోరుకుంటున్నారు. విశాఖపట్నం కాస్మోపాలిటన్ సిటీ. అక్కడ అన్ని వసతులు ఉన్నాయి. ప్రభుత్వంపై భారం తక్కువగా ఉంటుందని కమిటీ అనుకుని ఉండొచ్చు" అని మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ (అవంతి శ్రీనివాస్) అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలో జరుగుతున్న జూనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధి చంద్రబాబుకు ఇష్టం లేదా? అని ప్రశ్నించారు.

## రైతులకు న్యాయం జరగాలి

### ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



నరసరావుపేట టౌన్, డిసెంబరు 24: "రైతులు రాజధానిని అమరావతిలో పెట్టమని అడగలేదు. రాజధాని కోసం ప్రభుత్వం భూమి అడిగితే 30 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. రాజధాని ఎక్కడ నిర్మిస్తారు?, పెట్టుబడులు, తదితర అంశాలకన్నా అక్కడ భూములు ఇచ్చిన రైతులు గురించే ఆలోచించాలి. రాజధానికి భూమి ఇచ్చిన రైతులకు న్యాయం జరగాలి" అని గుంటూరు జిల్లా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులకు సీఎం జగన్మోహన్‌రెడ్డి న్యాయం చేస్తారనే నమ్మకం ఉందన్నారు. భూములు ఇచ్చిన తర్వాత ఆప్రాంతం అంతా రాజధాని కడదామనే ఉద్దేశంతో చాలా చిత్రాలు చూపించారన్నారు. భూమి అటు పొలాలకు, ఇటు ప్లాట్లకు పనికి రాకుండా మధ్యలో వదిలివేసి వెళ్లారన్నారు. గత ప్రభుత్వం మోసం చేసినందునే అక్కడి ప్రజలు వైసీపీని ఎన్నుకున్నారన్నారు. రాజధాని మీద రూ.5 వేల కోట్లు ఖర్చు చేశారని, కాబట్టి రాజధాని రైతులకు న్యాయం జరగాలని స్పష్టం చేశారు. మూడు చోట్ల రాజధాని ఏర్పాటుపై 27న కేబినెట్ సమావేశం తర్వాత స్పష్టత వస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ధర్నా చేయడానికి అనుమతి ఉందని, ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు గట్టిగా మాట్లాడతారని చెప్పారు. అభివృద్ధి వికేంద్రీకరణా? లేక పరిపాలనా వికేంద్రీకరణా? అన్నది 27న నివేదిక వచ్చిన తరువాత చదివి స్పందిస్తానని స్పష్టం చేశారు.

## రైతుల ఆందోళనను తప్పుపట్టలేం

### ఎంపీ రఘురామకృష్ణంరాజు



ద్వారకాతిరుమల, డిసెంబరు 24: 'రాజధానిని మార్చినపుడు రైతులు ఆందోళన చేయడం సహజం. వారి ఆందోళనను తప్పుపట్టడం న్యాయం కాదు.' అని వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించారు. పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అమరావతితో పాటు విశాఖ రాజధానిగా ఉంటుందని అంటున్నారు. అటువంటప్పుడు రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నా. రాజధాని తరలింపుపై పూర్తిగా క్లారిటీ రాలేదు. మంత్రివర్గంలో అప్రూవ్ అవ్వాలి. అప్పటివరకు అమరావతికి అన్యాయం జరిగిందని చెప్పలేం' అని వ్యాఖ్యానించారు. అన్నిప్రాంతాల అభివృద్ధిలో భాగంగా ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారని, అమరావతి అభివృద్ధి తగ్గదని, లేఅవుట్‌లు పూర్తిచేస్తామని మంత్రి బొత్స చెబుతున్నారని అన్నారు.



## ఫెడ్ కప్ టీమ్‌లో సానియా

**న్యూఢిల్లీ:** వెటరన్ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టనుంది. ఐదుగురు సభ్యుల భారత ఫెడ్ కప్ టీమ్‌కు సానియా నాలుగేళ్ల తర్వాత ఎంపికైంది. అంకిత రైనా, రుతుజ భోస్లే, కర్మన్ కౌర్ థండి, రియా భాటియాలకు కూడా జట్టులో చోటు లభించింది. 2016లో సానియా చివరిసారి ఫెడ్ కప్‌లో ఆడింది.

## మను, అనీష్‌కు రెండు స్వర్ణాలు



**భోపాల్:** జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 17 ఏళ్ల యువ షూటర్ మను భాకర్... సీనియర్, జూనియర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగాల్లో రెండు స్వర్ణ పతకాలతో మెరిసింది. సీనియర్ మహిళల విభాగంలో మను 241 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి పసిడి నెగ్గింది. దేవాన్షి ధమ రజతం, యశస్విని సింగ్ దేశ్‌వాలా కాంస్య పతకం దక్కించుకున్నారు. ఇప్పటికే మను, యశస్విని టోక్యో ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకున్నారు. ఇక, జూనియర్ 10 మీ. ఎయిర్ పిస్టల్‌లో మను 243 పాయింట్లతో టాపర్‌గా నిలిచి టైటిల్ సాధించింది. కాగా, పురుషుల, జూనియర్ 25 మీటర్ల పిస్టల్ టీమ్, వ్యక్తిగత విభాగాల్లో అనీష్ భన్వాలా రెండు స్వర్ణ పతకాలు సాధించాడు.

## ఒక్కొక్కరికి ఒక్కో రూలా?

సెలెక్టర్లను ప్రశ్నించిన భజ్జీ



**న్యూఢిల్లీ:** టీమిండియా సెలెక్టర్లపై వెటరన్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తీవ్ర ఆరోపణలు చేశాడు. ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని ప్యానెల్ పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తోందని విమర్శించాడు. శ్రీలంక, ఆస్ట్రేలియాతో జరగనున్న ద్వైపాక్షిక సిరీస్‌లతోపాటు న్యూజిలాండ్ టూర్‌కు భారత్-ఎ టీమ్‌ను సెలెక్టర్లు ఎంపిక చేశారు. అయితే, మూడు జట్లను ఎంపిక చేసినా ఎందులోనూ సూర్యకుమార్ యాదవ్‌కు చోటు దక్కక పోవడాన్ని భజ్జీ తప్పుబట్టాడు. ఒక్కొక్కరికి ఒక్కో రూలా? అని ప్రశ్నించాడు. 'సూర్యకుమార్ ఏం తప్పు చేశాడు. టీమిండియా, భారత్-ఎ, బి జట్లకు ఎంపికైన ఇతర ప్లేయర్ల మాదిరిగానే అతడూ పరుగులు సాధిస్తున్నాడు. ఆటగాడినిబట్టి నిబంధనలు మారుతుంటాయా?' అని భజ్జీ ట్వీట్ చేశాడు.

## నాలుగు దేశాల టోర్నీ ప్రతిపాదన మాత్రమే..!

బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీ



**న్యూఢిల్లీ:** నాలుగు దేశాల పరిమిత ఓవర్ల సూపర్ సిరీస్ అనేది కేవలం ఓ ప్రతిపాదన మాత్రమేనని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ అన్నాడు. ప్రతి ఏడాదీ ఓ మెగా టోర్నీని నిర్వహించడానికి ఐసీసీ రెడీ అవుతోంది. అలా జరిగితే ప్రముఖ బోర్డుల ఆదాయానికి గండిపడే అవకాశం ఉంది. ఐసీసీ ప్రయత్నాలకు చెక్ చెప్పడానికి.. బిగ్-3గా భావించే భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా బోర్డులు నాలుగు దేశాల సిరీస్‌కు రూపకల్పన చేస్తున్నాయనేది సమాచారం. అయితే, టోర్నీ విషయంలో ఏదీ ఖరారు కాలేదని, కొంత సమయం పడుతుందని గంగూలీ చెప్పాడు. కాగా, బీసీసీఐ 'సూపర్ సిరీస్' ప్రతిపాదనపై ఐసీసీతో చర్చించడానికి సిద్ధమని ఇంగ్లండ్ బోర్డు ప్రకటించింది. నాలుగు దేశాల టోర్నీని 2021 నుంచి ఏడాదికొకసారి రొటేషనల్ విధానంలో నిర్వహించడానికి సమాలోచన చేస్తున్నారు.

## విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీకి సింధు స్థల పరిశీలన

**విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి):** బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటుకు పీవీ సింధు మంగళవారం విశాఖపట్నంలో స్థలాన్ని పరిశీలించింది. ఆర్డీఓ కె.పెంచల కిషోర్, చినగదిలి మండల తహసీల్దార్ నరసింహమూర్తి ఆమెకు వివిధ ప్రాంతాల్లోని స్థలాలను చూపించారు. విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటుకు ఐదెకరాల స్థలం కావాలని సింధు గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. అందుకు ప్రభుత్వం అంగీకరించి, అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. పరిశీలించిన స్థలాల్లో ఏది అనుకూలంగా ఉంటుందో తెలియజేస్తామని రెవెన్యూ అధికారులకు సింధు తెలిపింది.

క్రికెట్ ఆస్ట్రేలియా..దశాబ్దపు

## కెప్టెన్లుగా ధోనీ, కోహ్లీ



**న్యూఢిల్లీ:** ఎంఎస్ ధోనీకి అరుదైన గౌరవం లభించింది. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) దశాబ్దపు వన్డే టీమ్‌కు ధోనీ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ జట్టులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు కూడా చోటు దక్కింది. మొత్తం 11 మంది సభ్యుల డ్రీమ్ టీమ్‌ను సీఏ మంగళవారం ప్రకటించింది. కాగా, సీఏ దశాబ్దపు టెస్ట్ టీమ్‌కు కోహ్లీని కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈ టీమ్‌లో అతడికి మాత్రమే చోటు దక్కింది. అలాగే ఈ దశాబ్దపు బెస్ట్ వన్డే బ్యాట్స్‌మన్‌గా కూడా కోహ్లీ ఎంపికయ్యాడు.

అరణ్యంలో పులి పంజా విసరడానికి ముందు అడుగులు వెనక్కి వేస్తుందంటారు.. అలాగే క్రికెట్ మైదానంలో రోహిత్ కూడా తన ఇన్నింగ్స్‌ను నెమ్మదిగానే ఆరంభిస్తాడు. ఇక ఆ తర్వాత అతడి భారీ షాట్లకు స్టేడియంలోని స్టాండ్స్ సాక్ష్యాలుగా నిలుస్తాయి.. హాఫ్ సెంచరీ, సెంచరీ, డబుల్ సెంచరీ ఇలా ప్రత్యర్థి బౌలర్లను చీల్చి చెండాడుతూ ఏమాత్రం దయలేని ఆటతో ముందుకుసాగుతుంటాడు. ఈ ఏడాది అలాంటి ఆటతీరుతోనే క్రికెట్ ప్రపంచాన్ని అబ్బురపరిచాడు. ప్రపంచ అత్యుత్తమ ఆటగాడైన విరాట్ కోహ్లీతో సమానంగా తన బ్యాట్ పవరేంటో చాటుకున్నాడు.. అందుకే అక్షరాలా ఇది రోహిత్ నామ సంవత్సరమే..



రివైండ్ 2019

# సూపర్ హిట్ మ్యాన్

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

**ఆ**ధునిక క్రికెట్‌లో 'కింగ్' విరాట్ కోహ్లీకి దీటుగా ఆడే మరో క్రికెటర్‌ను ఊహించుకోవడం చాలా కష్టం. స్టీవ్ స్మిత్ యాషెస్‌లో సెంచరీల మోత మోగించినా మయాంక్ అగర్వాల్ టెస్టుల్లో పరుగుల వరద పారించినా కూడా కోహ్లీ అన్ని ఫార్మాట్ల ఆటగాడిగా అందరి కంటే ముందే ఉంటాడు. కానీ ఈ ఏడాది ఒక్క ఆటగాడు మాత్రం విరాట్‌కు పోటీనిచ్చాడు.. ఇంకా చెప్పాలంటే కొన్ని సందర్భాల్లో అతడిని తలదన్నే ఆటను కూడా ప్రదర్శించాడు. అవును.. అతడే రోహిత్ శర్మ. భారత క్రికెట్‌లోనే కాకుండా ప్రపంచ క్రికెట్‌లోనూ 2019 సంవత్సరం ఈ స్టార్ ఓపెనర్‌కు అద్భుతంగా కలిసివచ్చింది. తనకు మాత్రమే సాధ్యమయ్యే హిట్టింగ్‌తో జట్టుకు ఒంటిచేత్తో విజయాలు అందించాడు. ప్రస్తుతం కెరీర్‌లోనే అత్యుత్తమ ఫామ్‌ను ఆస్వాదిస్తున్నాడు. అందుకే మూడు ఫార్మాట్లలో కలిపి ఓపెనర్‌గా పది శతకాలతో 2,442 పరుగులు సాధించిన రోహిత్.. 22 ఏళ్ల క్రితం జయసూర్య (2,387) నెలకొల్పిన రికార్డును సైతం బద్దలుకొట్టాడు.

### వన్డే కింగ్..

ఈ ఏడాది జనవరి 12న సిడ్నీలో ఆసీస్‌తో జరిగిన వన్డేతో ఆరంభమైంది అతడి పరుగుల ప్రవాహం. నాలుగు పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన స్థితిలో ఒంటరిపోరాటం చేస్తూ అతడు సాధించిన 133 పరుగులకు క్రీడాలోకం ఫిదా అయింది. అప్పటి నుంచి సాగిస్తున్న పరుగుల వేట తాజాగా విండీస్‌తో సిరీస్ వరకు అలుపు లేకుండా కొనసాగింది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ ఓటమి తర్వాత విశాఖలో 159 పరుగులతో జట్టును పోటీలో నిలిపాడు. నిర్ణాయక మ్యాచ్‌లోనూ 63 పరుగులతో చెలరేగి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కించుకున్నాడు. మొత్తంగా ఈ ఏడాది 28 వన్డేల్లో 57.30 సగటుతో అందరికంటే ఎక్కువగా 1,490 పరుగులు సాధించాడు. ఇందులో ఏడు శతకాలున్నాయి. సచిన్ (1998లో 9) మాత్రమే ఓ కేలండర్ ఇయర్‌లో రోహిత్ కంటే ఎక్కువ శతకాలు సాధించాడు. అలాగే 13 అర్ధసెంచరీలు సాధించగా, ఇందులో తొమ్మిది జట్టు విజయానికి కారణమయ్యాయి. అటు వన్డేల్లో కోహ్లీ 25 ఇన్నింగ్స్‌లో 59.86 సగటుతో 1377 పరుగులు సాధించి రోహిత్ తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు. ఐసీసీ అంతర్జాతీయ వన్డే ర్యాంకింగ్స్‌లోనూ ఈ ఇద్దరిదే టాప్-2 పొజిషన్. ఇక అన్ని ఫార్మాట్లలోనూ పరుగుల విషయంలో విరాట్ (2,455)కు రోహిత్ (2,442)గట్టి పోటీనిచ్చి స్వల్పంగా వెనకబడ్డాడు.

### ప్రపంచకప్‌లో మొనగాడు

ఇంగ్లండ్‌లో జరిగిన వన్డే వరల్డ్‌కప్ అయితే రోహిత్ శర్మలోని అసమాన ఆటతీరును వెలుగులోకి తెచ్చింది. ఈ మెగా టోర్నీలో ఒకటి కాదు.. రెండు కాదు.. ఎవరూ కలలో కూడా ఊహించని విధంగా ఐదు శతకాలతో చరిత్ర సృష్టించాడు. అప్పటివరకు ఒక టోర్నీలో కుమార సంగక్కర చేసిన నాలుగు శతకాలే రికార్డుగా కొనసాగింది. దక్షిణాఫ్రికాతో ఆరంభ మ్యాచ్‌లోనే 122 పరుగులతో సునామీ రాకను తెలిపాడు. ఇక పాకిస్థాన్‌పై ఆకాశమే హద్దుగా 140 పరుగులతో అలవోక విజయం అందించాడు. ఆ తర్వాత ఇంగ్లండ్, బంగ్లాదేశ్, శ్రీలంకలపై వరుస శతకాలతో భారత్ సెమీస్‌లో అడుగుపెట్టింది. అయితే కీలక సెమీఫైనల్లో ఒక్క పరుగుకే పెవిలియన్‌కు చేరడం అటు జట్టు ఫలితంపై కూడా ప్రభావం పడింది. ఓటమిని జీర్ణించుకోలేని రోహిత్ పెవిలియన్‌లో కంటతడి పెట్టడం అభిమానులను కదిలించింది.

**ఏడేళ్లుగా టాప్‌లోనే (భారత్ నుంచి వన్డేల్లో)**

| ఏడాది | ఆటగాడు | అత్యధిక స్కోరు |
|---|---|---|
| 2013 | రోహిత్ | 209 |
| 2014 | రోహిత్ | 264 |
| 2015 | రోహిత్ | 150 |
| 2016 | రోహిత్ | 171 (నాటౌట్) |
| 2017 | రోహిత్ | 208 (నాటౌట్) |
| 2018 | రోహిత్ | 162 |
| 2019 | రోహిత్ | 159 |

### టెస్టుల్లో ఓపెనర్‌గా

తెల్ల బంతితో ఎన్ని సంచనాలు సృష్టించినా టెస్టుల విషయానికి వస్తే రోహిత్ పేరు వినిపించేదే కాదు. అప్పుడప్పుడు మిడిలార్డర్ బ్యాట్స్‌మన్‌గా ఇలా వచ్చి అలా వెళ్లిపోయేవాడు. కానీ ఈఏడాది ఓపెనర్‌గా ప్రమోటయ్యాక టెస్టుల్లోనూ తానేంటో చాటుకున్నాడు. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో అతడికి ఇన్నింగ్స్ ఆరంభించే అవకాశం దక్కింది. అంతే.. ఈ చాన్స్‌ను రెండు చేతులా ఒడిసిపట్టుకుని సరికొత్త రోహిత్‌ను చూపించాడు. వైజాగ్‌లో జరిగిన తొలి టెస్టులో రెండు సెంచరీలు బాదగా రాంచీ మ్యాచ్‌లో అయితే డబుల్ సెంచరీతో విశ్వరూపం చూపాడు. మూడు టెస్టుల ఈ సిరీస్‌లో 132.25 సగటుతో 529 పరుగులు సాధించాడు. మొత్తంగా ఈ ఏడాది కోహ్లీ (612), మయాంక్ (754), రహానె (642) ఎక్కువ పరుగులు సాధించినా రోహిత్ ఆరు ఇన్నింగ్స్‌లో మూడు శతకాలతో 556 పరుగులు చేసి టెస్టుల్లోనూ తనదైన ముద్ర వేయగలిగాడు.

### హిట్‌మ్యానే..

క్రీజులో కాలు కదపకుండా అతడు సంధించే భారీ సిక్సర్లకు ముగ్ధులైన అభిమానులంతా అతడిని హిట్‌మ్యాన్‌గా పిలుస్తుంటారు. దీనికి తగ్గట్టుగానే ఈ ఏడాది అతడు మూడు ఫార్మాట్లలో మరే క్రికెటర్ సాధించని విధంగా 78 సిక్సర్లతో పాటు 244 ఫోర్లు సాధించాడు. అంతేకాకుండా భారత్ తరపున తొలి వికెట్‌కు రాహుల్‌తో కలిసి 1,008 పరుగులు అందించాడు. ఇందులో ఆరు శతక భాగస్వామ్యాలు వచ్చాయి. ఇంగ్లండ్ ఓపెనర్లు జేసన్ రాయ్, బెయిర్‌స్టోలతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అంతర్జాతీయ టీ20ల్లో రోహిత్ 14 ఇన్నింగ్స్‌లో 396 పరుగులు సాధించాడు.



## ముందు మీ సంగతి చూసుకోండి!

మణి వ్యాఖ్యలను తిప్పికొట్టిన బీసీసీఐ

**న్యూఢిల్లీ:** 'పాక్‌తో పోల్చితే భారత్ అంత సురక్షితం కాదు' అంటూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ ఎహసాన్ మణి వ్యాఖ్యలను బీసీసీఐ ఖండించింది. భారత్ గురించి మాట్లాడే అర్హత మణికి లేదని బోర్డు కోశాధికారి అరుణ్ ధూమల్ అన్నారు. 'ఎక్కువగా లండన్‌లోనే గడిపే వ్యక్తి.. భారత్‌లో భద్రత గురించి వ్యాఖ్యలు చేయడం అసంబద్ధం. ఆ మాటకొస్తే పాక్‌లో సెక్యూరిటీ గురించి కూడా మాట్లాడే అర్హత అతడికి లేదు. అతడు తన దేశంలో నివసిస్తే వాస్తవ పరిస్థితులు అర్థమవుతాయ'ని అరుణ్ అన్నారు. మణి వ్యాఖ్యలను బీసీసీఐ ఉపాధ్యక్షుడు మాహిమ్ వర్మ కూడా తిప్పికొట్టారు. ముందు మీ సంగతి తెలుసుకోండని చెప్పారు. 'ముందు వారి దేశంలో ఎంత భద్రత ఉందో చూసుకోమనండి. దాని గురించి ఆలోచన చేయమనండి. మా భద్రతను చూసుకొనే సామర్థ్యం మాకుంద'ని వర్మ ఘాటుగా సమాధానమిచ్చారు. పాక్‌లో భద్రతపై ఆందోళన వ్యక్తం చేయమని సూచించారు. సొంతగడ్డపై శ్రీలంకతో రెండో టెస్ట్‌లో పాక్ విజయం తర్వాత మణి మీడియా సమావేశంలో తన దేశం గురించి చెప్పకుండా.. భారత్‌లో భద్రతపై మాట్లాడడం విమర్శలకు దారి తీసింది. 'పాక్ సురక్షితమని నిరూపించాం. ఎవరైనా మా దేశానికి రాకుంటే ఇక్కడ భద్రత లేదని వారే నిరూపించాలి. ప్రస్తుతం పాక్‌లో కన్నా భారత్‌లోనే ప్రమాదం ఎక్కువ. ఇక్కడి భద్రతపై ఎవరికీ సందేహాలు లేవు' అని మణి చెప్పారు.

### టీ20లైతే ఓకే..!

● బంగ్లా బోర్డు ప్రతిపాదన

**ఢాకా:** పాకిస్థాన్ టూర్‌కు తాము సిద్ధమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తెలిపింది. అయితే, టెస్ట్‌ల కంటే ముందుగా టీ20ల సిరీస్ ఆడేందుకు బీసీబీ ప్రతిపాదన చేసింది. అక్కడి పరిస్థితులను అంచనా వేయడానికి తమ కోచ్, ప్లేయర్లకు కొంత సమయం దక్కుతుందని, ఆ తర్వాతే టెస్ట్‌లపై నిర్ణయం తీసుకుంటామని బంగ్లా బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ నిజాముద్దీన్ చౌదరి చెప్పారు. కాగా, టెస్ట్ సిరీస్‌కు బంగ్లా నో చెప్పిందని పాక్ క్రికెట్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ వసీం ఖాన్ తెలిపాడు. షెడ్యూల్ ప్రకారం పాక్‌లో బంగ్లా రెండు టెస్ట్‌లు, 3 టీ20ల సిరీస్‌ను ఆడాల్సివుంది.

## విజ్డెన్ టెస్టు జట్టులో విరాట్

**లండన్:** ఈ దశాబ్దపు విజ్డెన్ టెస్టు జట్టులో కేవలం ఇద్దరు భారత ఆటగాళ్లకు మాత్రమే చోటు దక్కింది. ఐదుగురితో కూడిన విజ్డెన్ రివ్యూ ప్యానెల్ ప్రకటించిన ఈ జాబితాలో విరాట్ కోహ్లీతో పాటు స్పిన్నర్ ఆర్. అశ్విన్ ఉన్నారు. మిగతా ఆటగాళ్లలో కుక్, స్టోక్స్, అండర్సన్ (ఇంగ్లండ్), వార్నర్, స్మిత్ (ఆసీస్), సంగక్కర (శ్రీలంక), డివిల్లీర్స్, స్టెయిన్, రబాడ (దక్షిణాఫ్రికా)లకు చోటు దక్కింది.

### టెస్టుల్లోనూ నెంబర్1 గానే..



**దుబాయ్:** వన్డేల్లోనే కాకుండా టెస్టు ఫార్మాట్‌లోనూ విరాట్ కోహ్లీ ఈ ఏడాది నెంబర్‌వన్ ఆటగాడిగా ముగించాడు. తాజా టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో 928 పాయింట్లతో ఉన్నాడు. స్టీవ్ స్మిత్ 17 పాయింట్లు వెనకబడి రెండో ర్యాంకులో, విలియమ్సన్ (864) మూడో స్థానంలో ఉన్నారు. ఇక పుజారా నాలుగో స్థానాన్ని కాపాడుకోగా, రహానె ఆరు నుంచి ఏడో స్థానానికి పడిపోయాడు. పాక్ బ్యాట్స్‌మన్ బాబర్ ఆజమ్ కెరీర్ బెస్ట్ ఆరో స్థానానికి చేరాడు. మయాంక్ 12, రోహిత్ 15వ ర్యాంకులో ఉన్నారు. బౌలర్లలో బుమ్రా ఆరో స్థానంలోనే ఉండగా కమిన్స్ టాప్‌లో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో హోల్డర్, జడేజాల టాప్-2 స్థానాల్లో మార్పు లేదు.



## ఉద్ధవ్‌ను కలిసిన సచిన్, గవాస్కర్

**ముంబై:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేను భారత క్రికెట్ దిగ్గజాలు సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం ఆహ్వానం మేరకు సబర్బన్ బాంద్రాలోని 'మాతోశ్రీ' నివాసానికి వీరిద్దరు కలిసి వెళ్లారు. ఉద్ధవ్ ఠాక్రే గతనెల28న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

2020
ఆంధ్రజ్యోతి పంచాంగం
క్యాలండర్ మార్కెట్‌లో ఉంది
2020 CALENDAR


వెల ₹ 25/-
క్యాలండర్ కొరకు స్థానిక ఏజెంట్‌ను సంప్రదించగలరు
ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.